UNIVERSAL LIBRARY
OU_204477
UNIVERSAL LIBRARY

# తులసీదేవి.

## సతీతులసి – బృందావనము

అను

బయస్కోపు ప్లాటు ననుసరించియుఁ

పురాణముల ననుసరించియు వ్రాయఁబడిన

ఐదంకముల నాటకము.

---

గ్రంథకర్త:

**ముత్తనేని వేంకట చెన్నకేశవులు,**

జగ్గయ్యపేట.

ప్రకటనకర్త:

**పులిపాటి రంగయ్య**

బుక్ సెల్లర్ & పబ్లిషర్స్.

చీరాల, గుంటూరు జిల్లా.

---

మూడవ కూర్పు 1000 ప్రతులు.

---

చీరాల:

లక్కాకుల వెంకటస్వామి ఉపాధ్యాయుడు గారిచే,

శ్రీ దామోదర ముద్రాక్షరశాలయందు ([illegible])

ముద్రింపఁబడి [illegible]

1932.

ll Rights Reserved.]

[ వెల రు 1-0-0

# ఈ నాటకమునందు వచ్చు పాత్రలు.

CHECKED 1951

Checked 1965

## పురుషులు.

సుదాముఁడు—విష్ణు పార్షదుడు, పిమ్మట జలంధరుఁడైనవాఁడు.

ఇంద్రుఁడు— స్వర్గాధిపతి.

యముఁడు— దిక్పతి.

నారదుఁడు— దేవముని.

శంభుఁడు— రాక్షసరాజు, జలంధరునితండ్రి.

శుక్రుఁడు— రాక్షసుల గురువు.

పలాశుఁడు— ఒక రాక్షసుఁడు.

జలంధరుఁడు— కథానాయకుఁడు

Checked 1969

కాలనేమి— తులసీదేవితండ్రి.

పరమేశ్వరుఁడు— ఈశ్వరుఁడు.

బ్రహ్మ— సృష్టికర్త.

విష్ణువు— దేవుఁడు.

జయంతుఁడు— ఇంద్రుని కొడుకు.

మంత్రి, సేవకులు, విప్రులు, రక్కసులు.

## స్త్రీలు.

తులసీదేవి— కథానాయిక.

పార్వతి— ఈశ్వరుని భార్య.

లక్ష్మి— విష్ణుభార్య.

చండి— పలాశుని భార్య.

గాంధి— తులసీదేవియొక్క చెలికత్తె.

శచి— ఇంద్రునిభార్య.

మాయాపార్వతి—

శ్రీరస్తు.

# తులసీదేవి.

## ప్రథమాంకము.

### ప్రథమ రంగము.

అరణ్యము.

[ప్రవేశము:— రోజుచు సుదాముఁడు పరుగెత్తికొని వచ్చుచున్నాఁడు]

సుదా:— అయ్యలారా! రక్షింపుఁడు. రక్షింపుఁడు.

ఇంద్రుఁడు:— (వజ్రపాణియై ప్రవేశించి) ఏమిరా? సకలలోకనాయకుఁడు శచీనాయకుఁడు నిన్ను శిక్షింపఁ బోవుచుండ నిన్నొరుఁడు రక్షించునని యాశపడుచుంటివా? ఎంతమూఢుఁడవు?

మ॥ అతిమత్తప్రతివీరనిర్మథన వి ♦ ద్యాపారగుండౌ శచీ
పతి నీప్రాణములన్ హరింపఁగ వలం ♦ పన్ లాతి యేనీచుఁడో
గతియై ప్రోచునొ నిన్ను చూచెదముగా ♦ గన్నార హర్యక్షము
ద్ధతినెంటాడుమృగంబు గావఁగలదో ♦ దానక్క నిక్కంబుగన్॥

(వజ్రాయుధము ఝళిపించుచున్నాఁడు).

సుదా:—(గడగడవడఁకుచు) హా! కృపాళూ! సకలసురసార్వభౌమా! ఎందుంటివి? రక్షింపవేమి?

[తెరలో] — ఇదిగో వచ్చుచుంటిని.

సుదా__అమ్మయ్యా! బ్రతికితిని. పార్వతీమనోహరుఁడు పాలింపవచ్చుచున్నాఁడు.

ఇంద్రి—(తత్తరముతో) ఇదేమి? పరమేశ్వరుఁ డీదుష్టుని రక్షింపవచ్చుచున్నాఁడా? ఇంక నే నుపేక్షింపరాదు. పిమ్మట నేమయినఁ గానిమ్ము. ఆ హరియే యున్నాఁడు.

(సుదాముని వజ్రాయుధమున ఖండించును).

[ప్రవేశము__నారదుఁడు.]

నార__అయ్యో దేవేంద్రా! ఎంతపనిఁ జేసితివి.

ఆ. వె. యతివరేణ్యు సగము ♦ టందు భావించి గీ
టడచినాఁడ వొక్కొ ♦ యచలవైరి
వేయికనులు గలుగు ♦ విబుధవిభునికింత
దృష్టి మాంద్య మేటి ♦ కెనఁగె నొక్కొ.

ఇంద్రి__మునిచంద్రమా! యతివరేణ్యుఁ డెవ్వఁడు? వీని మాయవేసముఁజూచి మునియని భ్రమించుచుంటిరా! ఇంతమాత్రమునఁ గుమతి యతియగునా!

సీ॥ అడవిఁ జేరిన మాత్ర ♦ నధముండు మునియగు
నేనియుఁ బెబ్బులి ♦ యేలకాదు?
జడలు దాల్చిన మాత్ర ♦ జడుఁడు తాపసియగు
నేనియుఁ గేసరి ♦ యేలకాదు?
గాలిఁ బీల్చినమాత్రఁ ♦ గఠినుండు జటియగు
నేని దర్వీకరం ♦ బేలకాదు?
తలక్రిందుగఁ దపంబు ♦ సలిపినంతఁ జెనఁటి
ఋషియైన గబ్బిలం ♦ బేలకాదు?
గీ॥ మాయ వేసముల్ వేసిన ♦ మాత్రముననె
మాయ నటనల వర్తించు ♦ మాత్రముననె

బాసవాధముండు మహర్షి ♦ నైనయెడల
నటకుఁ డేటికిఁ గాకుండు ♦ జటిలవరుఁడు ?

నార__ దేవేంద్రా! నీవు పొరఁబడితివి. పరమ భాగవతోత్తముఁడగు నీ సుదాముని నీపగతుఁ డగు దంభుఁడని భావించి ఖండించితివి. ఆదంభుఁ డీయుదయమునసనే శుక్రాచార్యుని యనుజ్ఞచే నిజనగరమునకుఁ జనినాఁడు. వాఁడు తపమొనర్చినది కూడ నీ సమీపస్థలముననే. ఇది యంతయు నిట్లు గావలసియున్నది.

ఇంద్ర__మహర్షి చంద్రమా ! పరమేశ్వరుఁడు నన్నేమిచేయునోగదా?

నార__చంపెదనని యాగ్రహపడెను నతని బ్రహ్మాదులు వారించుచున్నారు. భయపడకుము.

[నేపథ్యమున]

మ॥ పనిలే దేమిటి కష్టగించెదు నను ♦ బద్మాసనా ! మానుమా
వనజాతానన ! శౌరి! యూరకొనుమా ♦ వారింపఁగాఁబోకుమా !
ముని మద్భక్తునిఁ జక్కడంచిన దురా ♦ త్ముని దుర్మరుని జంభమ
ర్దను, మత్ఫాలవిలోచనానల మహా ♦ గ్రజ్వాలలన్ గాల్చెదన్.

నార__ సంక్రందనా! లెమ్ము. చంద్రశేఖరుని విరించియు, నంబికయు నిన్ను మన్నింప వేఁడుచున్నారు. నీవుంబోయి యా ధూర్జటి పాదమ్ములఁబడి ప్రార్థింపుము.

ఇంద్ర—(లేచి) ఆహా ! బ్రదికితిని. (పరుగిడఁబోయి సందేహించి నిలుచున్నాఁడు.)

నార__ఓహో! బలశాసనుఁడు పురశాసనుని కంటిమంటంజూచికొని వింగని బెదరు నెలుగుబంటి వగిది భయపడుచున్నాఁడు. (ప్ర)

ఆ. వె. విబుధరాజ ! యేల ! ♦ వెడఁగట్లు బెదరెదు
మదనవైరి కంటి ♦ మంటఁ జూచి

శిరముపైని వెలుఁగు ♦ శశిరాఁశు జూటాగ్ర
మందుఁగలుగు గంగ ♦ సరయువోటు ?

సందేహింపక సత్వరమున నరిగి యిందుధరుని చరణారవిందములపైఁ బడుము.

ఇంద్రు—(చేతుల మోడ్చి) తండ్రి! గౌరీమనోనాయకా!

శా॥ సర్వజ్ఞుండవు నీ వెఱుంగనిది లే ♦ శంబేనియున్ లేదు దై
త్యోర్వీనాథుఁడు దంభుఁ డీతఁడని లో ♦ నూహించి మందుండనై
దుర్వారాగ్రహ మొప్ప నీమహిప్రియు భ ♦ క్తున్ మానిమాయించితిన్
శర్వా! కావున నే నొనర్చు దోసఁగుల్ ♦ సైరించి రక్షింపవే.

(పరుగిడుచు నిష్క్రమించును.)

నార— (ప్రేక్షకులఁజూచి) ఓహో! ఉగ్రుఁ డింద్రు ననుగ్రహించినాఁడు.

ఆ. వె. బంతిఁ జేతఁ బట్టి ♦ పాఱవైచు భంగి
ఫాలనయనజనిత ♦ కీలఁ గేలఁ
బూని విసరివైచె ♦ భూరికరుణభక్త
పోషణుండు భుజగ ♦ భూషణుండు.

దివ్యులు దేవదేవుని సంస్తుతించుచున్నారు. నేను నటకుఁ బోయెద.

(నిష్క్రమించును)

[ప్రవేశము—పార్వతీపరమేశ్వరులు, బ్రహ్మ, ఇంద్రుఁడు, నారదుఁడు.]

పర— దేవేంద్రా! ఆ సుదాముని కళేబర మెందున్నదో చూపుము.

బ్రహ్మ— పరమేశ్వరా! దానితో నేమవసరము?

పర— నా భక్తునిఁ దిరిగి జీవింపఁ జేసెదను.

బ్రహ్మ— అది యనావశ్యకము. వాఁడు దానవుఁడై పుట్టుటకు శపింపఁబడియున్నాఁడు. కావున వాఁడు దైత్యుఁడై నీకు భక్తుఁడు గాఁగలఁడు.

పర—వారిజాసనా ! జగత్త్రియనాథుం డగు నారాయణునకుఁ బార్ష దుండును నాకు భక్తుండు నగు నాతఁడు దానవయోనిం బుట్ట వలసినదా ?

బ్రహ్మ—అయోనిసంభవుండై దైత్యుఁడు గాఁగలఁడు.

పర—దేవేంద్రా! నిన్ను క్షమించితి నని నీవు సంతోషింపవలదు.

ఆ. వె. ఆతఁ డింద్రపదము ♦ హరియించు నని గదా
యింత సేసి తీవు ♦ వృత్రవైరి!
తప్పు కతఁడు ముందు ♦ దనుజేశుఁడై సుర
రాజపదముఁ గాంచి ♦ గ్రోలుఁ జూవె !

ఇంద్ర—(స్వగ) ఆహా! విషకంఠుఁడు న న్నీవిధమున శిక్షించినాఁడు.

బ్రహ్మ—(వారించి) నివిజనాయకా! చింతింపకుము, పిమ్మట నీకు శుభము గలుగును.

నార—(తెరవంకకుఁ జూచి) ఆహా ! పరమేశ్వరా ! నీవు విసరివైచిన యగ్నిజ్వాల యింకను జల్లాఱలేదు.

ఇంద్ర—(స్వ) కోపముమాత్రము చల్లాఱినదా ?

నార—

ఉ. నాకము నేర్చునో ? సురల ♦ నాశమొనర్చునో ? కానలక్ష్మ్యగా
నీక మడంచునో ? పురుల ♦ నీఱొనరించునో? నొంచునో ప్రజ?
గాఁకలఁ గ్రక్కుచున్ బొగలఁ ♦ గప్పుచు దిక్కుల నంతరిక్షమున్
దాఁకుచుఁ గీలమేగెడిని ♦ దాని మరల్పవె ? దీనరక్షకా !

పర—నారదా ! దానిచే నిప్పు డేయుపాయమును సంభవింపదు. అది వోయి జలరాశిలోఁబడును.

నార—(బ్రహ్మతో అపవారించి) ఇప్పు డేయుపాయము సంభవింప దన్న నేమి ? ముం దెప్పుఁడైనఁ గలుగుననియా ? అదిగాక యా

జ్వాల సందర్భమునసే పడవలయుననియేమి? సర్వేశ్వరుఁడు దలంచినచో నది యూరక చల్లాఱిపోవునే?

బ్రహ్మ—(అపవారించి) నారదా! నీ సందేహముఁ బిమ్మటఁదీర్చెదను.

పర—ఇఁకఁ బోదము. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

## ద్వితీయ రంగము.

### ప్రదేశము — అరణ్యము.

[ప్రవేశము:—దంభాసురుఁడు, శుక్రాచార్యుఁడు.]

దంభు—ఆచార్యా! భార్గవా! దైత్యమాతంగమృగేంద్రుఁడగు నింద్రుని బారింబడక నీయనుగ్రహమున జీవించితిని. కాని—అక్కటా! పెక్కుదినంబులనుండి ముక్కంటిం గూర్చి నాసలిపిన తపమెల్ల వృథాయయ్యెగదా? అయ్యయ్యో! దక్షవైరిని మెప్పించి తమ ప్రభుఁడు దివిజబృందములఁ బవరంబునఁ నిర్జింప వరంబులఁ గొని వచ్చునని గంపెడాసతో నెదురుసూచు నిశాచరులకడకు నే నే మొగంబు వెట్టికొని వత్తు.

శుక్రా—దంభాసురా! చింతింపకుము. నీతపంబు వృథాపోదు. దనుజుల యాసలు నెఱవేఱినట్లే.

దంభు—మహాత్మా! ఏది? నాచేసిన తపంబునకు మెచ్చి చిచ్చఱకంటివేల్పు సాక్షాత్కరింపలేదే? నేఁ గోరువరంబు లనుగ్రహింపలేదే? లబ్ధవరుండనై దానవుల నిట్లు గానలఁ బట్టించిన గర్వాంధుని గీర్వాణ వల్లభుని నాలమ్మున నెదిర్చి పాఱఁదోలలేదే? స్వర్గ రాజ్యలక్ష్మిని రక్కసుల కైవసముగావింపలేదే? ముప్పది మూఁడుకోట్ల వేల్పుల ముప్పతిప్పలువెట్టి మూఁడు చెఱువుల నీరు ద్రావింపలేదే? వాసవుని యాలుబిడ్డల చెఱవట్టి వల వల నేడ్పింపలేదే? మాయాస లేమి నెఱవేఱినవి?

శుక్రా—ఇఁక నెఱవేఱఁగలవు.

దంభు__ ఎట్లు ?

శుక్రా__ నీ కుమారునివలన.

దంభు— గురువర్యా! నన్నుఁ బరిహాసించుచుంటిరా ? నా కింతవఱకు సంతానమే లేదే ; ఇఁకముం దట్టికొడుకు జన్మించునా?

శుక్రా__పరమేశ్వరానుగ్రహమున నయోనిసంభవుండును మహాతేజస్సంపన్నుఁడును నగునట్టి శిశురత్నము నీకు లభించును.

దంభు—గురూత్తమా ! నా కట్టి భాగ్యము గలుగునా ? మీ శిష్యులగు దైతేయుల కట్టి యదృష్ట మున్నదా ?

శుక్రా__ఉన్నది. పురంబునకుఁ బోదము నడువుము.

దంభు__ చిత్తము. (నిష్క్రమించుచున్నారు.)

తృతీయ రంగము.

ప్రదేశము — సముద్రతీరము.

[ ప్రవేశము:— నారదుఁడు, ఇంద్రుఁడు, యముఁడు.]

ఇంద్రు__ నారదమునిచంద్రా ! యేదో వింతఁ జూపించెదనని మమ్ము నీకడలి దరికిఁ దీసికొనివచ్చితి వేమి ?

నార__మీకుఁ జూపవలసినవింత యిందే యున్నది.

ఇంద్రు— ఏది ?

నార—అటు చూడుఁడు ! (ప్రక్కకుఁజూప నిద్దఱు చూచుచున్నారు.)

ఇంద్రు— వీఁ డెవ్వఁడు ?

గీ. అంబరమున నర్కుఁడువోలె ♦ నర్ణవమునఁ
దేజరిల్లెడు, వనిమృగ ♦ రాజుపగిదిఁ
గడలిఁ దిరిగెడు, నీచిన్ని ♦ బుడుతఁ డెవఁడొ ?
వంక లేదు వీనికి మది ♦ శంక లేదు.

యము   బృందారకసార్వభౌమా ! ఇదియేమివిచిత్రము ?

ఉ॥ వారిధి నీఁదు మీనుగతి, ♦ వ్రయ్యఁగ మోఁదుఁదిమివ్రజంబుఁ,గుం
భీరములం దెరల్చెడుఁ, ది ♦ మింగల వారములన్ నొగిల్చెడున్
గ్రాహసహస్రదంష్ట్రములఁ♦గూల్చెడుఁ, దూల్చెడుగ్రాహకోటి, స
య్యారె! నొకింత లేఁడు త్రిద♦శాధిప! వీఁ, డిదియేమిమాయయో?

నార — నాకు వీనింజూడఁ "బిట్టకొంచెము కూఁతఘన" మను సామెత జ్ఞప్తికి వచ్చుచున్నది.

[నేపథ్యమున]

నారదమునీంద్రా ! నీకు నమస్కారము. దేవేంద్రా! జాగ్రత్త! నిన్ను బూడిదఁజేసెదను. దండధరా! జాగ్రత్త ! నీపండ్లు విఱుగఁ దన్నెదను.

ఇంద్రు— దండధరా ! వీఁ డి ట్లనుచున్నాఁడేమి ?

యము— బ్రహ్మమానసపుత్త్రా ! వీఁ డి ట్లనుచున్నాఁడేమి ?

నార — ఏమో ? సుపర్వాధీశ్వరా! వీఁ డిట్లనుచున్నాఁడేమి? వీఁడు మన చెంతకు రా నుద్దేశించుచున్నాఁడు గాఁబోలు ? దరికివచ్చి చేతులు చాఁచుచున్నాఁడు. నిర్జరేంద్రా ! చేయిఁ జాఁపుము. వచ్చునేమో చూతము.

ఇంద్రు— ( అట్లు చేయుచున్నాఁడు.)

[ నేపథ్యమున]

ఊఁ హు.

నార— సమవర్తీ ! నీవు చాఁపుము.

యము—(అట్లు చేయును.)

(నేపథ్యమున)

ఊఁ హు.

ఇం— మునీంద్రా ! నీవు చాఁచిచూడుము.

నార—(అట్లు చేయును. బాలుఁడు రా నీవలకుఁగొని వచ్చుచున్నాఁడు.)

నార— ఆహా! ఈచిన్నపాపఁ డెంతవన్నెకాఁడు! చూడుడు. చిఱు నగవు చిన్నిబుగ్గలఁజిగురింప మీవంక కెట్లుచూచుచున్నాఁడో?

యము—(శిశువు నెత్తికొని పరిశీలించుచు) వీని కటియు, నురంబును, నిటలంబును మిగుల విస్తృతంబులు. పాణి పాదంబులు పద్మశంఖాది చిహ్నితంబులు. వీఁడు తప్పక ఱేఁడు గాఁగలఁడు.

నార—(స్వ) ముల్లోకములకు.

యము—(ముద్దాడఁబోయి శిశువును విడిచిపెట్టుచున్నాఁడు.)

నార—కటకటా! ధర్మరాజా! ఇదియేమి? కుసుమసన్నిభశరీరుండగు నీ కుమారుఁ గ్రిందఁ బడనైచితివి. పాప మీపాప కెంత నొప్పి గలిగెనో గదా? (ఎత్తుకొని యింద్రున కిచ్చును.)

యము—దివ్యర్షి చంద్రా! ఈనిసువు సామాన్యుఁడు గాఁడు; నే ముద్దిడఁబోవ నాకుత్తుకఁబట్టికొని గ్రుక్కు వెళ్ళునట్లు నొక్కినాఁడు.

నార—(నవ్వుచు) ఆహా! కృతాంతుని బాధింపఁజాలిన పోటుబంటు నేఁటికిఁ గలిగినాఁడు!

ఇంద్రు—వీనింజూడ వింత వొడముచున్నది. అఁ! అఁ! ఇదియేమి? (బాలుని క్రిందఁ బడనైచుచున్నాఁడు.)

నార—నిర్జరేశ్వరా! ఏమి! ఆబుడుత నీకుత్తుకఁగూడ నొక్కెనా యేమి?

ఇంద్రు—యతిచంద్రమా! వీఁడు నా కిప్పట్టున ఘోరాకారుఁడగు నొక క్రూరదానవునితీరునఁ గన్పించినాఁడు. ఔరా! వీఁడునిక్కముగ రక్కసుఁడే. వానిం బరిశీలింపుఁడు. అంతపైనుండి క్రిందఁ బడియు నింతయు నొవ్వక నన్నుఁబరిహసించుటకో యనఁ గిలకిల నవ్వుచున్నాఁడు.

యము—ఇందనుకఁగూడ నీ చిఱుత యిటులే నవ్వినాఁడు.

నార — మహోగ్రవమధ్యంబున జంకుగొంకు లేక సంచరించుచుండ నీ కూనందిలకించినప్పుడే నేను వీఁడెవ్వఁడో సామాన్యుఁడుగాఁడని యనుకొంటిని.

యము — నిశ్చయముగ వీఁడు దివిజవైరియే.

ఉ॥ ఏటికి సంశయింప దివి ♦ జేశ్వర! వీఁడొక రక్కసుండె, ము
న్నాటికి నీని నీక్షణము ♦ మ్రింపఁగఁజేయుము నేఁడు మానినన్
జాటగు గీటణంచుటకుఁ ♦ బైని, యుపేక్ష యొనర్పఁబోలునే
గోటను బోవుదానికిని ♦ గొడ్డలిఁ గొంబనివచ్చు నంతకుఁ.

నీ వెంకులకో సందియ పడుచున్నాఁడవు? నేనే వీని మ్రింపించెద జూడుము. (దండము నెత్తి కొట్టఁబోవుచున్నాఁడు,)

నార — తొందరపడకుము.

[నేపథ్యమున]

తొందరపడకుము. దండధరా! తొందరపడకుము.

ఇం — ఓహో! వారిజాసనుఁడు వచ్చుచున్నాఁడు.

నా — (స్వ) ఈమహాసీయుని రాకవలన నావినోదమునకు భంగము కలిగినది.

బ్రహ్మ — (ప్రవేశించి) దండధరా! ఏమిచేయఁబోవుచుంటివి? ఆ బాలుఁడు కాలకంధరనేత్రాగ్నిజ్వాలవలనఁ బుట్టినవాఁడు!

ఇంద్రు — (స్వ) అహో! పరమేశ్వరుఁ డింతులకా కీలుఁగడలి బడవైనుట.

బ్రహ్మ — (అపవారించి) నారదా! సివిదియుంతయు నావలన నెఱింగియు నూరక చూచుచుంటివా?

నార — (అపవారించి) మహాత్మా! వారించుచుంటినిగాదా? ఏదోవినోదముకొఱకు వీని కీర్తిసువుంగూర్చి యింతవఱకుఁ జెప్పనైతి. చెప్పనుద్దేశించుచుండఁగనే మీరు విచ్చేసితిరి.

ఇంద్రు—వాణీనాథా ! ఈ దైత్యార్భకుఁ డిప్పుడే మాపై ద్వేషము గనఁబఱచుచున్నాఁడు. ముందు వీనివలన వేల్పులకెట్టి యిక్కట్టులు గలుగ నున్నవో కదా ?

బ్రహ్మ—ఈశ్వరసంకల్ప మట్లున్నది. మన మేమిచేయఁగలము ? ఈ సిసువు జలముచే ధరింపఁబడినవాఁడు గాన జలంధరుఁ డనుపేరం బరఁగుఁగాక ! సముద్ర ! తిరస్కరణీ ప్రభావమున నొరులకంటఁబడక యీకుమారునిఁ గొంపోయి బలిపురంబున దంభుని యింట విడిచి రమ్ము.

ఇంద్రు—అయ్యో! అ దంభుఁడు సురకోటికి గర్భశత్రువు. ఈబాలుని వానికే యొసఁగనేల ?

బ్రహ్మ—ఇది పరమేశ్వరాజ్ఞ—సందేహించు చుంటి వేమి ?.

నార— పాప మింతకు మున్న సంతఁ డీసిసువు నెత్తికొన, వీఁడు గుత్తుకఁ బట్టికొని నొక్కినాఁడు. తిరుగ నట్టి యిబ్బంది గలుగునని కాలుఁడు భయపడుచున్నాఁడు గాఁబోలు ? ఏమి దండధరా ! అంగలార్చే గాదా సందేహము?

బ్రహ్మ—భయములేదు. దంభునియింట నీవు వీని విడిచివచ్చువఱకు వీఁడు నిద్రాపరవశుఁడై యుండును.

యము—చిత్తము. (బాలు నెత్తుకొని పోవుచున్నాఁడు.)

నార—(స్వ) పాప మీయంతకుఁ డింతవఱకుఁ బాశములఁ బ్రాణములఁ గొనిపోవుటయేకాని దేహముల మోసికొనిపోవుటెఱుఁగఁడు. నేఁ డాభాగ్యమును లభించినది.

బ్రహ్మ—ఇఁక మనము పోవుదము.

(నిష్క్రమించుచున్నారు)

శ్రీ ర స్తు.

# తులసీదేవి.

## ద్వితీయాంకము.

### ప్రథమ రంగము.

ప్రదేశము — అరణ్యము.

[ ప్రవేశము — పలాశుఁడు. ]

పలా__చండీ ! చండీ ! ఎచ్చట నుంటివి ?

చండి—(నేపధ్యార్థప్రవిష్టయై) ఇదిగో ! వచ్చుచుంటిని. (తొందరగా నెదుటికివచ్చి) మిగులనార్భాటముగ వచ్చితివి ? ఏమి తెచ్చితివి?

పలా—వీనుల పండు వగువార్త.

చండి—వీనులకుమాత్రమేనా పండువ ? కడుపు నిండవలసినదేనా ? ఇంకను నే నెంచవలసినదేనా? అయ్యో! అయ్యో! నిన్నటియుదయమునుండి యొకజల్లెడే మాంసమైనఁ గడకొరక కడవెడు రక్తమైనఁ దేనేరనైతివే? ఇట్టి చేతగాని పెద్దమ్మలు పెండ్లాడు టెందులకు ? పెండ్లాల నేడ్పించు టెందులకు ? (ఏడ్చుచున్నది.)

పలా__ఓసీ! ఏడువకు. ఇంక నీకుఁ గావలసినంత పలలంబును గావలసినంత సల్లయు లభింపఁగలదు.

చండి__ఎట్లు ? పలాశుఁడుచచ్చెనా ?

పలా__జలంధరుఁడు స్వర్గముపై దాడివెడలుచున్నాఁడు.

చండి__జలంధరుఁ డెవ్వఁడు?

పలా__దానవేశ్వరుఁడగు దంభుని పుత్రుఁడు.

చండి__దొరికినవాఁడా? నేఁ జూచినప్పుడు నా మోఁకాలంత లేఁడు. ఇంతలో నింతవాఁడయ్యెనా?

పలా—తపమొనర్చి త్రిమూర్తుల మెప్పించి ముల్లోకముల గెలువ వరములు గొనివచ్చెనఁట. అతని దర్శించుటకుఁ బెక్కుమంది రక్కసులు జాలంధరమున కరుగుచున్నారు. మనము__

చండి—జాలంధర మేమి?

పలా__విశ్వకర్మ జలంధరునకు నిర్మించి యిచ్చిన నగరము. రెండు మూఁడు దినములలోనే దాడివెడలునని తెలియుచున్నది. మనము నటకుఁ బోదము. రమ్ము__

చండి__ఆలస్యమేల? నడువుము. దారిలోనే జడదారియైన దొరకినఁ గడుపు చల్లఁజేసికొని పోదము.

(నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయరంగము.

ప్రదేశము:— మందిరము.

[ప్రవేశము__జలంధరుఁడు, దంభాసురుఁడు.]

జలం—తండ్రీ! సంకోచించుచుంటి వేమి? దండయాత్ర కనుజ్ఞ దయచేయుము. (అనుబంధము 1,)

శా. పౌలోమీవిభుఁ బాఱఁదోలి, వరుణుం ♦ బాధించి, వైవస్వతుం
జాలింబొందఁగఁజేసి, యక్కలదొరం ♦ జక్కాడి, దైత్యాలికిం
మేలుం గూర్చెద, మేలనం భువనముల్ ♦ మీ వైరముం దీర్చెదం
జాలుం గాలవిలంబమేటికి నిఁక మా ♦ జ్ఞం దానవగ్రామణీ!

దంభా—నాయనా! జలంధరా! నావైరముఁ బిమ్మటఁ దీర్పవచ్చును. మొదట నాముద్దు దీర్పుము. కాలనేమిపుత్రిక తులసి మిక్కిలి చక్కనిది. మఱియుఁ జిన్ననాఁటఁగోలె నీయెడ నపరిమితాను రాగము గలది. ఆకుసుమకోమలం బొడ్లియాడి —

జలం— జనకా! నన్ను మన్నింపుము.

గీ. ఇందుఁడనకు మృత్యువు ననుగ్ర ♦ హించువఱకు
నెట్టికన్నెనేనిఁ బరిగ్ర ♦ హింప నేను
దివిజవల్లభుసతిత్రాడు ♦ ద్రెంచువఱకు
సుదతిమెడఁగట్ట మంగళ ♦ సూత్రమేను.

అనుబంధము. 2

దంభా— కుమారా! నీవింత మూర్ఖపుఁ బట్టుఁ బట్టిననెట్లు? నినుఁబోఁటి బుద్ధిమంతునకు గుర్వాజ్ఞ తిరస్కరింపఁ దగినదా?

[ప్రవేశము— శుక్రాచార్యుఁడు.]

వారుగో! గురుపాదులవారు విచ్చేయుచున్నారు. వారి యభిమతము గూడ వినఁగలవు.

జలం—దంభు—గురూత్తమా! నమస్కారము.

శుక్ర—కల్యాణమస్తు.

దంభా—దేవా! పీఠ మలంకరింపుఁడు.

శుక్ర—(కూర్చుండును.)

జలం—ఆచార్యా! శిష్యవత్సలా!

కం. బృందారక సందోహము
మ్రందింపఁగ బాడివెడల ♦ మదినెంచితి నా
జ్ఞం దయసేయవె విద్వ
ద్వందిత! కరుణాసముద్ర! ♦ దనుజాచార్యా!

శుక్రా—వత్సా! జలంధరా! దండయాత్రకు నేఁడే సిద్ధపడుచుంటివా? ఇంత తొందర యేల?

జలం—మహానుభావా! తొందర యేటికని ప్రశ్నించుచుంటిరా?

సీ॥ గీర్వాణనివహంబు ♦ గీటడంపకయున్న
నీశిష్యులకుఁ గీర్తి ♦ నెగడునయ్య?
గంధర్వబృందమ్ము ♦ గారింపకయయున్న
నమరారులకు భాగ్య ♦ మబ్బునయ్య?
కిన్నరవ్రాతంబు ♦ మన్నిగొనకయున్న
నసురలకుఁ శుభం ♦ బమరునయ్య?
విద్యాధరగణంబు ♦ విదలింపకయయున్న
దైత్యులకు ముదంబు ♦ దనరునయ్య?

గీ. సిద్ధుల నడంచి గుహ్యక ♦ శ్రేణి నొంచి
ఖచరులఁ గలంచి భోగుల ♦ గండణంచి
మించి ముల్లోకముల నాక్ర ♦ మింపకున్న
నెల్లసుకములు దనజుల ♦ కెసఁగునయ్య?

శుక్ర—జలంధరా! దివిజులఁదీటడంచుట మాకును బ్రియమే. కాని మున్నటివఱకుఁ దపోవనంబులఁ గడపితివి. దైత్యసార్వభౌముని పుత్త్రుఁడవయ్యు నింత కేసుఖమ్ము నెఱుఁగవైతివి, నీతండ్రి ముద్దుమురిపెములనైనఁ దీర్పవైతివి. అతఁడు నీకొఱకు మొగము వాఁచియున్నాఁడు. నీకుఁ బెండ్లిగావించి రాజ్యమప్పగించి తన భారము దగ్గించుకొనఁదలఁచుచున్నాఁడు. ఆతని యిచ్ఛచొప్పున ననురూపవతిని వివాహమాడి పట్టముఁగట్టుకొని కొన్నిదినంబులు రాజ్యభోగంబు లనుభవించి పిమ్మట దండయాత్రకు సిద్ధపడుము. ఇంతలో మించిపోవునది లేదు. మఱియు—

జలం___మహాత్మా! వివాహమాడి, పట్టముగట్టుకొని రాజ్యభోగంబు లనుభవింపుమని మీరు సెలవిచ్చుచున్నారు. మీకీ శిష్యపరమాణువుపైఁ గల కనికరము దక్కిన శిష్యులపై నేల లేదయ్యెనో నాకుఁ జిత్రముగనున్నది. వారు వసు నిక్కట్టులకు లెక్కయున్నదా ? అశనమబ్బక నడవులలో నల్లాడుచున్నారు ! కడుపుఁ జేతఁబట్టికొని విదేశములఁ దిరుగుచున్నారు ! నిలువ నీడలేక పర్వతగుహలలోఁ గాలముఁ గడపుచున్నారు ! ప్రజ లిట్లు పడరాని యగచాట్లు పడుచుండ సిగ్గులేక నేను సింహాసన మెక్కి తైతక్కలాడవలసినదా ? అ భాగ్యదేవతపాలంబడి వా రల్లాడుచుండఁ బెండ్లమును బ్రక్కబరుండఁబెట్టుకొని నేను సుఖపడవలసినదా ? వా రాలుబిడ్డలఁ బోషింపలేక వలవల నేడ్చుచుండ నేను బొ్రద్దుఁబుచ్చుకొనలేక ముద్దియతో గిలకిల నవ్వవలసినదా ?

సీ. అశనమబ్బక లోకు ♦ లల్లాడ భూపుండు
పలలమ్ము దిని తెగ ♦ బలియవలెనొ ?
గంజిలేక జనమ్ము ♦ గడగండ్లు పడుచుండఁ
గల్లానివిభుఁడు మ♦ త్తిల్లవలెనొ ?
గోఁచిగల్గక జనుల్ ♦ గుందుచుండఁగ రాజు
జిలుఁగు వల్వలు దాల్చి ♦ కులుకవలెనొ ?
నిలువనీడయు లేక ♦ విలపింపఁ బ్రజ, ఱేఁడు
పసిఁడిమేడలఁ బండి ♦ యొసఁగవలెనొ ?

గీ. భూరిదారిద్ర్యమునఁ బ్రజల్ ♦ వ్రాగిలిపొగిలి
ధరణి వేఁడికన్నీళులఁ ♦ దడుపుచుండ
రాజ్యరమను మదించి ధ ♦ రావరుండు
గొంచ కానందబాష్పముల్ ♦ గురియవలెనొ ?.

గురుసత్తమా ! మీశిష్యుని జయశ్రీలోలుని గావింప నుద్దేశింపుఁడు గాని తుచ్ఛసుఖలోలు నొనర్పఁ దలంపకుఁడు.

శుక్రు—వత్సా! జలంధరా! నిన్నుఁ గొన్ని దినములు నిలువుమనుటకుఁ గారణము నిన్నుఁ దుచ్ఛసుఖలోలుని గావించి చిరకాలము నుండి పలుబాములువడు దైత్యుల నుద్ధరింపకుండ నుద్దేశించి కాదు. కాలనేమి నీవలె బ్రహ్మాదులవలన వరములు వడసిన వాఁడు. ఆతనిసాయము నీ కత్యావశ్యకము. తన కుమారియగు తులసి నతఁడు నీకొసంగఁదలచియున్నాఁడు నీ తండ్రియు నత నికి మాటనిచ్చి యున్నాఁడు. నీవాకన్నం బెండ్లియాడనిచో నాతఁ డలుకవహించును. మఱియుఁ బెక్కుమంది రక్కసులు విదే శములలో నుండిరని యింతకుమున్న నీవ చెప్పితివిగదా? వారం దఱు నిటకువచ్చువఱ కొక సంవత్సరమైన నగును. అంతవఱకు నాఁగవలసిన దేకదా? ఇంతలో నీతండ్రికోర్కె నేలదీర్పరాదు?

దంభా—మహాత్మా! మీరుగు చెప్పవలసిన ముఖ్యమగుసంగతి మరచితిరి. అది నేనుజెప్పెదను కుమారా ! గురుపాదులవారు నీకుఁ గొన్ని శస్త్రాస్త్రములు సమంత్రకంబులుగ నుపదేశింపఁ దలఁచి యున్నారు. కావున నెట్లును నీవు కొన్నిదినము లాఁగవలసియే యున్నది.

జలం—తండ్రీ ! ఏవో కారణములు చెప్పి మీరు నన్ను నింటఁగట్టివేయఁ జూచుచున్నారు. నన్ను క్షమింపుఁడు.

గీ॥ అమరకోటుల రక్తము ♦ నరయువఱకు
నిదురవట్టదు చూవె నా ♦ నేత్రములకు
వేల్పుటిల్లాండ్ర యేడ్పులు ♦ వినెడువఱకు
నెవరిపలుకులు నాచెవి ♦ కెక్కవయ్య !

వేయేల ? ఇది వినుఁడు.

గీ. అరిజనమ్ముల నోర్చి జ ♦ యమ్ము వడసి
వేల్పురాలచ్చిని గ్రహించు ♦ వేళవటుకఁ
దనుజ రాజ్యలక్ష్మ్మని నొల్లఁ ♦ దరుణినొల్ల
సిరునొల్ల నన్నమునొల్ల ♦ నిద్రనొల్ల.

శుక్రా—జలంధరా! అనవసరములగు నేవో కారణములఁజూపి మేము నిన్ను నింటఁ గట్టిపడవేయఁ జూచుచుంటి మనుచుంటివి. కాలనేమి సాహాయ్య మనవసరమా? రక్కసులెల్ల వచ్చుటయు ననావశ్యకమా? నీతండ్రిమాట నెఱవేర్చుటయు నవసరము గాదా? నావలన నస్త్రమ్ములగొనుటయు నావశ్యకముగాదా? అయిన నీకు మాయాజ్ఞమాత్ర మెందులకు? మా యాశీర్వాదము మాత్ర మెందులకు? నీయిచ్చవచ్చినట్లు నడచుకొనుము. మేము పోయెదము.

జలం__మహాత్మా! తండ్రిగారిమాట నెఱవేర్చుటయు, మీవలన నస్త్రములఁ గొనుటయు ననవసరమని నేనంటినా? మీయాజ్ఞ లేనిది జలంధరుఁ డడుగైనఁ బెట్టునా?

శుక్రా__కాని మాయాజ్ఞ మాత్రము తిరస్కరింపఁగలడు. అంతే కాదా?

జలం__మహానుభావా! అటు లెన్నఁడైన జరిగి యుండెనా?

శుక్రా__ నేఁడుఁ దక్క.

జలం__ నేఁడుమాత్రము మీయాజ్ఞఁ దిరస్కరించితినా?

శుక్రా —అయిన నేఁడే నీవు వివాహమాడవలయు. మాటాడవేమి?

జలం—దేవా! సిద్ధముగ నుంటిని.

శుక్రా—(అపవారించి) దంభాసురేంద్రా! ఇప్పటికి జలంధరునిమనసు తిరిగినది. పిమ్మట నెట్లుండునో__

కం__(అపవారించి) మహాత్మా! కన్నె సిద్ధముగనున్నది. ఉత్సవాములు పిమ్మటం జూచుకొందము—నేఁడే ముడిపెట్టవలయు.

శుక్రు—(అపవారించి) కాలనేమిని దులసిని బంధుమిత్త్రులను దొంద రగఁ దోడ్కొనిరమ్ము—

దం—చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

జలం__మహాత్మా! మాతండ్రిగారి నెక్కడకుఁ బంపితిరి?

శుక్రు__వధువుం గొనివచ్చుటకు.

జలం__ నేఁడే వివాహమా ?

శుక్రు__అవును. నేఁడే వివాహము ! రేపే పట్టాభిషేకము!

జలం—దండయాత్ర కనుజ్ఞ యొసంగు టెప్పుడు?

శుక్రు__ఒక సంవత్సరము గడచినపిమ్మట.

జలం—సంవత్సరమువఱకు నాఁగవలసినదే ?

శుక్రు—తిరిగి మొదటికి వచ్చితివి. రక్కసు లందఱు రావలదా ? నీ వొక్కఁడవే మూల్లోకములు గెలువఁగలవా ? మఱియు నావలన నీ వెఱుంగవలసిన విషయములు పెక్కు లున్నవి.

జల__(స్వగతము) ఆహా! దైవమా! జలంధరమత్తేభమును గుర్వాజ్ఞా శృంఖలచేఁ గట్టివైచితివి. (ప్ర) గురూత్తమా! సందుదొరకిన దని యీ లోకానిందుఁడు మమ్ము బాధించినను మిన్నకుండ వలసినదేనా ?

శుక్రు__అట్టి దేదియైన జరిగిన మాయాజ్ఞతో నవసరము లేకుండఁగనే నీవు దేవతలపై దాడి వెడలవచ్చును.

జలం__ఇది యొకవరమే ! కానిఁ ఆ పిఱికిపంద పాకశాసనుఁ "డింతయే చాలు దైవమా!" యని సంతసించుచునుగాని కొఱవి చేఁగొని తలఁగోకికొన్నట్లు కయ్యముఁ దెచ్చిపెట్టుకొనునా? ఓరీ ! మదోన్మత్తా! బలారీ! తుళ్ళిపడకుము.

చ. గురుఁడు శపించునంచు మదిఁ ♦ గొంకితి నింతియకాని నీయెడన్
గరుణఁ దలంచి కాదు త్వద ♦ ఖండపరాక్రమ మెంచికాదురా!
దుర మొనరింపరాక విధి ♦ దూరుచు నింటనయుంట, యొక్కవ
త్సరమగుపిమ్మటం దులువ! ♦ తప్పదు మృత్యువు నీకు నమ్ముమా!

గీ. ఎపుడు వత్సరమది నిండు ♦ నపుడె సుమ్ము
నిర్జరేంద్ర! నీయాయువు ♦ నిండుటయును
మలిగి పోనున్న దీపమ్ము ♦ మాడ్కి దోఁప
మిడిసిపడు మోరి! యీరోడు ♦ గడుచువలుకు.

శుక్ర—(ప్రక్కకుఁజూచి) నీతండ్రి వధువుతోడను బంధుమిత్రుల తోడను వచ్చుచున్నాఁడు.

జలం—వధువుగాదు. మాంపాలిటి సౌభాగ్యదేవత.

[ప్రవేశము:— దంభుఁడు, కాలనేమి, తులసి, మఱికొందఱు పురుషులు, స్త్రీలు.]

జలం—(విస్మయముతో)

గీ. మగువ చేరినమాత్ర నీ ♦ మందిరమ్ము
రాణమీఱెఁ జంద్రికతోఁప ♦ రాత్రివోలె
మెఱుపునరసిన తెఱివట్ల ♦ తెఱవమిన్న
జూచినంత నాకన్నులు ♦ సొంపుదూలె.

నిజమున కేమిగాని యీకామిని జగన్మోహినియే.

శుక్ర—కాలనేమి! పుష్పదామము నీ పుత్త్రిచేతి కిమ్ము.

కాల—చిత్త్రము. (అట్లు చేయుచున్నాఁడు.)

శుక్ర—కుమారీ! తులసీ! ఆ పూదండ జలంధరుని కంఠమున నలంకరింపుము.

తుల— (సిగ్గుపడుచుఁ బూదండ వేయఁబోయి క్రిందఁ విడుచుచున్నది.) (స్వ) అయ్యో! ఏమిది? ఇట్లు జరిగెనేమి?

జలం__(కోపముతో) మహాత్మా! చూచుచుంటిరిగదా? ఈకన్నెకు నాపై నిష్టములేనట్లున్నది! ఇట్టిదానిని మీరు నామెడగట్ట నద్దేశించుట న్యాయమా?

తుల—(స్వ) అయ్యో! ఆర్యపుత్రునకు కాగ్రహము వచ్చినది.

కాల—జలంధరా! ఇష్టము లేకపోవుటయేమి?

జలం__కానిచో నిదియేమి?

కాల—సిగ్గువలన నిట్లు జరిగినది.

శుక్ర—జలంధరా! నిశ్చయము. వేఱుగా భావింపకుము.

దంభా__నాయనా! నీకీసందేహమేమి? ఆబాలిక చిన్నప్పటినుండియు నిన్ను వలచియున్నది. నీపై నిచ్చలేక యట్లు చేయలేదు. లజ్జ వలన—

జలం__ఎందువలననైననుగానిండు. ఇట్లుజరుగుట నా కమంగళముగాదా? నా కీకాంత వలదు. వలదు. ముమ్మాటికి వలదు.

తుల__(స్వ) దైవమా! యేమిగతి?

శుక్ర__జలంధరా!

జలం—మహానుభావా! నన్ను క్షమింపుడు. మీరు ఘోరశాపమొసంగినను బరిగ్రహించెదఁ గాని యీ కామినినిమాత్రము పరిగ్రహింపను— (నిష్క్రమించుచున్నాఁడు.)

తుల (స్వ) హా! ఎంతనిర్భాగ్యురాలను!

శుక్ర__జలంధరా! ఆఁగుము. ఆఁగుము.

దంభ__ఆఁగుము. జలంధరా! ఆఁగుము. (నిష్క్రమించుచున్నాఁడు.)

[నేపథ్యమున, ఆఁగుము. జలంధరా! ఆఁగుము.]

శుక్ర__(స్వ) నారదుఁడు వచ్చుచున్నట్లున్నాఁడు. (ప్ర) కాలనేమీ! చింతింపకుము. అమ్మా! తులసీ! విచారింపకుము. నారదమహా

ద్దియు నీమామగారును జలంధరుని సమాధానపెట్టి వెంటఁ
గొనివచ్చుచున్నారు.

[ప్రవేశము:—నారదుఁడు, దంభుఁడు, జలంధరుఁడు.]

నార__జలంధరా! నీ కిది తగునా ?

సీ. కన్నపుత్త్రునికన్న ♦ నిన్ను మిన్నఁగ నెన్ను
గురునియాన నొకించు ♦ కరయవలదె?
చేతులఁబెట్టి పో ♦ షించినతండ్రికిఁ
దలవంపులగునంచు ♦ దలఁపవలదె ?
దనజకోటికి నెల్లఁ ♦ దలమానికంబైన
గాలనేమిమొగమ్ముఁ ♦ గాంచవలదె ?
చిన్ననాఁటంగోలెఁ ♦ జిత్తము నీపైని
నిలిపిన సతినైనఁ ♦ దలఁపవలదె?

గీ. చూడవచ్చిన మిత్త్రులఁ ♦ జుట్టములును
జింతపడుటయు నైన యో ♦ జింపవలదె?
బ్రహ్మకుం బట్టినైన నా ♦ పలుకు నైన
వినఁగవలదె? మాధ్యమ్మును ♦ విడువవలదె?

మఱియుఁ దులసిం జేపట్టుటవలన నీకు మేలేగాని కీడుగలుగదు.

ఆ. వె. కలికివలన నీకు ♦ సెలుఁగు లొవవునంచు
బెదరవలదు మేలె ♦ యొదవుఁజుమ్ము
చంద్రరేఖవలన ♦ జగతికి వెన్నెల
గలుగుఁగాక యిరులు ♦ గలుగునయ్య?

ఆలసింపకుము. ఇప్పటికే భార్గవుఁడు నీపై మిక్కిలి కినిసియున్నాడు.
ఆతఁడు శపించిన నీ కధోగతి సంభవించును. నడువుము.

(పరిక్రమింతురు)

శుక్రా— కాలనేమి !

కాల— దేవా ! ఏమియాజ్ఞ ?

శుక్రా— తులసిచేతికి మఱియొక పూసర మిమ్ము.

కాల— చిత్తము (అట్లుచేసి అపవారించి) అమ్మా! జాగ్రత్త!

తులసి— (అపవారించి) తండ్రీ! ఇప్పుడు చెప్పవలయునా? (స్వ) ఆహా! నారదమునీంద్రా! నీ మేలు నెన్నఁటికి మఱవను.

శుక్ర— కుమారీ! పూదండ జలంధరుని యఱుత నలంకరింపుము.

(అట్లు చేయుచున్నది.)

(నేపథ్యమున మంగళధ్వనులు.)

(యవనిక పడును.)

తృతీయ రంగము.

ప్రదేశము— ఒకయిల్లు.

[ప్రవేశము — పలాశుఁడు.]

పలా — అయ్యో! దౌర్భాగ్యమా? జలంధరుఁడు స్వర్గముపై దండెత్తుననియు వేల్పుమూఁకలఁజించి చెండాడుననియు మాకుఁ దినినంత మాంసముఁ ద్రావినంత రక్తమును లభించుననియు గంపెడాసతోఁ గాలు నాలు గొట్టుకొనుచు నెంత దూరమునుండియో వచ్చితిమే! తుట్టతుద కిట్లయ్యెనేమి ?

చండి —(ప్రవేశించి) ఏమైనది ?

పలా— మన మనోరథము భగ్నమైనది! జలంధరుఁ డింకొక వత్సరము నకుఁగాని దండు వెడలఁడఁట.

చండి— ఎందుచేత ?

పలా— మననోటిలో శనియుండుటచేత! అతని పక్కలోనికిఁ బెండ్లము వచ్చుటచేత.

చండి__ఆ సౌభాగ్యమునకైన నోఁచినట్లు లేదే?

పలా—ఏమి?

చండి__ఎఱుఁగవుగాఁబోలు! బసుకటింటిలో నతఁడు గనఁబఱచుచున్న ప్రయోజకత్వము?

పలా—అదేమి?

చండి__ఏమున్నది? పసిఁడిబొమ్మవంటి భార్య ప్రక్కఁజేరుటకు నోరు దెఱచికొని, ఎట్టయెదుట నిలిచియుండఁ బట్టెమంచముఁ గఱచుకొని పండ్లిగిలించినాఁడఁట, ఆఁ లేదఁట; ఊఁలేదఁట—రమ్మనుటలేదఁట; పొమ్మనుటలేదఁట__సరసములులేవఁట; సంబరములులేవఁట__ముద్దులులేవఁట; సుద్దులులేవఁట__ఇగిలించుటలులేవఁట; కౌఁగిలించుటలులేవఁట. తెల్లవారినదాఁక నొకటే గుఱ్ఱుఁట! ఒకటేగఱ్ఱుఁట. దిక్కుమాలిన శవమువలె నిటుప్రక్క నటుగదల్చినపాపమునఁ బోలేదఁట. దుప్పటిగప్పుకొని యయ్యగారు సెజ్జమీఁదనట; గ్రుడ్లు వెళ్ళఁబెట్టుకొని యమ్మగారు నేల మీఁదనట.

పలా__ఎందుచేతనో!

చండి—పండిత సభలోఁ బామరునకును బసుకటింటిలో షండునకును మౌనమునకన్న మంచిమార్గ మింకొకటి లేదుగదా?

పలా—ఓసీ! అదిగాదు. తులసిపైనను నతనికి నిష్టములేనట్లు తోఁచుచున్నది.

చండి—ఇష్టములేకగాదు. పుంస్త్వములేక—చేతగాక—అనుభవించుటకునుదుటిగీఁత చాలక__హీహీహీ—(వికటముగ నవ్వుచు) ఇష్టములేకపోవుట కేదైనఁ గారణ ముండవలెను గాదా? ఏదీ? ముదిమిమొప్పు గాదే? పదునెన్మిదేఁడులు గడువని పరువంపుఁ బడంతియే! వికృతరూపిణి గాదే? ముజ్జగమ్ముల మోహసాగర

మ్మైన పుంపఁదగిన ముద్దులగుమ్మరో! ఆఁకురూపున్న గడ్డి బొమ్మ నోంటిపాటునఁ జూచినఁ దుదకు మగపుట్టువుఁ బుట్టిన కొండముచ్చునకైన నోడలు జలదరించునే? పండ్లు బయటఁ బడునే? పట్టరాని యావేశము పరిభవించునే? అట్టిచో నిట్టి వన్నెలాఁడిపై—నిందుగ్రనైన నుపేందుగ్రనైన వలపింపఁదగినయిట్టి చిన్నెలాఁడిపై—నీ రసికాగ్రేసరునకు— నీ పురుషసింహము నకు— నిష్టములేకపోయినదా? అహ్హాహ్హాహ్హా. ఈసంగతి నీ కెవ్వరు వక్కాణించిరి? తన్ను నపుంసక గ్రామణియని—, చేఁత చాత గానిచెండిపోఁతని—నలువురు నవ్వుదురని— వెక్కిరింతు రని— యీ మహానుభావుఁడే తనరసికత్వముఁ జాటుకొన్నాఁడు గాఁబోలునేమి? హీహీహీ.

పలా—ఆతని కామెపై నిష్టము లేకుండుట వివాహవేళనే వెల్లడించి నాఁడు! నీవుమాత్రము చూడలేదా?

చండి—చూచితిని. తన బండారము బయటఁబడునని భయముననే కాఁబోలుఁ బాప మానాఁడు పరుగులాడి నాఁడు! రసికశిఖా మణి పురుషశార్దూలుఁడు!

పలా—సరికాని. పన్నాళింపుబిడారులోని పరమరహస్యము బయటి కెట్లువచ్చినది?

చండి—అటుకపై పిలుక చచ్చిన నిల్లంతయుఁ గంపుపాఁకదా?

పలా—ఊరంతట నప్పుడే యివ్వార్త పాఁకినదా?

చండి—నేఁడుగాకున్న రేపైన మానునా?

పలా—నేఁడే నీకెట్లు తెలిసినది?

చండి—తులసిచెలికత్తె మాలతి మామేనత్తకూఁతురే గదా? అది చెప్పఁగ వింటిని.

పలా—దానితోఁ దులసీదేవి చెప్పినది కాఁబోలు?

చండి— ఆ యెడ్డెపిల్ల కంత తెలివియా? ఆమాత్రపుఁ దెలివి తేటలున్నఁ గడచిన రెండు రాత్రులు బండవలె భర్తపందుకొనియుండ మట్టి దిమ్మవలెఁ దానూరక చూచుచుండవలసిన యగత్యమేమి? ప్రక్కపైనుండి యట్టె క్రిందకు లాగి యసలుబండార మేమో తెలిసికొని వానిపై బటారము లోనిలొటారము వీధివీధుల "దండోరా" వేయింపకపోయినదా? గుటుక లేగాని గుసగుసలు విన రాకపోవుటచే నిన్నటి రేయి గడుసుముండ మాలతి మెల్లఁగ బడుకటింటితలుపున కొకరంధ్రము నేర్పఱచి యందుండి యీ వింత గనిపెట్టినదఁట! ఇట్టివిషయములలో స్త్రీలకు శ్రద్ధ యెక్కువ__ చెప్పమఱచితిని. నేఁటియుదయమునఁ గాలనేమి యెక్కడకోపోవుచు "అమ్మా! నీనాథుఁడు నిన్ను దయతోఁ జూచుచుండెఁగదా" యని యడుగ గంగిరెద్దువలెఁదలయాడించి నదఁట!

పలా—సిగ్గువలనఁ జెప్పలేదేమో?

చండి__పోనీ! సిగ్గువలన దాఁజెప్పఁజాలకున్నచో మానెమాలతి తెలుప నుద్దేశించుచుండ వలదని ప్రార్థించినదఁట. ఎంతవెట్టితనమో చూడుము!

పలా__పాపము! తండ్రికిఁ దెలిసినఁ దనవల్లభునిపై నతఁడలుగునని చెప్పవలదనెఁగాఁబోలు? ఆహా! ఎంత పతిభక్తి!

చండి__దాని పతిభక్తికి నీవొగడ్తకు సరిపోయినది. మగనినేరములు గోరంతలు కొండంతలుచేసి తండ్రితోఁజెప్పి, రెండనతూరిఁ దన్ను దిరస్కరింపకుండ బుద్ధివచ్చునట్లు చెప్పుదెబ్బలు గొట్టించి తనకుఁ బరమవిధేయునిగఁ జేసికొనవలయుఁగాని— ఉన్నతప్పు గప్పిపెట్టి మిడుకుట యిదేమిపాతివ్రత్యము? ఊఁ పోనీ. దాని పాతివ్రత్యము— అది__ మంటఁగలయనీ మనకెందుల కా గొడవ! మనతిండి గొడవఁ జూచుకొందము.

పలా— మొన్న నుద్వాహామును నిన్న బట్టాభిషేకము నగుటచేఁ దేర తిండి దింటిమి. నేఁడు___

చండి___ఇంచున్న నుపవాసమే! తిరిగి మన యరణ్యమునకే పోదము పద—అక్కడనున్న నేవేళకైన నొకనక్కపిల్ల దొరకకపోదు.

పలా___ ఓసీ! తిరిగి యక్కడకుఁ బోవుటకంటె___

చండి___నీయిష్టము. తెచ్చిపెట్టువాఁడవు నీవు— తినుదానను నేను—బ్రతుకుఁ దెరువున కిందే యుపాయమున్న. నాలోచింపుము.

పలా___ఓసీ! జలంధరుఁడు పెఱచోటులనున్న రక్కసులఁ బిలిచికొని వచ్చుటకుఁ గొందఱ సేవకులకు వేతనములిచ్చి నియమించుచున్నాఁడట. అట్టి యుద్యోగము నాకేదైనలభించిన నీసంవత్సరమువఱకుఁ బొట్టఁ గడుపుకొనవచ్చును— పిమ్మట జలంధరుఁడు దండువెడలిన—

చండి— నీ కాపిచ్చియూహ యింకను వదలలేదు — పడుకటింటిలో భార్యకుఁబ్రత్యుత్తరముఁ జెప్పఁజాలని పరమనిర్భాగ్యుఁడు భండనమునఁ బగఱగండడంచునా ? అతడు నరకిన పీనుంగులు గుట్టలుపడినవి ! తినలేక నీపొట్ట పగిలిపోయినది ! సరిపోయినది ! ఆ యాశ పెట్టుకొనకుము.

పలా— ఉద్యోగమునకైనఁ బ్రయత్నింతునా ?

చండి— మంచిది. కాని మొదట నాతిండికిఁ బ్రయత్నింపుము.

(నిష్క్రమించుచున్నారు.)

## తురీయ రంగము.

### ప్రదేశము — మందిరము.

[ప్రవేశము — జలంధరుఁడు.]

జలం—

సీ. పాకశాసనునొంచి ♦ పరిభవింపఁగనైతి
రాజరాజును గాల ♦ రాయనైతిఁ
బలలాశిమై తిత్తి ♦ నొలిమింపగానైతిఁ
బన్నగాభరణునిఁ ♦ దన్ననైతిఁ
గాలునిపాలికిఁ ♦ గాలుఁడగానైతిఁ
బవనుని నాసికఁ ♦ బఱకనైతిఁ
బాశిమీసంబులఁ ♦ బట్టి యీడ్వఁగనైతిఁ
ననలుని కావరం ♦ బడఁపనైతి

గీ. మీటి యష్టదిక్కుల నాక్ర ♦ మింపనైతిఁ
వేల్పుఁగన్నలఁ గాఱియ ♦ వెట్టనైతిఁ
విబుధమాన్ుల గడ్డాలు ♦ వెఱుకనైతిఁ
నసురగణముల దారిద్ర్య ♦ మణఁపనైతి.

ఆచార్య! అచార్య! ఎంతపనిఁ జేసితివి ? ఘోరాహవభూముల వీరవైరివారంబులఁ జేతుల కసిదీఱఁ జంచిచెండాడఁ నువ్విళులూరు నన్ను గృహమునఁ బడవైచి గోళ్ళుగిల్లుకొనుటకన్నఁ బనిలేని పరమనిర్భాగ్యునిఁ గావించితివే? త్రివిష్టపరాజ్యలక్ష్మినిఁ జేపట్టఁ దలంచు నాకా పెద్దమ్మను దొంగయెద్దునకు గుదెవలె నంటఁగట్టి యింట గూలవైచితివే !

ఆహా! ఆ పెద్దమ్మం దలంచుకొనినప్పుడెల్ల నాయుల్లంబునఁ జెప్పరానిభయ ముప్పతిల్లుచున్నది. ఆ పూదండ క్రిందబడుటకుఁ గారణమేమైయుండును? ఆకన్నెం జెట్టపట్టుటవలన నీయదృష్ట మిట్లుజాఱినున్నదని దైవ మీవిధముగ నెఱింగించెఁ గాఁబోలు? కటకటా! నాకా

దయ్యము వలదని యెంతవేఁడినను దండ్రి విడువఁడయ్యె. గురుఁ డాగ్రహించె. ఆగ్రహించి యతఁడు శపించినను సరియే, నాకా కన్నెవలదని నిశ్చయించుకొని నిర్భీతిగ వెడలిపోవుచుండ నా నారదుం డెక్కడనుండియో వచ్చి "ఆతఁడు శాపము వెట్టిన నీ కధోగతిసంభవించు" నని పితికి మఁదుఁబోసి నన్నంగీకరింపఁజేసె. భయమొందకుమని వారేమో యుపదేశించిరి గాని నాకుఁ గలిగిన సందియము మాత్రము మాన్పనేరరైరి. ఏమైన నేమి? వీరందఱేకమైనా యభీష్టము నడుగంటించితిమ యీప్సితము నెఱవేర్చుకొనిరి. ఆఁ! యేమి? వీరియీప్సితమిప్పుడే నెఱవేఱెనా? దీనితో నేను గాఁపుర మేద్వవలయుననియు నీపిశాచిని సుఖపెట్టవలయుననియుఁగదా వీరి యభీప్సితము. నాప్రియస్నేమున కష్టువచ్చె! నామనోరథమును నాశనమొనర్చి, నాకింతవంతఁగూర్చి, నాయాగ్రహమునకు భాజనమైన ఆమర్త్యస్త్రరాలిని— ఆకామినీ భూతమును— ఆస్త్రీరూప బ్రహ్మరాక్షసిని సుఖపెట్టుమనా—మట్టుపెట్టెదఁగాక—పాపము! దీని నే నాదరించుచుంటినని యే వీరి యుద్దేశము! కావుననే భార్గవుఁడు దన ప్రియశిష్యునిఁగాలనేమిని వెంటనిడికొని నిర్వ్యాజముగఁ దన యాశ్రమమున కరిగినాఁడు—ఇప్పు డీ కాంతను జంపినమాత్ర నాకష్టువచ్చునా రెవ్వరు? నా తండ్రియా! ఊఁ—అతఁడేమి చేయఁగలఁడు? ఈవార్త దెలిసిన కాలనేమివలన నాకుఁ గలుగఁబోవు మహాపద్రవమును లేదు. కాని శాపాయుధుఁడగు నాదైత్యగురుఁడూరకుండునా? ఔరా! విధిమహిమ.

క. త్ర్యక్షునకుంగాని సహ
స్రాక్షునకుంగాని యెడఁద ♦ నడలఁ డెవండా
యక్షీణాధైర్యుఁ డీయే
కాక్షునకుం గొంకవలసెఁ ♦ గా? యకటకటా!

అయిన నింక నీ పీడ వదలించుకొనుట కుపాయమేమి? ఎక్కడకైనఁ

బంపుదునా ? అట్లొనర్చుటమాత్రము కాఫ్యునకుఁ గోపకారణము గాదా ? ఇసీ ! అన్నింటికిని జంకవలయునా ? ఇంట నుంచుకొని దీని నిట్లొల్లకున్నమాత్ర మాతఁడాగ్రహింపఁగూడదా ? ఆగ్రహించునని యుదరి దీనితోఁ గాఁపురము వెలుగఁబెట్టనా ? ఏమైనఁ గానిమ్ము. దీనిఁ ద్యజించినందుల కతఁడు కినిసిన మన్నింపుమని ప్రార్థించెద. అప్పటికిని గోపము మానక శపించినఁ దలవ్రాఁతయని యనుభవించెద. అంతియె గాని యీమారి పాడుమొగముఁ జూడఁజాల. నేఁడే దీని బలిపురంబునకుఁ బంపెద. (ప్రవేశము—తులసీదేవి__ తులసింజూచి మొగముఁ జిట్లించి మఱియొక ప్రక్కకుఁ దిరుగుచున్నాఁడు)

తుల__(స్వ) ఆహా! దైవమా! నేఁడైన నాప్రాణవల్లభునకు నాయెడ ననుగ్రహము వొడముననితోఁపదు. ఇమ్మహాత్మునకు నాపై నింతకోప మెందులకో?

మ. బొమలల్కన్ ముడివెట్టి నన్నుఁగనఁడే ♦ భూపాలరత్నంబు గా
రము రవ్వంతయుఁజూపఁడే! కృపమెయిన్ ♦ రమ్మంచు భాషింపఁడే!
యమలోదారుఁడు నాదెసం గరుణ వో♦నాడం గతంబేదో? యే
దో మదీయంబగు దోసమే నెఱుఁగఁ జే ♦ తోఁపిధి నోదైవమా !

చ. లలనలు సారెసారెకు జ♦లంధరదానవ చక్రవర్తికిన్
దులసియె దార కాఁదగిన ♦ తోయజలోచనయంచుఁ బల్కఁ బ
ల్కులవిని యెంతయున్ మదిని ♦ గోరిక లీరికలెత్త నుబ్బుచున్
గల నయినన్ విభుండు నను ♦ గైకొనఁడంచుఁ దలంప నీగతిన్.

గీ. చెలువ సుందరి గాదంచుఁ ♦ దలఁచెనేమొ ?
చేసియుంటినో యేదైనఁ ♦ జెనఁటి చెయిది
కాకపూర్వకర్మఫలంబొ ♦ లేకయున్న
నీకృపానిధి నన్నేల ♦ చేకొనండు.

కడచిన రెండుదినము లిటులే గడచెఁగదా ? ఎంతకుఁ బలుకరింపక

పోవుటచే నింత కండకావర మేమని యాగ్రహించెనేమొ ? ఏమైనఁ గానిమ్ము ! కారణమడిగి తెలిసికొని మనోహరుని పాదములంబడి మన్నింపవేఁడి కొనెదఁగాక ! (చేనున్న బంగరుపళ్ళెరమొకచో నిడి పూదండఁ గైకొని జలంధరుని గళమునవైచి) ఆర్యపుత్రా ! నమస్కారము.

జలం—(పూసరముఁ దెంపి నేలఁగొట్టి) ఏమిది ! పూలదండయా ? కాలసర్పమా ?

(అనుబంధము 3)

తుల—(స్వ) హా ! హా !

గీ. ప్రసవమాల్యమ్మనే గాదు ♦ ప్రాణవిభుఁడు
మన్మనోరథమునుగూడ ♦ మహిని గొట్టెఁ
బుష్పదామము దునుకలై ♦ పోయెగానిఁ
కటకటా ! ప్రీలిపోదె ? యిక్కటికి మనము.

జలం__(స్వ) ఔరా ! కడచిన రెండురాత్రులు దలయెత్తక పెదవిఁ గదల్పక నంగనాచివలె మిన్నక నిలచియుండుటంజేసి యిది యెంత ముద్దరాలో యనుకొంటి. నేఁడు పుష్పహారములు వేయుచున్నది__నమస్కారములు సేయుచున్నది__ ఇంకెట్టి మమకారములు చూపనున్నదో ? ఎంతకుఁ దెగింపనున్నదో ?

తుల—(స్వ) నేను పొరఁబడుచుంటినేమొ ? ఉన్నటులుండి యాకస్మికముగఁ బూసరము గళమున వేయుటంజేసి ప్రాణేశ్వరుఁడు భ్రమించెనేమొ ? పలుకరించిచూచెద. (ప్ర) ప్రాణనాథా ! మీపాదదాసి మీయాజ్ఞకు వేచియున్నది.

జలం__(స్వ) నీ చావునకు నేను వేచియుంటిని.

తుల—ఆర్యపుత్రా ! పలుకరేమి ? ఆజ్ఞయొసంగుఁడు.

ఉ. గంధ మలందనో యాఱుతఁ; ♦ గప్రిపుఁబల్కుల కమ్మదావులన్
జిందెడు వీడియం బిడనో; ♦ చేఁ గాఁ గగున స్వేదబిందువుల్
డిందఁగ వీవనో? లలిత ♦ లీల మదంకమునందుఁ జేర్చి నీ
సుందరపాదపద్మములఁ ♦ జొక్కపు భక్తిని బట్టుదాననో.

జలం—మాకేమియు నక్కఱలేదు.

తుల—(స) ఇంకేదిదారి? (ప్ర) హృదయేశ్వరా! మిగుల నలసియున్నటులున్నారు. శ్రమముడంచుటకు సంగీతము దివ్యౌషధము. నేఁగొని యొకింత పాడుదునా?

జలం—అవసరములేదు. (స్వ) మాకుఁ గావలసినది సంగీతముగాదు. సంగరము! నీవు పాడుటగాదు. పాడైపై నెక్కుట!

తుల—ఆర్యపుత్త్రా! దేవరకు నాపై ననుగ్రహము దప్పినట్లు తోఁచుచున్నది.

జలం—మొదటనున్నఁగదా తప్పుటకు?

తుల—మహాప్రభూ! మీసేవకురాలిపై మీకీ కోపమెందులకు?

జలం—ఇష్టములేక—

తుల—ఏమి? మహాప్రభూ! నేను వికృతాకారనా!

జలం—ఆమాట నేనంటినా? నీవు రంభవేయగుదువు—కాని నీపై నాకిచ్ఛలేదు—పలుమాటలేల? ఇటువినుము నాయుద్దేశమును.

ఆ. వె. ఘోరకిల్బిషములఁ ♦ గూర్చు చవితిచంద
మామఁజూచు నీదు ♦ మోముఁజూడ
భయదలీలనేర్చు ♦ ప్రళయపావకకీలఁ
గౌఁగిలింతు నంటఁ ♦ గలికి! నిన్ను.

గీ. పృథులహాలాహలంబు చార్చి ♦ వెదను నీదు
మోవితేనియఁ గలనైన ♦ ముట్ట, మృతిని

నాదరించెద బాల! ని ♦ న్నాదరింప
నింత నిజము వాగ్వివాద ♦ మింక నేల.

తుల— (వడఁకుచు) మహాప్రభూ! ఎందుల కీ సంతాపము? నేనేమి యప
రాధ మొనర్చితిని?

జలం___మహాపరాధము___

తుల—హా! మహాపరాధమా! నాథా! అదియేమి?

జలం— న న్నడిగెద వేమి?

చ. పరిణయవేళ లోకులును ♦ బంధుచయంబులు మిత్రబృందముల్
గురుజనులుం గనుంగొనఁగఁ ♦ గొంకక కొప్పిరిదంగఁ గండకా
వరమున నాదుకంఠమున ♦ వైవకభూమిని గొట్టినట్టి నీ
దురితపుఁ జెయ్యిమున్ మఱచితో? నను బ్రశ్న మొనర్తు దుర్మతీ!

తులసి— హా! హా! నాథా! ఇదియా నా మహాపరాధము?

జలం—ఆఁ! ఇదియుఁగాదా మహాపరాధము? పూసగమును నేలఁ గొట్టితిఁగాని నీశిరమును నేలఁగొట్టలేదుగదాయని యనుచుంటివా? అంతపనిఁ గావింపలేదు. కొంతవఱకు మేలేయని నన్ను సంతసింపు మనుచుంటివా? ఈ తిరస్కృతి చాలదా? ఈ యవమానము చాలదా?

తులసి—(స్వ) హరిహరీ! యెట్టిమాటలు వినుచుంటిని___(ప్ర) నాథా! నాథా! పాపపులజ్జవలనఁ బ్రసూనదామము మీకంఠమున సిడబోయి నేల విడచితిఁ గాని—

జలం— ఎంతలజ్జావతివి? నాఁడు కుసుమమాలిక నాయఱుత నలంకరింప సిగ్గుపడిన ముగ్ధవు నేఁడు చేసులెత్తికొని నన్నుఁగౌఁగిలించుకొనుటకు సిద్ధపడుచుంటివే? నాఁటిలజ్జ నేఁడు తెక్కలుగట్టుకొని యెచ్చటి కెగిరిపోయినదికాఁబోలు? (స్వ) ఏమో యదుగు

చుంటినిగాని యిందు దీని నడుగవలసినదిగాని నే నెఱుఁగవలసినదిగాని లేదు.

ఆ. వె. పరులు చూచువేళఁ ♦ దరుణి హరిణివోలె
మిగులభీతితోడ ♦ మెలఁగుచుండు
ఒంటిపాటఁ గలువ ♦ కంటి బెబ్బులివోలెఁ
బ్రాణనాథు మీఁదఁ ♦ బడును గాదె?

తుల—ప్రాణేశ్వరా! స్త్రీలకు సిగ్గు నైజముగాదా? అందు నందఱి మ్రోల లజ్జించుట—

జలం—అంత లజ్జింపవలసిన యావశ్యకమేమి? దానవసార్వభౌముఁడగు దంభునకుఁ గోడల వనిపించుకొనుట నీ కవమానకరముగఁ దోఁచెనా? తపఃప్రభావమున నజాచ్యుతేశ్వరుల మెప్పించి భూర్భువస్స్వస్త్రయంబున కాధిపత్యము వహింప వరమ్ములఁ గొన్న జలంధరున కిల్లాలవగుట నీకుఁ దలవంపులుగఁ దోఁచెనా?

తులసి—ఆర్యపుత్త్రా! నాకంత యహంభావమా? మీ పాతసేవ సేయుటకన్న మహాభాగ్యము మఱియొకటి లేదని పిన్ననాఁటి నుండియు నమ్ముకొనియున్న నే నిప్పు డిట్లు దలంతునా? వివాహకాలమున వరుని స్పృశించుటకు వధువు సిగ్గుపడుట తనకు గౌరవహానియనియా? ఓ దయామయా! మీ రెఱుఁగని దే మున్నది? అట్టి లజ్జవలనఁ బుష్పమాల నేల విడిచితిగాని నా దైవమును, నాసర్వస్వమును, మిమ్ముఁ దిరస్కరింపవలెననికాదు! అహంకృతివలనఁగాదు! కాదు! నాథా! ముమ్మాటికినిగాదు! మీ చరణములాన—(పాదము లంటఁబోవును.)

జలం— ఛీ! ఛీ! యవిధేయులారా! దూరముగ నుండుము.

తుల—ప్రాణేశ్వరా! ప్రాణేశ్వరా! నిరపరాధనగు నాపై నింత నిర్దాక్షిణ్యమా! ఇంత కాఠిన్యమా?

( అనుబంధము. 4 )

జలం—(స్వ) దీనితో నాకుఁగలిగిన సందేహముఁగూర్చి ప్రసంగింపనేల ? దీనివలన నది తీఱుఁగలదా ? ఒకవేళఁ దీఱుఁగాక. ఈపిశాచి కతమునఁగదా యొక సంవత్సరమువఱకు నే నింటఁబడియుండ వలసినయవస్థ సంభవించెను ! దాని నెట్లుమఱతు ? దీనినెట్లు పరిగ్రహింతు ? వృథాకాలయాపన మెందులకు ? దీనితో నీమాత్రము మాటాడుటకే నా కెంతయు నేహ్యముగనున్నది. త్వరలో నీసత్తిని సాఁగఁదోలవలయును.

తుల—ఓకరుణామయా ! మాటాడ రేమి ? నన్ను మన్నింపరా ?

జలం—నీ వపరాధమే యొనర్పలేదని వాదించుచుంటివి. ఇంక నిన్ను మన్నింపవలసిన యావశ్యకమేమి ?

తుల—(స్వ) ఆహా! ఆర్యపుత్త్రుఁడు నా యొనర్చిన దపరాధమేయని తలంచుచున్నాఁడు. నిశ్చయమే ! ఏకారణమున జరిగిననైన నిది యపరాధమేకాదా ? నాయపరాధము నొప్పుకొనిన బ్రాణేశ్వరుఁడు మన్నింపనెంచి యిట్లనుచున్నాఁడు గాఁబోలు ! (ప్రకాశముగ) ప్రాణనాథా ! అపరాధమే యొనర్చితిని. క్షమింపుఁడు.

జలం—అపరాధమునకుఁ దగిన శిక్ష విధింపుమనక క్షమింపుమనెద వేమి ?

తుల—(స్వ) కటకటా ! యేమి నాయుడియాస ! నాదైవమున కిప్పటికిని నాపై జాలివొడముటలేదు.

జలం—ఏమి మాటాడవు ?

తులసి—నాథా ! నేనుమాటాడవలసిన దేమున్నది ? మీదయయెట్లున్న నట్లు గావింపుఁడు.

జలం—అయిన నిదిగో వినుము. నీవు నన్నుఁ దిరస్కరించితివి—

తుల—ఓ కరుణానిధీ! తిరిగి యిదియేమి? తిరస్కరించితి ననుచుంటిరి ? కాదని విన్నవించుకొంటినే. మీచరణములంటి బాససేసెద నంటినే ? ఇంకను నమ్మకము గలుగదయ్యెనా ?

జలం—చెప్పఁదలఁచినది తుదవఱకుఁ జెప్పనీయవా? మొదట నామాట జెప్పెదను.

తులసి—ప్రాణేశ్వరా ! సెలవిండు.

జలం—(స్వ) సెలవిచ్చుటకేగాదా మా యాలోచన? (ప్ర) ఆకర్ణింపుము.

ఉ. నన్నుఁ దిరస్కరించితివి ♦ నల్వురుఁ జూచి హసింప, నాయెడన్
మన్ననయున్ భయంబు నొక ♦ మాత్రములేక వివాహపుందఱిన్
గన్నియవౌట శిక్షయిడి ♦ గాఱియవెట్టఁగరాదు గాన నే
నిన్ను ద్యజించితిన్ సెలఁత! ♦ నీకిదె దండనగా విధించితిన్.

తులసి— హాహా ! (మూర్ఛిల్లుచున్నది.)

జలం— (స్వ) ఇంక నాలస్యమెందులకు ? (ప్ర) ఓరీ ! సేవకా !

[నేపథ్యమున.]

దేవా ! యేమియాజ్ఞ ?

జలం— బలిపురమునకుఁ దులసి పోవలసియున్నది. రథము నాయత్త మొనర్ప మాయాజ్ఞయని సారథి కెఱింగింపుము.

[నేపథ్యమున.]

చిత్తము.

తులసి— (లేచి) హృదయేశ్వరా ! హృదయేశ్వరా ! ఇదేమి యన్యాయము ? ఇదియేమి శిక్ష ? ఇదియేమి క్రౌర్యము ?

ఉ. అక్కట ! యింతశిక్షనిడ ♦ నంతటితప్పు నొనర్చియుంటినే ?
యక్కటికమ్ముఁ జూపవె కృ ♦ పాకర ! మీపదసేవ లేనిచో

నెక్కరణిఁ దినంబులు గ్రి ♦ మింతు? మిముం బెడఁబాసి దిక్కులే
కెక్కటి నొంచు నేపగిది ♦ నీ యొడలన్ భరియింతుఁ బ్రాణముల్?

జల—తరుణీ! తప్పు నెఱుంగ కనుచుంటివి? పతియాజ్ఞ కెదురాడుటయుఁ దప్పుగాదా?

తుల—ప్రాణేశ్వరా! నిశ్చయమే! మీయాన కెదురాడరాదు. నా ప్రాప్తియుని యనుభవింపవలసినదే. అనుభవింతును అనుభవింతును మున్ముందటికి నింతకన్నఁ గఠిన—అయ్యో! ఇంతకన్నఁ గఠిన శిక్ష యింకేమున్నది? ఎట్టి శిక్ష విధించినను నోరుమూసికొని నోసలు గొట్టుకొని యనుభవింతును. కాని—ఓకృపాళూ! ఇట్టి శిక్ష యేవిధింప వలయునని యేమి? ఇంకే కట్టిఁడి దండన వెట్టరాదు?

సీ॥ ప్రాణేశ! యీపాటి ♦ ప్రామాదికమునకు
న్యాయంబె యిట్టి దం ♦ డన విధింప?
ఏవేళ నీపాద ♦ సేవకు దూరమై
పుడమిఁ గాలం బెట్టు ♦ గడపుదాన?
అక్కట! నేనంత ♦ వెక్కసమైన న
న్నేయుక్తినైనఁ ద్రో ♦ యింపరాదె?
గిరిశృంగముననుండి ♦ క్రిందికిఁ ద్రోలింప
రాదె? యగ్గిని నెట్ట ♦ రాదె? నాదు

గీ. గొంతుఁ గొఱకొఱఁ గత్తితోఁ ♦ గోయరాదె?
యురక విసమొసంగఁగరాదె? ♦ యురిని నైన
బెట్టఁగారాదె? యీపాడు ♦ కట్టె నెట్లొ
తెరలఁజేసి భూభరమును ♦ దీర్పరాదె?

జల—(స్వ) నిన్నంతపని గావింపవలసినదే—కాని నీపాలిటి భగవంతుఁడు—నాపాలిటి శనిగాఁడు__ గురుబుద్ధిపుఁ డడ్డమువచ్చినాఁడు. (ప) కామినీ! నీ వంగన వగుటచేఁ గరుణించి యింకే

శిక్ష విధింపనై తినని తొలుతనే చెప్పితినిగాదా? తిరిగి—

తుల—నాథా! నాథా! కరుణించి యీశిక్ష విధించితి ననుచుంటిరి. మహాత్మా! ఇది కరుణించుట గాదు. వధించుట—వధించినను గొంత మేలే— దహించుట— ఒక్కసారిగాదు— బ్రదికి యున్నంతకాలము వియోగానలమున దహించుట. ఓకృపానిధీ! నే నీశిక్ష భరింపఁజాలను. మిమ్ము విడిచి మనఁజాలను. నన్ను క్షమింపుఁడు. అనుగ్రహింపుఁడు. రక్షింపుఁడు. (పాదములఁ బడఁ బోయి జలంధరుఁడు తొలఁగినిలువఁ గ్రిందఁబడుచున్నది.)

జలం—

మ. పడఁతీ! యేటికి మాటి కివ్విధమునన్ ♦ బ్రార్థింతు?-నీమీఁదఁ బ్రే
ముడి యేమాత్రము లేదు నాదుహృదయాం♦భోజంబునన్- జాలు నీ
యడియాసన్ ద్యజియింపు, దారగ నెగా ♦ దంగీకరింపన్ నినున్
గడకున్ బాదము లొత్తుదానిసెగనై ♦నన్, నమ్ము మిమ్మాటలన్.

తుల—హా! హా! హృదయేశ్వరా! ఏమంటిరి? భార్యఁగా నంగీకరింపక పోవుట యటుండ దానిసెగానైన నంగీకరింపననియా? ఎందులకు నాథా! దీనురాలనగు నాపైనింతకోపము? ఇంతదయాశూన్యత! ఇంతకాఠిన్యము! నాయొనర్చిన యపరాధమెంత! అదియైన నెఱిఁగిచేసినదికాదే? దాసిగానైన నంగీకరింపరా? మహాప్రభూ! మీకుఁగల దాసదాసీజనంబులకు లెక్కలేదే! వారిలో నేనొక్కతెనై పడియుండి మీసేవ సేయుచుఁ గృతార్థురాలను గాఁగూడదా? ఇందులకైనఁదగనా? ఈమాత్రమైన మీకు నాపైననుగ్రహము గలుగఁగూడదా? నాథా! పలుకరేమి? ఊరకుంటిరేమి?

జలం— తెఱవా! తిరిగి చెప్పుచుంటిని. నీ కా యాసవలదు.

తుల—(దుఃఖముతో) హా! హా! ప్రాణేశ్వరా! ఈ దీనురాలిపై నింత

వైరమెందులకు? మీ దాసిగానైన నన్నుఁ గైకొనఁదలంపరా ?
ఏమాత్రమైన నోఁచకపోయితినా ? నాథా ! నాథా !

సీ॥ ప్రియమార మీతోడ ♦ శయనింపఁ దగకున్న
బానుపు నెత్తుట ♦ కైనఁ దగనె ?
ఇంపార మిముఁ గౌఁగి ♦ లింపంగఁ దగకున్న
మేనిచెమ్మట లొత్త ♦ నైనఁ దగనె ?
ముదమార మీమోము ♦ ముద్దాడఁ దగకున్న
నద్దంబుఁ జూపుట ♦ కైనఁ దగనె ?
అనువార మీమోవి ♦ నానంగఁ దగకున్న
నడుగులు గడుగుట ♦ కైనఁ దగనె ?

గీ॥ ప్రాణనాథ ! మిమ్ముంగూడి ♦ ప్రముదమార
నహరహంబు సుఖించెడు ♦ నంతభాగ్య
మునకుఁ దగకున్న—మీచెప్పు ♦ పనుల మెలఁగి
యకట ! దినములు పుచ్చుట ♦ కైనఁ దగనె ?

జలం—కాంతా ! యెన్నిసారులు వేఁడెదవు ? లాభము లేదు.

తుల—హా! హృదయేశ్వరా ! లాభములేదా ? అయిన నీశరీరమునఁ ప్రాణము లుండినమాత్ర మేమిలాభము ? ఎందులకుఁ బనికి రాని యీకట్టె యుండినమాత్ర మేమిలాభము ?

జలం—(స్వ) అగ్గిలో వేయుటకు. (ప్ర) మఱియొకమాట. నీ వీనాఁడు బలిపురంబునకుఁ బోవలయును.

తుల—ప్రాణనాథ ! అదియేమి ? బలిపురంబునకుఁబోవుట యెందులకు?

జలం— నీ వింక నుండవలసిన దక్కడనే !

తుల— హా ! హా !

గీ. ప్రాణనాథ ! నీ కౌఁగిట ♦ బ్రత్యహంబు
నొప్పు భాగ్యంబునకుఁ బోల ♦ కున్నఁ, దాన

కీనచరణసన్నిధి నుంట ♦ కైన నకట!
పనికిరాదొకో నాదు పా ♦ పంపుఁ దనువు ?

మహాప్రభూ! మీ యంతఃపురమున నుండనిచ్చుటకు మీ మన సొప్పకున్న నన్నీపురంబుననే యెందైన నుంచుఁడు. మీపాదధూళిచే ననవరతముఁ బవిత్రమగు నీనగరమునఁ గాలముఁగఁబుచ్చుకొనుచుఁ గృతార్థ నయ్యెద. ఈ వరమైన ననుగ్రహింపుఁడు.

జలం— (స్వ) సతిని బొలిమేర దాఁటువఱకు సాఁగఁదోలవయును గాదా? (ప్ర) వీలు లేదు నేఁడే నీవు ప్రయాణము.

తుల— హా! దైవమా! ఎంతహతభాగ్యురాలను. (మూర్ఛిల్లుచున్నది)

జలం— ఇఁక నీపీడ వదలినట్లే! కాని నే నింటఁబడియుండవలసిన దౌర్భాగ్యముమాత్ర మింతలో వదలునట్లు లేదు. ఆ శుక్రాచార్యుఁడు దీని ద్యజించినందులకైన నొకవేళ క్షమించిన క్షమించునేమో గాని సంవత్సరమువఱ కిల్లువిడువవలదను తనయాజ్ఞఁ దిరస్కరించిన మాత్ర మింతయు సైరింపఁడు. కాన నొసలుగొట్టుకొనుచు నేనుండవలసినదేగాని మఱియొక యుపాయము గానరాదు. ఆహా! వీరాభిమానవిజృంభితుండగు నీజలంధరుం డొకసంవత్సరము గడచువఱకు నిట్లు చేతులు నలిపికొంచు గృహమునఁగుళ్లుచుండ వలసినదే? ఆ నీచాత్ముఁడిందుఁ డంతవఱకుఁ జింతామణీసింహాసనమున నిట్లు గులుకుచుండవలసినదే? దీనులగు దివిజవైరు లందాఁకఁ దినఁ గూడును గట్ట బుట్టమును లేకయిట్లు తపింపవలసినదే - ఐశ్వర్యమదాంధులగుబృందారకు లంతదనుక నిట్లు మిడిసిమిడిసి పడవలసినదే? హా! యెట్టి పారబ్ధము తటస్థించెఁడి ?

సీ. నింగి వ్రయ్యలు సేయు ♦ నిస్సాణనినద మా
కర్ణించు దిన మెప్డు ♦ గలుగునొకో ?

యొడలు గగురుపాటుఁ ♦ గడిమి సంగరభూమి
నిలిచెడు దిన మెప్డు ♦ గలుగునొక్కొ ?
వేల్పులగుండియల్ ♦ వ్రీల సింహరవంబు
గావించు దిన మెప్డు ♦ గలుగునొక్కొ ?
కసిదీఱ నసిధార ♦ నసురవైరుల శిర
మ్ములఁ జెండు దిన మెప్డు ♦ గలుగునొక్కొ ?

గీ. సురచయంబు నసృక్పూరం ♦ పరులయందు
మునిఁగి తేలెడు దినమెప్డు ♦ గలుగునొక్కొ ?
వృత్రవైరిపదమ్ముఁ బ ♦ రిగ్రహించి
ఘనతఁ గాంచు దినం బెప్డు ♦ గలుగునొక్కొ ?

(విక్రమించుచున్నాఁడు.)

(అనుబంధము 5.)

తులసి—(లేచి) ప్రాణనాథా! ప్రాణనాథా! (అటు నిటుఁ జూచి) అయ్యో! నాజీవితేశ్వరుఁ డేఁడీ? నా ప్రభుఁ డేఁడీ? నాభగవంతుఁ డేఁడీ? హా! హా! మనోహరా! మీసేవకురాలి నప్పుడే విడచి యెందేగితివి? నాగతి తుద కేమిచెప్పితివి? త్యజించుటయే? హా! ఇఁకైన నండనీయక వెడల నడుపుటయే ?—

హా! దైవమా! నే నెంత నిర్భాగ్యనైతి? ఇంతనాఁటం గోరె నావలచిన మనోవల్లభుఁడు నా పూర్వపుణ్యంబునం జేసి లభించెఁగదా యని యెంతయు సంతసించుచుంటినే! ననుఁబోఁటి యదృష్టవంతురా లీభూమండలమున మఱియొకతె యుండఁ బోదని యుప్పొంగుచుంటినే! ఎంతలో నాయాస యడియాస యయ్యె—ఇప్పట్టున నాకన్న నీయంతఃపురమునందు కడపటి దాసియు మిగుల నదృష్టవంతురాలయ్యెనే? కడకు నిప్పురంబున

నివసించు పశు పక్షి క్రిమి కీటాదుల పాఁటిదైన నోఁచకపోయి తినే ? నాథా ! నాథా ! నాయెడ నెంతనిర్దయ వహించితివి ? ఎంతటి పగఁ బూనితివి ?

[ నేపథ్యమున. ]

అమ్మా ! మిమ్ము బలిపురంబునకుఁ గొనిపోవుటకు రథముతో సారథి వచ్చి కాఁచియున్నాఁడు.

తుల—హా ! హా ! ఇంతకన్న యమసదనమునకుఁ గొంపోవుటకు యమభటుఁడు వచ్చెనన్న నెంతయు సంతసించియుందునే ?— ఓమృత్యుదేవతా ! ఎందుంటివి ? ఈ దీనురాలిపై నీ కైన ననుగ్రహము గలుగుటలేదా ?

ఆ. వె. ఎటులొ యేదొ దోస ♦ మే నొనర్చుటఁ జేసి
ప్రాణవిభుఁడు ననుఁ ది ♦ రస్కరించె
ఎట్టిదోసఁగు సల్ప ♦ నే నీకు మృత్యువా !
యీవమైన నను గ్ర ♦ హింపరాదె ?

అయ్యో ! మరణము మాత్రము నావంటి నిర్భాగ్యురాలికిని దనంతటఁ దా నచ్చునా ? నేనె యేల చావరాదు ? నాపతి భునకింతయుఁబనికిరాని యీయపవిత్రపు దేహమువీతిహోత్రు కేల యర్పింపరాదు ? అయ్యో ! ఇం దగ్ని యెట్లువచ్చు ? ఇంత విసమైనలేదే ?—కరవాలమైనఁ గనిపింపదే?—త్రాడైన లభింపదే ? ఆ ! లేదా నాకేశపాశము ? దీనితో నురిబెట్టుకొనెదను—నా హృదయేశ్వరుని విడిచి దినదినముఁ గృశించి బలిపురంబునఁ జచ్చుటకంటె నేఁ డిందే ప్రాణముల విడచుట మేలుగాదా ? అక్కటా ! దీన నిష్కళంకచరిత్రుఁ డగు నా మనోనాథునకు నపయశము రాదా ? నా ప్రాణేశ్వరునిపైఁ దండ్రిగారికిని గురుపాదులవారికిని గోపము రాదా? ఇది యెట్లు

భరింతు? అదిగాక ప్రభుని యానతిలేక ప్రాణములఁ బరిత్య
జించుటకు మాత్రము దాసినగు నాకు స్వాతంత్ర్య మెక్కడిది?
కటకటా! అయిన నింక నాగతియేమి?— ఓ మాల్దైవమా!
ఎందుంటివి?

గీ॥ ఎందులకు నక్కఱకురాని ♦ యీ శరీర
మిచ్చి, యెంతకుఁ బగులని ♦ యిట్టి కఠిన
మానసం బిచ్చి, యెంతకు ♦ మానరాని
యిట్టి యసువులిచ్చి సృజించి ♦ తేమి నన్ను?

[ప్రవేశము—దాసి]

దాసి— అమ్మా! మహారాజుగారు మీరు తొందరగఁ బ్రయాణము
కావలయునని యాజ్ఞాపించుచున్నారు.

తుల— హా!— ఓసీ! దాసీ! (స్వ) హా! దీని నోసీ యనుచుంటిని.
ఇప్పట్టున నీదాసికన్న నాయాధిక్య మేమి?

దాసి— అమ్మా! మాటాడ రేమి?

తుల— మహారాజుగా రెందున్నారు?

దాసి— తల్లీ! వారు ముందుగ మిమ్ము రథ మెక్కింపవలయు నని
యానతిచ్చుచున్నారు.

తుల— అమ్మా! నిన్ను వేడికొనెదను. నా నాథుని నొకసారి దర్శిం
తును. నాహృదయేశ్వరుని సన్నిధానమునకు నన్నుఁగొనిపొమ్ము.

దాసి— అమ్మా! మీరు వత్తుమనినను దమచెంగటకుఁ దీసికొనిరావల
దని మహారాజుగారు సెలవిచ్చిరి.

తుల— హా! హా! హృదయేశ్వరా! ఇంత దయాశూన్యతయా?

దాసి— అమ్మా! లెమ్ము. ఇప్పటికే యాలస్యమైనది.

తుల— నాథా! నాథా!

ఆ. వె. ప్రాణనాథ! యక్షి ♦ పర్వంబుగా, నిన్నుఁ
జూచు భాగ్యమునకు ♦ నోఁచనింక
ఇపుడె తనివిదీఱ ♦ నీక్షింతు దర్శనం
బీవె తుదియభీష్ట ♦ మిదియ చూవె?

(మూర్ఛిల్లుచున్నది)

దాసి—అయ్యో! ఈమె మూర్ఛిల్లినది. (విసరుచున్నది.)

(యవనిక వ్రాలును.)

ఇది ద్వితీయాంకము.



శ్రీ ర స్తు.

# తులసీదేవి.

## తృతీయాంకము.

——(:o:)——

### ప్రథమ రంగము.

ప్రదేశము - అమరావతి.

[ ప్రవేశము - నారదుఁడు గానమొనర్చుచు. ]

నార——(స్వ) దనుజాచార్యుని యాజ్ఞవలన జలంధరునికే గాక కలహ ప్రియుండనగు నాకును నాశాభంగముసంభవించినది. అక్కటా! ఇఁకఁ బదునొకండు నెలలకా పోరోగిరముఁ బొట్టనిండ భుజింపఁ గలుగుట ?

క. అనిమిషులకు నమృతంబును
జనులకు నన్నంబు నామి ♦ షము దైత్యులకున్
నెనరున నెవ్వం డిడు ?, నా
ఘనుఁ డొసఁగకయున్న నాకుఁ ♦ గలహాశనముల్ ?

మఱచితి, వేల్పులవలనఁ దన కేదియైనఁ గీడు గలిగిన నెట్టు లని జలంధరుఁడు ప్రశ్నింప నప్పుడు దనయానతి లేకయే దాడి వెడలవచ్చునని కావ్యుఁడు వచించెనని వినియుంటిని గదా?—— ఈభంగి గలుగుట కేదియైన నుపాయ మాలోచింపవలయును. (యోజించుట నభినయించి) ఆ ! ఇది తగిన యుపాయము !

చ. అలికులవేణి రూపమహి ♦ మాతిశయంబును, రాక్షసేంద్రుఁ డా
చెలియ ననుగ్రహింపక త్య ♦ జించుటయున్, వచియించి-నెమ్మదిన్
వలపు గొనంగఁ జేసి, సతిఁ ♦ బట్టఁ బురందరుఁ బంచి, యివ్విధిన్
దెలిపి సురారికిన్, గలను ♦ దెచ్చెద నింతయుఁ జూచి మెచ్చెదన్.

దైపమిందు నాకుఁ దోడగుఁ గాక. ఇంద్రుఁ డిప్పుడు నందనోద్యానమున నున్నట్లు తెలిసినది. నే నిందుఁ దడయ నేల? పోయెద.

(గానమొనర్చుచు నిష్క్రమించుచున్నాఁడు.)

## ద్వితీయరంగము.

ప్రదేశము—నందనోద్యానము.

[ ప్రవేశము:—ఇంద్రుఁడు, నారదుఁడు.]

ఇంద్రు—మునీంద్రా! ఆ జలంధరుని వివాహాదులం గూర్చి వినియుంటిని. కాని యా దైత్యునకు గౌరిహరబ్రహ్మ లొసంగిన వరము లేమో విననైతి. వానిం దెలుప వేఁడెదను.

నార—(స్వ) ఇతఁడు తులసి విషయము విడిచి జలంధరుని సంగతి వినఁ గోరుచున్నాఁడు. నా యభీప్సితము నెఱవేరకపోవునా యేమి? కానీ చూచెద. (ప్ర) వాసవా! ఆతఁడు వాంఛించిన వరపరంపరలకు లెక్కలేదు.

ఇం—వాఁడు వేఁడిన వరంబు లన్నియుఁద్రిమూర్తు లొసంగిరా?

నార— ఆ.

ఇం—ఆహా! వాఁడు జగత్త్రయ జయంబును దప్పక కాంక్షించియుండును.

నార—ఇంద్రపదవిని గూడను.

ఇం—(స్వ) అక్కటా! ఇంతకన్న వినవలసిన మాట లేమున్నవి?

నార— దేవేశ్వరా ! నేఁడు విచారించుట యెందులకు ? నాఁడే చంద్రశేఖరుఁ డిట్లగునని చెప్ప వినియుంటివి గదా ?

ఇం— మహాత్మా ! వాఁ డింకేపరము లర్థించినాఁడు.

నార— ఎన్నటికి నెవ్వరిచేతఁ దనకుఁ జావు గలుగకుండుటకు—

ఇం— ఆ మహానుభావు లావరము మాత్రి మేల యనుగ్రహింపకుందురు ?

నార— నిశ్చయము.

ఇం— నిశ్చయమా ? మునీంద్రా ! ఆవరముగూడ నొసంగిరా ?

నార— ఆ ! ఒసంగినట్లే !

ఇం— అనఁగ ?

నార— ఒక శంఖ మిచ్చిరి. దానిం దల ధరించియున్నంతవఱకు నెవ్వరిచేత మరణము రాదని వచించిరి.

ఇం— (స్వ) ఇది కీడులో నొకింత మేలు. (ప్ర) మునిచంద్రా ! కడకొకింతయాశ జనించు సంగతిఁ జెప్పితిరి. ఆ మహనీయుల కృపయున్న నేనాఁటికైన దాని నెట్టులో గ్రహింపవచ్చును.

నార— నేను నిట్టులే యనుకొంటిని గాని యాతనిమరణమునకు మఱియొక యడ్డు ఘటిల్లునని శంకించుచుంటిని.

ఇం— దేవా ! అదియేమి ?

నార— ఆ దానవనాథుని సతీతులసి మహాపతివ్రత.

ఇం— మహానుభావా ! మీ పలుకులు వినవిన నాకు మిగుల నచ్చెరువగుచున్నది.

నార— ఏమి ?

ఇం— ఇందనుక నంతయుందగత్తె ముల్లోకముల వెదకినం గనఁబడదని వచించితిరి. ఇప్పుడు—

నార— బిడౌజా ! రజ్జులాడవలసిన యావశ్యకము మాకేమి ?

ఇం——(స్వ) నిశ్చయమే కాని యతిశయోక్తు లాడుటన్నఁ, బ్రియ మెక్కువ. (ప్ర) దివ్యర్షి చంద్రా! మీమాటలు రజ్జులని నేనం టినా? నా యభిప్రాయ మది గాదు. ఆకాంతకు సౌందర్యము నకుఁదోడు సద్గుణములుగూడ నబ్బినందులకు వింతపడుచుం టిని.

నార——నిర్జరసార్వభౌమా! వేయిమాటలేల? ఇటు వినుము——

ఉ. భూరిపతివ్రతాత్వమున ♦ బోటులలో ననసూయ మేటియై
పేరువహించె నింత, కిఁకఁ ♦ జేరువడుం దులసీ వధూటియే!
వారిజనేత్రలందుఁ జెలు ♦ వంబునఁ బేర్వడె నయ్యహల్య బృం
దారకనాథ! యింత, కిఁక ♦ దానవకాంతయె పేరి కెక్కెడుఁ

ఇంద్ర——(స్వ) అందమున నహల్యతో సాటిచెప్ప గరితలనమ్మన ననసూయతోఁ బోల్చుటలో నిజటితలంపేమి? అహల్యంబోలు సుందరియయ్యు నహల్యవంటి కులటగాదనియు నా గౌతమూం గనవలె సీత లోఁబడునది కాదనియు నెఱిఁగించుచున్నాఁడు గాఁబోలు? వివాహముజరిగి యొకనెలయైనఁ గాలేదు. ఇంతలో నయ్యింతి యింత సాధ్వియని యీ బుద్ధిమంతుఁ డెట్లు గ్రహించెనో? ఇతనికి గర్వభంగము గావింపవలయును. (ప్ర) బ్రహ్మమానసపుత్రా! ఆ తులసి పాతివ్రత్యప్రభావంబున జలంధరునకు మృత్యువు సంభవింపదని మీరు భయపడుచుంటిరి గాఁబోలు? నాకాభయ మావంతయు లేదు.

నార——ఎందుచేత?

ఇంద్ర——ఆమె పాతివ్రత్య మట్టిదేయగుఁగాక. అయినఁ ద్రిపురకాంతల భంగపెట్టిన వివిధోపాయపరాయణుఁడు నారాయణుఁ డుండ మాకు భయమేమి?

నార——(స్వ) పురందరునకుఁ బురియెక్కించుట కిది తగినతరుణము.

(ప్రి) ఆ యుపేంద్రుఁ డెందులకు ? ఈ యింద్రుఁడు మాత్రి మసమర్థుఁడా ?

ఇంద్రు— మునీంద్రా ! మీ రిట్లనఁ గాదననేల ? ఈ మాత్రపుఁ బనికి నింద్రుఁడుగూడ నసమర్థుఁడు గాఁడు.

నార— మూర్ఖుఁడా ! ఆ తులసీదేవి యహల్య యనుకొనుచుంటివా ?

ఇం— కాకపోవచ్చును. అయినఁ జూతముగాక.

నార— నీపరాభవమును జూడవలసినదే.

ఇం— కానిండు. మీతో వాగ్వివాద మేలకు?

నార— నిశ్చయమే మేము మాత్రి మిట్టివిషయములతోఁ బ్రొద్దు పుచ్చుకొను టెందులకు ? పోయెదము.

ఇం— చిత్తము.

నార— (పరిక్రమించి) ఇంద్రా ! మఱియొక మాట ! తగినపనికిఁబోయి తలప్రాణముఁ దోఁకకుఁ దెచ్చుకొని నారదునితోఁ బంతము లాడుటవలన నింతమూడెనని నన్ను నిందింపవలదు సుమా! నే నిది వలదనుచుంటిని. ముమ్మాటికి వలదనుచుంటిని.

ఇం— మహాసింబ్రా ! మిమ్ము దూరనేల ? పోయిరండు.

నార— మంచిది. (నడచుచు స్వ) ఆతులసి యందచందముల వర్ణించి చెప్పి తమిగలిగించి వీని గోతిలోఁద్రోయ నుద్దేశించితిని, కాని యాశ్రిమ మంతగాలేకుండ నీతఁడు దనంతఁ బడినాడు ఎట్ల యిననేమి ? నాకోర్కె నెఱవేఱినట్లే ! ఇతని యుత్సకతఁజూడ నేఁ డిల్లిలోనే యందులకుఁ బ్రయత్నించునని తోఁచుచున్నది. ఎప్పుడేఁగునో కనిపెట్టి జలంధరున కెఱింగించి యాతని నటకుఁ బంపెదఁగాక—

(గానమొనర్చుచు నిష్క్రమించుచున్నాడు.)

ఇంద్రు—

గీ. తెలివ యౌవనసూయకంటెఁ బ ♦ తివ్రతయఁట!
సుదతి గౌతము సతికంటె ♦ సుందరియఁట!
బ్రహ్మమానస పుత్త్రుని ♦ భాషణముల
నెంత సత్యమున్నదో నేఁడ ♦ కాంతుఁగాక.

ఇందు శంకింప వలసిన దేమున్నది? ఆ జలంధరుఁడు దానిం ద్యజియించె నని వినియుంటివిగదా? అదిగాక తులసి బలిపురంబున నున్నది; వాఁ డక్కడ కెందులకు వచ్చును? ఒకవేళ వచ్చినను భార్గవుఁడు పెట్టిన గడువు మీఱకమున్న వాఁడు నన్ను జెనక సాహసించునా? నేఁడే పోయెదఁగాక.

(నిష్క్రమించుచున్నాఁడు.)

## తృతీయ రంగము.

ప్రదేశము - జలంధరుని మందిరము.

[ప్రవేశము - జలంధరుఁడు.]

గీ. అరుల శోణిత మరయని ♦ యక్షులేల?
పరులయస్తుల విఱుపని ♦ కరములేల?
పగఱ శవములఁ ద్రొక్కని ♦ పదములేల?
శాత్రవుల మదమడఁపని ♦ జన్మమేల?

[ప్రవేశము - సేవకుఁడు.]

రాజేంద్రా! మిమ్ము దర్శింప నారదమునీంద్రులవారు వచ్చి ద్వారమునఁ గాచియున్నారు.

జలం—తోడ్కొనిరమ్ము.

(సేవకుఁడు నిష్క్రమించి నారదమునితోఁ బ్రవేశించును.)

జలం—నారదమహర్షీ! నమస్కారము.

నార__కల్యాణమస్తు. దానవేంద్రా! తులసీదేవి__

జలం__మునిచంద్రా! ఆ పిశాచిమాట యెందులకు?

నార—ఓయీ! మూర్ఖుఁడా! అగ్నిసాక్షిగఁ జేపట్టిన యిల్లాలు—

జలం—చచ్చినదా? సంతోషము! శ్రవణానందకరమైన సంగతిఁ జెప్పితిరి? దానితోఁ బంపఁబడిన దాసీదాసజనములు దక్కిన పనిఁ గావించిరా? చెప్పరేమి? చెప్పరేమి? మునీంద్రా! అట్లు చూచెదరేమి?

నార—ఆకాంత యెప్పుడు గతించునా యని వేచియున్నవాని కింక నాజోలి యెందులకు?

జలం—ఆహా! చావలేదా? జీవించియే యున్నదా? అయ్యో! సంతోషించితినే?

నార—ఇప్పుడు సంతోషమున కేమిలోటు? నీ శాపీడ యొట్లువదలిన నొకటేగదా?

జలం__ఇం కెట్లు వదలఁగలదు?

నార—ఏయింద్రుఁడో యెత్తికొనిపోయెను.

జలం—ఆఁ! ఆఁ! నారదా! అదియేమి? నా భార్యను వాఁ డెత్తుకొని పోయినాఁడా? చెప్పవేమి? చెప్పవేమి?

నార__ఆమె నొల్లనివానికి నీ కామెసంగతి నడుగవలసిన యావశ్యక మేమి? ఇట్టి నీకు మేము చెప్పవలసిన యావశ్యకమేమి? మే మింకఁ బోయెదము.

జలం__నారదా! కొంచెము నిలువుము! ఆమాట సరిగాఁ జెప్పుము ఆ దుర్మదాంధుఁ డింద్రుఁడు నాకాంతను—

నార—తిరిగి నీకాంత యనెదవేమి? పిశాచిగాదా?

జలం—అబ్బబ్బ! నారదా! ఎందుల కీ యనవసరపుమాటలు? నాయందు

దయయుంచి యీ యొక్కమాటఁ జెప్పుము. వాఁడు నాసతిని జెఱవట్టెనా ?

నార— అని నే నంటినా ?

జలం— ఎత్తుకొనిపోయెనని యని, నే నంటినా యనెదవేమి ?

నార— ఇంతవఱ కెత్తుకొనిపోలేదు. ఇఁక ముందు—

జలం—ఆఁ! ఆయభిప్రాయముతో నున్నాఁడా? ఎంత కండకావరము !

నార— ఉండుటయేమి ! అందులకే యాతఁడు స్వర్గమునుండి యటు బలిపురంబునకుఁ బోయినాఁడు. నే నిటు నీకడకు—

జలం— ఆఁ! ఆఁ! బలిపురంబునకుఁ బోయినాఁడా? నాదారను జెఱపట్ట నెంచినాఁడా ?

శా. ఏమీ? యెంతటిసాహసిక్యమర రే! ♦ యిందుండు కామాంధుఁడై
భామారత్నము మత్సతిన్ జెఱఁగొనన్ ♦ భావించి యిట్లేగెనే,
యీమాహాత్మ్యనడంతు, నాతులువఁబ్రా ♦ ణాంతమ్ముబొందింతు సు
త్రాముండుర్వింతు వంధితు నొంతునిదియు ♦ ద్యత్తీక్ష్ణధారాహతిన్.
(అనుబంధము 6.)

(నిష్క్రమించును.)

నార—

ఉ. దొంగయెనండొ నీధనము ♦ దొంగిలిపోయెడు నన్ననంగదన్
బ్రింగఁగఁబోని పూరుషులు ♦ భూమిని నుండిన నుండవచ్చు, నీ
యంగనఁగొంచుఁబోవుటకు ♦ యత్నమొనర్చెడు నెవ్వఁడోయనన్
బొంగమునింగి గంతులను ♦ బెట్టని పూరుషుఁ డుండఁ డొక్కఁడున్.
ఆ. వె. వనితనొల్ల నట్టి ♦ వాఁడైన దాని నిం
కెవ్వఁడో హరింప ♦ నెంచు ననినఁ
దనదు తాతముల్లె ♦ దరగినట్లు తపించు
సాజమిద్ది పురుష ♦ జన్మమునకు.

ఇంద్రుని డీపాటికిఁ దులసీదేవితోఁ జీవాట్లు తినుచుండును. మఱికొంతసేప టికి జలంధరుని కర్త్రోటులు చవిఁజూచును. ఈ వినోదముఁ జాటున నుండి నేఁగూడఁ జూడవలయును.

(గానమొనర్చుచు నిష్క్రమించును.)

తురీయరంగము.

ప్రదేశము - బలిపురమునఁ దులసీదేవి యంతఃపురము

[ప్రవేశము - తులసీదేవి.]

తుల— హా! దైవమా! తుదకు నాకిట్టిగతిపట్టెనే! నన్నెందులకు సృజిం చితివి? విరహమున నిట్లు కృశింపఁ జేసి చంపుటకా? ఆ మహా ప్రభునకు దాసిగానైనఁ బుట్టింపక పోయితివే! హా! నాథా! నాథా! ఎంతయన్యాయ మొనర్చితివి?

సీ. పిన్ననాఁటంగోలె ♦ నన్ను దైవముఁ బోలె
నెన్న బేలయటంచు ♦ నెన్నకున్న
అగ్నిసాక్షిగఁ గొన్న ♦ యలివేణి విడచుట
ధర్మమ్ము గాదంచుఁ ♦ దలఁపకున్న
ఈవె దిక్కని చేత ♦ నిడ దీని జనకుం, డ
టంచు నించుకయు యో ♦ జించకున్న
సిగ్గు బండతనానఁ ♦ జేసె నీయపరాధ
మెఱిఁగి చేయదటంచు ♦ నెంచకున్న

గీ॥ లేరె కాంనిసల్ పెక్కురు ♦ వారిలోన
నింతియొకతెయై పడియున్న ♦ నేమినష్ట?
మనియునైన విచారింప ♦ కకట! యిట్లు
పాలువైచితె బలిపురిం ♦ బ్రాణనాథ!

మనోహరా! సమస్త ధర్మాధర్మవేత్తవు! ఒక పొరఁబాటునకు—సిగ్గు

వలనఁ గలిగిన యొకయులఁతి పొరఁబాటున—కింతకినియుదువే ? ఇంత శిక్షయొసంగుదువే ? కట కటా ! మరణదండన విధించిన నాకింత చింత లేకుండెడిదిగా ? ఆబుద్ధియైనఁ బుట్టదయ్యెనే ? నిన్నెంత కఠినుఁ డనవల యు ?—అయ్యో ! నాపాపమునకుఁ బ్రాణేశ్వరుని నిందించు టెందు లకు ?

ఆ. వె. పూర్వజన్మమందు ♦ నోర్వలే, కేమిధు
నములఁ బాయఁజేసి ♦ నానో; దాన
దైవ మిట్లు నాదు ♦ దేవుని నెడఁబాపె
సమ్మహాత్ము దూర ♦ నఘముగాదె.

మహాప్రభూ ! నిన్ను నిష్కారణముగఁ దూలనాడినందులకు నన్ను మన్నింపుము.

అక్కటా ! ఆర్యపుత్త్రి నెడఁబాసి నెల గడచెఁగదా ? ఆ మహాసురేంద్రుని సేమ మొకరైనఁ జెప్పరైరిగా ?

[ప్రవేశము - కొంతదూరమున నింద్రుఁడు.]

తుల— పరమేశ్వరా ! నా హృదయేశ్వరు ననవరతముఁ గాపాడుము.
(పందుకొనుచున్నది.)

ఇం— (స్వగతము) ఔరా ! ఏమి విచిత్రమది ?

సీ. మునిమోములఁ బగ్గలా ♦ డినవేళఁ గలధైర్య
మతివక్కై యిలువాసి ♦ నపుడు లేదు
అతివక్కై యిలువాసి ♦ నపు డున్న ధైర్యంబు
పురముఁజేరిన క్షణ ♦ మ్మునను లేదు
పురముఁజేరిన క్షణ ♦ మ్మున నెసంగినధైర్య
మంతిపురిం జొరు ♦ నపుడు లేదు
అంతిపురిం జొరు ♦ నపు డున్న ధైర్యంబు
పడుకటింటను జొచ్చు ♦ గడియు లేదు,

గీ. పసుకటింటను జొచ్చిన ♦ గడియనున్న
ఈ రవంత ధైర్యంబైన ♦ నింకమీఁద
నుండునో యుండదో కటా! ♦ యువిదఁ జూడ
దారునపుడుఁ? బలుకరింపఁ ♦ జీరునపుడు?

కట్టా! నే నెంతపొరఁబడితిని? ఈ నెలఁత మహాపతివ్రతయని నారదుండు వచింప నాకర్ణించియు దుర్గర్వమ్మునంజేసి దూర మాలోచింప నైతినే! బ్రహ్మమానస పుత్త్రుని పజ్జ రజ్జులాడితినే! ఛీ! ఛీ! ఈ కలహ భోజనుఁడే నాకొంపఁ దీసినాఁడు! అయ్యో! అతని నిందింపనేల? నా మౌఢ్యమును నా తలపొగరును నిందింపవలయుఁ గాక. ఆకాంచన గర్భసంభవుఁ డామందగమన యందచందముల సద్గుణముల వర్ణించి చెప్పనే గాని యమ్మగుదం దప్పక నీవ చేపట్టవలయునని గాని భంగ పెట్టవలయునని గాని నన్నుఁ బ్రోత్సాహపెట్టెనా? నన్నుఁ దీరరాని ప్రతిజ్ఞలఁ బట్టుమనెనా? మీఁదు మిక్కిలి వలదు వలదని నొక్కి వక్కాణించెనే? చేటు వాటిల్లు ననెనే! హా! అప్పటికైన నామ హాత్మని మాటలఁ జెవిఁ బెట్టనైతినే? ఇంతకు నా యహంకరణము నన్నింతచేసినది? ఇప్పు డేమిచేయుదును? తిరిగిపోవుటయే యుచిత మని తోఁచుచున్నది! ఇసీ! ఏటిమాట! త్రిలోకాధీశ్వరుండనై ప్రథ మదిక్పాలుండనై యంతటి వానిచెంత నొక రాక్షసకాంత లోఁగొను వాఁడనని పగ్గెలుపలికి—ఇంతదూరమువచ్చి—యంతఃపురముఁజొచ్చి-నెత్తిని గుడ్డవైచుకొని యిప్పుడు తిరిగిపోవుటయా? ఆనారదుఁడు—ఆ త్రిలోకసంచారి యివ్వార్త విన్న ముల్లోకముల నిది వెల్లడింపఁడే! లోకులెల్ల యింద్రుఁ డింత యసమర్థుఁడాయని నవ్వరే! ఇసీ! తగదు. తిరిగిపోవుట తగదు. వచ్చినవాఁడను రానేవచ్చితిని—ఏమైనఁ గానిమ్ము. నావచ్చిన పసి నెఱవేర్చుకొనఁ బ్రయత్నించి చూచెదఁగాక.

(పరిక్రమించి తులసింజూచి యచ్చెరువుతో)

అద్దిరా ! ఈ ముద్దులగుమ్మ మైమెఱుంగు మధ్యందినమార్తాండమండల ప్రభయుంబోలెఁ దేటిచూడ నీకున్నదే? హా! యేమి యీ మోహనాకారము !

ఆ. వె. ముజ్జగముల లోన ♦ ముదితలలో నహ
ల్యావధూటి పాటి ♦ యతివ లేదు
కాని యీనెలంత ♦ మైన నీకాంతకు
సాటి వచ్చునంట ♦ సాహసంబె.

ఉ. ఏమిటి కింక నీజలరు ♦ హేక్షణయే యొనఁగూడు నేనిఁ బౌ
లోమియు ? రంభ దేనికిఁ ? ది ♦ లోత్తమ యెందుల? కేటి కూర్వశీ
భామిని ? దక్కఁగల్గు సుర ♦ వారసతుల్ పదివేలమందియే
లా? మణిచాలదే యొకటి ♦ యద్దపుఁ బెంకులు పెక్కులేటికిన్.

(తులసిం దేఱి చూచి) ఓహో ! ఈ కల్యాణి నిద్రించుచున్న దనుకొంటిని గాని యీకాంత కింక నిదుర పట్టినభంగి గానరాదు. అవిగో కన్నులు మూయఁబడియున్నను ఱెప్పలు చలించుచునే యున్నవి. ఈ యలికులవేణిం బలుకరించి చూచెద, (ప్ర) ఓ జగన్మోహినీ !

తుల— (సంభ్రమముతో లేచి. దూరముగఁ బోయి నిలిచి) ఆహా !
యెవ్వఁ డీ మహనీయుఁడు ? ఇక్కడ కెందులకు వచ్చెనో ?

ఇంద్రు— కామినీ ! భయ మెందులకు ?

చ. తలఁకెడ వేల? బేల! దవు ♦ దవ్వుల కేఁగెద వేల? దొంగఁగాఁ
దలఁచుచు నుంటివో? చెనఁటి ♦ దయ్యమటంచు భ్రమించుచుంటివో?
తెలియుము నన్నదే సకల ♦ దేవకిరీటమణిప్రభావిని
ర్మలపదయుగ్ముఁగాఁ, ద్రిదివ ♦ రాజ్యరమారమణీ కళత్రుఁగాన్.

తుల — మహాత్మా ! సురసార్వభౌమా ! నమస్కారము. మిమ్ముఁ
జూచుటచేఁ గృతార్థనైతి.

ఇంద్రు— (స్వ)

గీ. అబల నన్నుఁ జూచుటనె కృ ♦ తార్థనైతి
నంచుఁ బలికె, నిన్ వలచితి ♦ నన్న నవల
నెంతయుబ్బి తబ్బిబ్బాయెనో ♦ యింక నాదు
కోర్కె నెఱవేఱెనని యను ♦ కొనుట తగదె?

(ప్ర) కామినీమణీ! త్రిజగన్మోహినివగు నిన్నుఁ గనుంగొనుటచే నేనును ధన్యుఁడనైతిని.

తుల— (స్వ) ఈ మహాత్ముఁ డిట్లనుచున్నాఁడేమి?

ఇం— అలివేణి! ఏమి యోజించుచుంటివి? మాటాడవేమి?

ఆ. వె. చంచలాక్షి! మొగము ♦ వంచితి విదియేమి?
వేయికనులతోడ ♦ విబుధనాథుఁ
డీక్షణమ్ము సేయ ♦ దృష్టిదోషము గల్గు
నంచు నెమ్మనమున ♦ నడలెదొక్కొ?

తుల— (ప్ర) ఆర్యా! మీ రిక్కడ కెందులకు వచ్చితిరి?

ఇం— (స్వ) ప్రశ్నించుచున్నదేమి? (ప్ర) దేవీ! విన్నవించుకొనుచున్నాఁడ. నవధరింపుము.

ఉ. నీ రమణీయరూపమును ♦ నీదు నొయారము నీచరిత్రముల్
నారదమౌనిమౌళివల ♦ నన్ విని, డెందము నిల్పి నీపయిన్
వారిజపత్త్రనేత్ర! సుమ ♦ బాణశరాగ్నికిఁ జిక్కి నీకృపా
వారిని గోరి యిచ్చటకు ♦ వచ్చితి దాసు ననుగ్రహింపవే.

తుల— (స్వ) ఆహా! నారదమునీంద్రా! ఈ నిర్భాగ్యురాలి రూపము నింద్రునియందు వర్ణించి యింత చేసితివా? ఆమహాత్ముఁ డిట్లు చెప్పఁగాక. ఇతని కిదియేమి తలంపు?

ఇం— కాంతామణీ! నాఁటినుత నాపడు నవస్థ వర్ణింప నలవిగాదు— మఱియు—

సీ. యజ్ఞయాగాదుల ♦ కరుగ సోమముఁగ్రోల
దరుణి ! నీయధరామృ ♦ తముఁ దలంచి
నిరుపమ చింతామ ♦ ణిపీఠికం జేర
నెలఁతుక ! నీదు స ♦ న్నిధిఁదలంచి
స్వర్గవారాంగనా ♦ సంగీత మాలింపఁ
బాలఁతి నీముద్దు ప ♦ ల్కులఁ దలంచి
సుందరమందార ♦ సుమగుచ్ఛముల ముట్టఁ
గలికి నీవక్షోజ ♦ ములఁ దలంచి

గీ. విమలమందాకినీతరం ♦ గముల దేలఁ
దలఁపుగాన బాల నీదు కౌఁ ♦ గిళులఁ దలఁచి
త్రిదివరాజ్యలక్ష్మి నొకింత ♦ తేఱిచూడఁ
బోను పల్లవపాణి నీ ♦ పొందుఁ దలఁచి.

తుల:— తండ్రి ! నీ కిదియేటిదుర్బుద్ధి? పావనామరవంశపాథోధిచంద్రుఁడవు ! విబుధేంద్రుఁడవు ! నీ కిట్టికోరిక తగునా? నీ నోట నుచ్చరింప రానిమాట లుచ్చరించితివే ?

ఉ. చెల్లునె తండ్రి ! యిట్టి చెడు ♦ చేఁతలఁ జేతముఁజేర్ప దేవతా
వల్లభుఁడై తనర్చు నిను ♦ వంటిమహాత్ము? కీవె యీవిధిన్
దల్లు లనంగఁజెల్లు పర ♦ దారలఁ గోరిన, నల్లమందు భీ
తిల్లెద రే దురాత్ములు స ♦ తీమణులన్ బలవంతపెట్టఁగన్ ?

ఇం— (స్వ) ఇదేమి? తుదకిట్లు పరిణమించినదేమి ? ఏమో యాసపడితినే?—అయిన నింతమాత్రమున నిరాశవహింపఁ బనిలేదను కొనెదను—ఏమన ?

గీ. "ఉహూహూ" హని తొట్రిల్లననకయు ♦ "ఊఁ"యటంచుఁ
బురుషునకు లోఁబడదుచూవె ♦ పూవుఁబోఁడి

ఆట___ఓలః—నాలాపించు ♦ నవలఁగాదె
పాట గాయకునకు లొంగి పరఁగు టెందు ?
గీ. మొదటఁ జీవాట్లువెట్టక ♦ పూరుషునకు
మోవిపానక మీదుచో ♦ తీవఁబోఁడి
పాదతాడనమ్ములొసంగు ♦ పైనిగాదె
పాలొసంగు మొదటియీఁత ♦ పాడిమొదవు.

కాంతామణీ ! విబుధసార్వభౌమునకు ధర్మోపదేశములా ?

తుల— ఇందు నా దోషమేమి ? అంతటివాని కిది యేటిదుర్బుద్ధి ?

ఇ — ఇది దుర్బుద్ధియా ? దేవీ ! నీవు పొరఁబడుచుంటివి. ఏమన,
గీ. తరుణి వలచుట పురుషుని ♦ తప్పుగాదు
సకియ చక్కఁదనమ్ము దో ♦ సమ్మెగాని
పువ్వుఁగోరుట తేఁటి దు ♦ ర్బుద్ధిగాదు
బూనవలరు మధువుతీపి ♦ తప్పెగాని.

తుల— ఏమి యపూర్వసిద్ధాంతము ? నిన్నుఁ గామపిశాచ మావహించుటకు నారూపమా కారణము ? నీబుద్ధిమాంద్యము గాదేమి? నీ కండకావరము గాదేమి ? మద్యము త్రాగుబోతులకు రుచించుటకుఁ గారణ మందలి మాధుర్యమా ? తమ జిహ్వాచాపల్యమా ? మాధుర్యమే కారణమైన నంతకన్నఁ దీయనైనచెఱకు పానకములేదా ? తేనెలేదా ? అటులే నీవలపునకుఁ గారణము రూపమేయయినఁ బౌలోమిలేదా? రంభాద్యప్స రస్త్రీలులేరా ? వారిచక్కఁదనమున నేమికొఱఁత ?

ఇం___ కామినీ ! వారందఱుఁ దారలు, నీవు చంద్రరేఖవు.

తుల— నీదయ్యపుఁగంటికి—భర్తనెడఁబాసి కాసారముం బాసిన కమలినియుంబోలెఁ గృశించియున్న నేను నచ్చరలకంటె వందగత్తెఁగా నీకుఁ దోఁచుచుంటినా ? నీ వెంతమూఢుఁడవు ?

ఇంద్రు — అతివా! నీవు కృశించితివన్నమాట నిశ్చయమే — అయిన
నీ సౌందర్యమున కేమిలోటు?

గీ. అందగత్తె కృశించిన ♦ యంతమాత్ర
దాని రూపమ్మునకు లోటు ♦ దనరునొక్కొ?
ఎంతగా వాడిపోయిన ♦ నేమిలోటు?
పొగడపూవున వాసన ♦ పోవునొక్కొ?

దేహము కృశించిన యందమున కేమి?

తుల — ఆహా! ఆ క్రూరదైవ మిట్టికాముకుల మోహింపఁజేసి యగ చాట్లుపడుటకా నా కీపాడురూప మిచ్చినది? ఎంత దురదృష్ట వంతురాలను!

ఇంద్రు — దురదృష్టవంతురాలవా? అసత్యము.

గీ. అరసికుండు నీవిభుఁ డొల్ల ♦ నంతమాత్ర
నతివ! దురదృష్టవంతురా ♦ లయితె నీవు?
వెడఁగునక్క భుజింపక ♦ విడిచినంతఁ
గలికి! కొరలాయి కిసుమంత ♦ గలదె లోటు?

ఇదియుంగాక నీవంటి యదృష్టవంతురాలింకొకతె యుండఁబోదని నేను సిద్ధాంతీకరింపఁగలను. ఏలన,

గీ. ముజ్జగములఁ బాలించు ప్ర ♦ భుండు, దివిజ
విభుఁడు, నిఖిలాప్సరోంగనా ♦ విటుఁడు వీఁడె
హస్తయుగ్మము మోడ్చి ని ♦ న్నర్థివేఁడు
చున్నవాఁ డింక నెవతె నీ ♦ కన్న ధన్య?

తుల — సురసార్వభౌమా! నీకిది తగదు. బుద్ధిమదగ్రగణ్యుండగు బృహస్పతికిఁ బ్రియశిష్యుండవు! విబుధుల విబుధులకు విభుండవు. జగదుత్పత్తిస్థితిలయకారణుఁడగు నారాయణుని కగ్రజుండవు!

సమస్తధర్మాధర్మవేత్తవై జగత్త్రియము శాసింపదలసినవాఁడవు! కామోత్కంరతఁ గన్నులుగానక పాపాత్ము లేరైనఁ బతిదేవ తలఁ బరిభవింపఁ బ్రియత్నించిన నడ్డుపడవలసినవాఁడవు ! ఇట్టి నీవు మఱఁదప్పి యేకపత్నినగు నన్నుఁ గామించితివి ! దొంగ తనమని, దుండగమసి, దుష్కృతియని, దురితమని యొక్కించు తయు నాలోచింపక తిరస్కరణీ విద్యాప్రభావముననో మఱింక నేమహిమముననో, దౌవారికులఁ గన్నులఁగప్పి నాయంతఃపు రముఁ జొచ్చితివి ! సకలాత్మసాక్షివయ్యు నాహృదయ మిట్టిదని యెఱుఁగక నీదుర్వాంఛ వెల్లడించితివి. నే నాడినమాటల విం టివి ! ఇంతటితోనైన మిన్నకుండరాదా? నోరుమూసికొని తిరిగి పోరాదా ? నాపరమేశ్వరుని, నాహృదయేశుని, నా ప్రాణనా థుని నరసికుఁడని దూషించి, నీరసికత్వమును జాటుకొను చుం టివా ? కోడియో, గోడిగయోనై నా నాధుఁడు వేఁగన్నులు దెచ్చుకొనక పోవుటచేతఁ, బరకాంతల చెంత కేఁగి పాపంపు మా టలఁబలికి నామనోహరుఁడు నీవలెఁ జీవాట్లు తినకపోవుటచేత, నినుబోఁటి రసికుండు గాకపోయెఁగాఁబోలు ? ఇస్సీ ! చాలు నీ ప్రసంగము. ఇంతటనైన సిటనుండి వెడలుము.

ఇం— అతివా ! నీ నాధునిపై నీకుఁగల యభిమానమునకు నాకు నవ్వు వచ్చుచున్నది.

ఆ. వె. రమణి ! నీవిభుండు ♦ రసికాగ్రణియయుగు
నైన నీకుఁగాని ♦ యట్టిచెనఁటి
ఎట్టి రసికుఁడైన ♦ నేమి ? యందనిమ్రాని
పండు తీయనైన ♦ ఫలము గలదె ?

తుల— దేవేంద్రా ! నాపతిపై నాకుఁగల యభిమానమునకు నీకునవ్వు వచ్చుచున్నదా ? నీమౌర్ఖ్యమునకు నాకును నవ్వువచ్చుచున్నది.

గీ. అనఘ! రూపవతినె ♦ యగుదుగా కేనైన
నిన్ను నొల్లనట్టి ♦ యన్నమిన్న
ఎట్టిదైన లాభ ♦ మేమి? యందనిమ్రాని
పండు తీయనైన ♦ ఫలము గలదె?

ఇంద్రు— అలివేణీ! అందనిమ్రానిపండు తీయనైనఁ జేదైన నొకటె! అయిన నిందు నాకందనిదేమున్నది? —(అంటఁబోవుచున్నాఁడు.)

తుల— (తొలఁగినిలిచి) ఆఁ! ఆఁ! మూర్ఖుఁడా! జాగ్రత్త! నిలువున నీరయ్యెదవు.

(అనుబంధము 7)

ఇంద్రు— కామినీమణీ! ఇంత నిర్దాక్షిణ్యమా? ఇంత మౌఢ్యమా?

మ. సకియా! ముప్పదిమూఁడుకోట్ల సురలే ♦ స్వారాజు పాదంబుల
త్యకలంకస్థిరభక్తిఁ గొల్తు? రలదే ♦ వాధీశుఁ డివాఁటఁదా
పక పాదాంబుజసేవ నెమ్మనమునన్ ♦ వాంఛించి ప్రార్థించుచో
నకటా! మేలఁటె తూలనాడెదవు? మా ♦ ధ్యంబన్న నొండున్నదే?

మోహారత్నమా! ఆశ్రితునిశ్రమమైన నించు కరయవలదా? ఎక్కడి నాకము? ఎక్కడిబలిపురము? ఇంతదూరము వచ్చుట నీకొఱకేగాదా? ఇదియుంగాక యర్థియాధిక్యమైన నింత విచారింపనలదా? చూడు.

గీ. ఆశ్రితజనమ్ముకోర్కెల ♦ నపుడ తీర్చు
కల్పతరులు మణియుఁ గామ ♦ గవియుఁ గల్గు
నమరవల్లభు నంతవాఁ ♦ డర్థి వేఁడ
నువిద! కైకొనక నిరసించు ♦ టొప్పు నటవె?

తుల— దేవేంద్రా! నీ దుష్కాంక్ష యింకను వదలకుంటివా?

ఇం— సుందరీ! నీ కాఠిన్యమింకను వదలకుంటివా? ఓ కామినీ! నాదైన్యమునకైన నీ మనసు కరఁగుట లేదా?

సీ. పాణియుగ్మము మోడ్చి ♦ ప్రార్థించినంగాక
యూర్వశిం బదముల ♦ నొత్తనీయఁ
జేదోయి నుదుటిపైఁ ♦ జేర్చికోరినఁగాక
ప్రిమ్మోచ సురటి వీ ♦ వంగనీయ
క్షోణిని ఫాలమ్ము ♦ సోఁక మ్రొక్కినఁగాక
మేనకఁ జెంగట ♦ మెలఁగనీయ
అడుగుఁదమ్ములఁబడి ♦ యర్థివేఁడినఁగాక
రంభను సెజ్జజే ♦ రంగనీయ
గీ. ఇట్టినే—నెట్టియంగన ♦ నేని, నెన్నఁ
జేని, నేమరపాటున ♦ నేని 'దేహి'
యనని నే—నిట్టులల్లాడ ♦ నలరుబోఁడి
యీసండితె, నాదుష్ప్రాప్తి ♦ నేమి చెప్ప ?
గీ. ప్రణయ కోపమ్మునంజేసి ♦ ప్రాణములకుఁ
బ్రాణమైన పులోమిజ ♦ పలుకకున్నఁ
జిబుకమంటని యభిమాని ♦ సిగ్గుమాని
త్వత్పదములంటి ప్రార్థించుఁ ♦ దరుణి ! యిదిగో !
(అంటఁబోవును.)

తుల—ఛీ! ఛీ! మహేంద్రా! ఎంతసిగ్గుమాలినతనము! దుష్ప్రాప్తియని యేడ్చుచుంటివా ? నిశ్చయమే! కట్టుకొన్నదొక తెయేగాక కావలెనన్న నిసుకపాతరవలెఁ దఱుగని యప్సరోజనములుండ వారితోఁ దనియక పరకాంతలఁగోరి చీవాట్లుదినుట దుష్ప్రాప్తి గాదా ? హరిహరబ్రహ్మలకుఁదక్క మ్రొక్కియెఱుఁగని యీ చేతుల నొకయాఁడుదాని పాదముల స్పృశించి పావనములుగఁ జేసికొనఁ దలంచుట దుష్ప్రాప్తిగాదా ? ఎంతమౌఢ్యము ! ఓ విబుధగ్రామణీ !

ఉ. అంగదఁ దన్నుఁ గోరు ♦ కమలాక్షులఁ బెక్కురఁ గల్గి వారివం
కం గనఁబోక యన్యసతిఁ ♦ గా మనఁ జేయుటయుం వివేకమే ?
ముంగలనున్న యన్నమును ♦ ముట్టక కాలనుదన్ని కూటికై
యొంగిలివిస్తరిం గతుక ♦ నెంచెడు వెంబరివిత్తు కైవడిం.

ఇంద్రు— ఓ యబలారత్నమా ! నన్నధిక్షేపించుచుంటివిగాని నీ వివేకముమాత్ర మేమి ?

ఉ. అంగదఁదన్ను వేడు పురు ♦ షాగ్రణి దండనయుండ వానివం
కంగనఁబోక భర్తపయిఁ ♦ గాంక్షఁ దపించుటయుం వివేకమే?
చెంగటనున్న కూపముఁ ద్య ♦ జించి జలంబుల ద్రావుకోసమై
యంగన ! యెండమావులకు ♦ నాసవహించెడు బేలపోలికిం.

మఱియు నీ నాధునకు నీ శచీనాధునకు నెంత తారతమ్యమున్నదో విచారింపుము.

ఆ. పదములందు వ్రాలి ♦ ప్రార్థించినను నిన్నుఁ
గైకొనం డతండు ♦ కమలనేత్ర !
చేరి పదములంటి ♦ జీవాట్లు దినియు ని
న్వేఁడుచున్న వాఁడు ♦ వేల్పుఱేఁడు.

తుల— మహేంద్రా ! నీవెంతమూఢుఁడవు! భర్త నిరసించినంతమాత్రమునఁ బతివ్రత పరపురుషునిఁ గాంక్షించునా ?

సీ. ఘనఘనాంబువు దొర ♦ కనిమాత్రమునఁ జాత
కాంగనఁ జవిటినీ ♦ రానునయ్య ?
లలిత కిసలయమ్ము ♦ లభ్యమ్ము గాకున్నఁ
గోయిల చిగిరింత ♦ మేయునయ్య ?
నిర్మలసరసి గ ♦ న్పింపకుండిన మాత్ర
హంసి మడ్వాన నీఁదు ♦ లాడునయ్య ?

ఇంచువెన్నెల లభి ♦ యింపకున్నంత వె
న్నెలపులు గెండను వలచునయ్య ?

గీ. ప్రాప్తిలేమిని బ్రాణేశు ♦ పాదసేవ
దనకుఁ గలుగకపోవుమా ♦ త్రమున నకట !
భవ్యచరిత పతివ్రత ♦ పాడిఁ దప్పి
పరునిపొత్తున కేవ నాస ♦ పడునఁటయ్య ?

ఇంద్ర— అలివేణీ ! నీవెంతగోలవు !—సిరిరా మోకాలొడ్డుచుంటివి. నిర్జరేంద్రు నంగీకరించిన నీకు గలుగఁబోవు ప్రాభవమెంతయో యింతయు యోజింపవా ?

సీ. బాల ! ముజ్జగములఁ ♦ బాలించు ప్రభున కి
ల్లాలవగుటకన్న ♦ మేలు గలదె ?
లలన ! త్రింశత్కోటి ♦ దేవతల్ సేవింప
గరిమఁ బొల్చుటకన్న ♦ ఘనత గలదె ?
వామాక్షి ! కశ్యప ♦ బ్రహ్మకుఁ గోడల
వై యొప్పుకన్న భా ♦ గ్యంబు గలదె ?
కలికి ! లక్ష్మీనాథు ♦ గారాబువదినవై
వఱలుటకన్నఁ బ్రా ♦ భవము గలదె ?

గీ. చెలియ ! చింతామణీభద్ర ♦ సింహపీఠి
నింద్రునంక మెక్కుటకన్న ♦ నింపు గలదె ?
సకియ ! జరయు మృతియు లేక ♦ సంతతంబు
సురపురిఁ సుఖించుటకన్న ♦ శుభము గలదె ?

తుల— దేవేంద్రా ! చాలు. జలంధర సార్వభౌమ చరణారవిందముల సేవించుటకుఁదక్క నామన మింకొక సుఖమున కాసింపదు. నీ కిదివృథాశ్రమ. ఇంతటనైన నీప్రసంగముఁ గట్టిపెట్టి వచ్చిన త్రోవఁ బట్టుట నీకు శ్రేయోదాయకము.

ఇం— (స్వ) ఇఁక దీనిమ్రోల దైన్య మనావశ్యకము. (ప్ర) తన్వీ! కవితను గాంతను నిర్బంధించి వశపఱచుకొనుట తగదని యింత వఱక నిన్నిట్లు ప్రార్థించితిగాని త్రిలోకాధినాథుఁడు సర్వసమర్థుఁడు సుమా!

తుల— బలశాసనా! నీ వీ నీచకార్యమున కంగీకరింపకున్న బలిమినైనఁ బట్టుటకు నేను సమర్థుఁడనని నన్ను భయపెట్టుచుంటివా? నీకన్న సర్వసమర్థుఁ డింకొకఁడున్నాఁడని నీకుఁ దెలియదా?

ఇం— నీ భర్తయా? ఆహా ఆమాట స్పష్టముగఁ జెప్పరాదా? ఓబేల! విబుధేశ్వరునియెదుం దాబడుగురక్కసి యెంతవాఁడు?

తుల— అయ్యో! నేను నాభర్తమాటఁ జెప్పుటలేదు—నీ వామహావీరాగ్రేసరుని బడుగురక్కసియని నోట నుచ్చరించుచుంటివి గాని యాదానవసార్వభౌముని గూర్చి యెంతగా నీగుండెలు గడగడఁ గొట్టుకొనుచున్నవో! నీహృదయమే సాక్షి—నేనిందుఁ బ్రశంసింపనేల? అది యటుండనిమ్ము.

ఆ. వె. విబుధవిభుఁడనంచు ♦ విఱ్ఱవీఁగెద వింద్ర!
నీకు నాకు నెల్ల ♦ లోకములకుఁ
బ్రభుఁడు రక్షకుండు ♦ పర్వతకన్యామ
నోహరుండు లేఁడె ♦ యాహరుండు?

ఇం— ఆ హరుఁ డడ్డుపడఁ గలఁడేమో చూచెదఁగాక!

(పైఁటచెఱఁగు గ్రహింపఁ బోవును.)

తుల— (దూరముగఁ బోయి) ఛీ! ఛీ! పాపాత్మా! ఎంతసాహసిక్యము? ఇంద్రపదవీసంజాత మదాంధకారము గన్నులఁ గప్పెనా? అగ్నిజ్వాలనంటె భస్మముగా నెంచెదవా? కాలభుజంగినిఁ గాఁగిలించి కాలునిఁ జేర సిద్ధపడుచుంటివా? తులసీదేవి నహల్యయని భ్రమించుచుంటివా? ఆగౌతముఁడు వేఁగన్నుల నొసంగెఁ

గాని యీ తులసీదేవి పదివేల కన్నుల నీయ సమర్థురాలు సుమా !

ఇం— (నవ్వుచు) ఈయవలసినదే_నీసౌందర్యముఁ దనివిదీఱఁ జూచుటకు నెన్ని నేత్రములైనఁ గావలసినదే !

తుల — సిగ్గువిడిచిన బాధలేదుగదా ? అవి కన్నులనియే సంతోషించుచుంటివా ? మూర్ఖుఁడా ! నీఫుకప్పిపుచ్చిన రహస్యమాఁగునా ?

ఇం— నీ జాణతనమువలె — ఇంత కేమనెదవు ?

తుల— వినుము—ఇంద్రపదమునకేగాదు, నీ యమరత్వమునకు. నీవంశమునకు హానివాటిల్లఁగలదు. నీవెడఁగుఁగోర్కె విడిచిపొమ్ము.

ఇం— నన్నుఁగోర్కె విడువుమనుచుంటివా ? నిర్దాక్షిణ్యము నీవు విడువఁగూడదా ? (దగ్గఱకుఁ బోవుచున్నాఁడు.)

తుల— (తొలఁగి) ఆ ! ఆ !— (స్వగతము) హా! యిప్పు డేమి చేయుదును ? నాథా ! నాథా ! ఎందుంటివి ?

మ. బలగర్వంబునఁ గన్నుఁగానక యిదే ♦ పాకారి నీకామినిన్
బలిమిన్ భంగమొనర్ప నెంచెడుఁ గృపా ♦ పాథోధి భార్యన్ బరుం
డలయింపన్ దలపూనమిన్నకయ యుం ♦ డన్ బోలునే? రావె! యీ
పలువన్ గీటడఁగింపవే ! కరుణ నా ♦ బన్నంబు వారింపవే !

హా ! మనోహరా ! ఇట్టిసమయమునైన నీకుఁ జాలి గలుగుటలేదా ? ఎంతటి యపరాధమొనర్చిన దాననైనను నీ ధర్మపత్నినే ! నీయనురాగమునకుఁ బాత్రమనుగాకున్న నీకృపకైన భాజనము గాకపోయితినే ! భార్యయని గాకున్న దానవవంశమునఁ బుట్టినదనియైన, నబలయనియైన, దిక్కుమాలినదనియైన గరుణింప రావలదా ? ఆర్తజనావనుండవే ! రాజరాజవే ! ఒక యబల కామాంధుఁడగు నొక నీచునిచేఁ జిక్కి విలపించు

చుండ నూరకుండుట రాజధర్మమా ! హా రావేమి ? నాథా !
నాథా !

ఇం— తన్వీ ! ఆలోచించుట యైనదా ? అనుగ్రహము గలిగినదా ?
(దగ్గఱకుఁ బోవుచున్నాఁడు.)

తుల— (తొలఁగి) (స్వ) హా ! వీఁ డంతకంతకు మీఁదిమీఁదికి వచ్చు
చున్నాఁడు—ఏమిగతి ? ఏమహాత్ముఁలైన నీదుష్టుని వారింప
రారే ?

సీ. ఆశ్రితావన ! దను ♦ జాచార్య ! నాపైని
కరుణ నీకేనియుఁ ♦ గలుగదయ్య ?
కాలనేమీ ! నన్నుఁ ♦ గన్నయ్య ! నాపైని
కరుణనీకేనియుఁ ♦ గలుగదయ్య ?
గోలోకవాస ! రా ♦ ధాలోల ! నాపైని
కరుణ నీకేనియుఁ ♦ గలుగదయ్య ?
అచలకన్యామనో ♦ హర ! హర ! నాపైని
కరుణనీకేనియుఁ ♦ గలుగదయ్య ?

గీ. కటికవానికిఁ జిక్కు లే ♦ గయునఁబోలెఁ
గించుపేనికిఁజిక్కి లే ♦ పించుచుంటి
వేగ నేతెంచి యీయాపద ♦ నీఁగరయ్య !
వనితఁబ్రోచినఁ బుణ్యమ్ము ♦ వచ్చునయ్య!

ఇం— కోమలీ ! నీమొగసి ధ్యానించుచుంటివా ? ఆతఁడు జాలంధరమున
నున్నాఁడు. ఇక్కడ కెట్లువచ్చును? అడియాస వదలికొనుము.
ఇంద్రునితో సుఖింపుము.

తుల— (స్వ) హా ! ఏమి గతి ?

గీ. పాపి వీని నిరోధించు ♦ వారు లేరు
అలుక శపియింతునన్నఁ బ ♦ త్యాజ్ఞలేదు

ఏమిసేయుదు ? నీబన్న ♦ మెట్లు లీఁగు
దును గటా ! యెట్టిదారియు ♦ దోఁపదేమి ?
హృదయమా ! నీ కింతభీతి యెందులకు ?

గీ. పతిని దైవమ్ముగా నెంచు ♦ పద్మనేత్రిఁ
బాపుఁ డొక్కండు స్పృశియించి ♦ బ్రదుకఁ గలఁడె ?
తమకమున సూర్యబింబు ప ♦ ట్టిమ్మునంటి
పురు వెటులు ప్రాణములను గో ♦ ల్పోవకుండు ?

ఇం— కాంతా ! ఏమి యోజించుచుంటివో ?

తుల— నీకు మృత్యువెట్లు గలుగునాయని.

ఇం— ఓసీ ! బేలా ! అమరసార్వభౌమునకు మృత్యువేమే ?

(సమీపమునకుఁ బోవును.)

తుల— హా ! పరమేశ్వరా ! దీనజనరక్షకా ! పార్వతీప్రాణనాథా !
(ధ్యానము నటించును.)

ఇం— (పట్టుకొనఁబోయి తులసిం జూచి భయముతో నిలిచి) ఏమి విచిత్రమిది ? ఇంతలో నీమార్పేమి? ఆ! ఆ ! తులసీదేవి కాదా యీకాంత ? అయిన నిదియేమి ! శంఖచక్ర గదాశార్ఙ్గధారిణియై, సమస్తజన భయంకరస్వరూపిణియై, మహిషాసురమర్దని యుంబోలె మహాతేజోపబృంహితయై మండిపడుచున్న దేమి ? హా ! యిది తప్పక దుష్టదానవదుర్మదుకారిక యగు చండికయే ! కాకున్న నీ వేయిచేతులేమి ? హా ! నాయొడలు గడగడ వడఁకుచున్నది ! అదిగో ! వేఁజేతులఁ గఱకుఁ గరవాలంబులఁ బూని క్రూర కుటిలభ్రుకుటి భీకరఫాలఫలకయై పరకాంతలఁ జూచి కామింపకుండ నీ వేఁ గన్నులఁ బెఱికివైచెద నని మీఁదికి వచ్చుచున్నది ! హా ! ఆ త్రినేత్రుని బారింబడి యదృష్టవశమున నాఁడు జీవించితినిగాని నేఁ డీకాళరాత్రిబారి

నుండి బ్రిదుకుట యెట్లు? ఇంతకు గారణము నా కామోత్కంఠతయుఁ దులసీదేవి పతివ్రతాత్వమును గాదా? నే నిప్పు డేమి చేయుదును?—సాధ్వీమణియగు నా తులసీదేవి పాదములఁబడి మన్నింప వేఁడికొందమన్న నామె గానరాదేమి? ఇంతలో నెటువోయినదో? ఆహా! పొరబడుచుంటిని. ఆతల్లి నిజపాతివ్రత్యప్రభావమున నిట్టిరూపు దాల్చియుండును. కాకున్న ననాథరక్షకుఁడగు పరమేశ్వరుఁడు నాకన్నుల కిట్టిభ్రమ గలిగించియుండును—ఎట్లును దులసి యీామయే యైయుండును. కాన నిట్లుచేసెద—(ప్ర) తల్లీ! అపరాధిని—నన్ను క్షమింపుము— (పాదములపైఁ బడును.)

తుల— (తొలఁగి) హా! పరమేశ్వరప్రభావమున నిందుఁ బ్రవేశించి ... తాపము గలిగినది—బ్రదికితిని—(ప్ర) అన్నా! నిన్ను మన్నించుటకు నే నెంతటిదానను—ఆ దేవదేవుఁడే నిన్ను క్షమించును గాక—

ఇం— (లేచిచూచి) ఆహా! ఆరూపమేది? నేననుకొనినదే సత్యము—ఈ పతివ్రతాతిలకమే యీరూపము ధరించినది—(ప్ర) తల్లీ! నీ యనుగ్రహమునఁ బ్రదికితిని—నా తప్పు మన్నింపు మని నిన్ను మఱియొకమాఱు వేడుకొనుచుంటిని.

చ. అమల పతివ్రతాత్వమున ♦ నంగనలన్ నినుఁ బోలుసాధ్వినా
కమునను గ్రిందిలోకమున ♦ క్ష్మాస్థలిని గనరాదటంచుఁ జె
ప్ప మునివరుఁడు నమ్మకది ♦ వచ్చితి నిన్నుఁ బరీక్షసేయ న
మ్మ! మదిననుం క్షమింపుము కు ♦ మారుని తప్పులు దల్లిసైపదే?

(తిరిగి నమస్కరించును.)

తుల— తండ్రీ! ఎన్నిసారులు వేఁడెదవు? ముజ్జగములకు వందనీయుండ

వగు నీవు నాకు నమస్కరించిన నాకుఁ బాపమురాదా ?
ఆపాపము గలుగకుండ నిదే నీకు నమస్కరించుచుంటిని—

ఇం—అమ్మా ! నీకు మేలగుఁగాక—నేనింకఁబోయెదను. సెలవిమ్ము—

[నేపథ్యమున]

నే వచ్చుచుండ నీవు పోయెదనను చుంటివిరా ? ఎక్కడకుఁ
బోయెదవురా దురాత్మా !

ఇం— (భయముతో) ఆహా ! జలంధరుఁడు వచ్చుచున్నాఁడు.

తుల— (స్వ) హా ! యేమి నాభాగ్యము ? ఆర్యపుత్త్రుని నన్నాళ్ళకుఁ
జూడఁగలిగితిని !

ఇం— దైవమా ! ఏమిగతి ?

ఆ. వె. ఇంతపిన్ననాఁడె ♦ యంతకు గొంతుకఁ
బట్టి నొక్కినట్టి ♦ బలుమగండు
వచ్చుచున్నవాఁడు ♦ వాఁడె జలంధరుం
డెట్టివాఁడు బ్రదుక ♦ నేది తెఱవు ?

కటకటా ! ఇంక నాకుఁ జావు నిశ్చయము—

మ. ఘనకోపోద్ధతి దానవేంద్రుఁడు కటా ♦ ఘృజ్యోత్స్న కెంపుంబరెల్
దనరన్, వక్త్రము చండభాస్కరుకిరియన్ ♦ దైవారఁ గ్రూరాసిఁజే
కొని, కల్పక్షయకాలుఁడోయన నన్ ♦ గూల్పంగ నేతెంచు వే
గనిదే, యేయదిదిక్కు ? యేరొకొనన్ ♦ గాపాడుపుణాత్మకుల్ ?

[ప్రవేశము—జలంధరుఁడు.]

తుల— ఆర్యపుత్రా ! నమస్కరించుచుంటిని.

జలం— (వినిపించుకొనకుండ నింద్రునిఁ జూచి ఖడ్గహస్తుఁడై)

శా. ఫాలాక్షానలనేత్రసంజనిత తీ ♦ వ్రజ్వాలికా సంభవున్
నీలో నెంచవురా జలంధరు నన్ ? ♦ నీచాత్మ ! యేమంచు నీ

బాలన్ భంగమొనర్పవచ్చితిదె నీ ♦ ప్రాణంబులన్ దూల్చెదన్
వ్యాళోదగ్రమహోగ్రమామకకృపా ♦ ణస్ఫారధారాహతిన్.
(పొడువఁ బోవును.)

(అనుబంధము. 8)

ఇంద్రు— (చేతులుజోడించి) దానవేశ్వరా! నన్ను క్షమింపుము—
(స్వ) ఆహా! నారదుని మాటలు వినమి నెంతగతి పట్టినది!
[ప్రవేశము—నారదుఁడు దూరముగ]

నార— (స్వ) ఓహోహో! మంచి రక్తిసమయమునకు వచ్చితిని.
(చాటున నిల్చును.)

జలం — ఓరీ! జంభవైరీ! క్షమింపమనుచుంటివా.

ఉ. ఇందునిభాస్య బల్మిగొన ♦ నెంచియుకా చనుదెంచినాఁడ వే
నిందును లేనటంచు నిపు ♦ డేవరుదేర క్షమింపవేఁడెదే?
యందునయోని జుట్టు మఱి ♦ యందరయున్నను గాళ్ళుపట్టుకొం
టెందును నేర్చికొంటివిర? ♦ హీన! మదాంధ! దురాత్మ! వాసవా!

జలం— (తులసివంకఁ జూచి) ఓసీ! నిన్ను వీఁ డంటినాఁడా?

తుల— ప్రాణనాథా! లేదు.

జలం—నిజముఁ జెప్పుము. వీఁడు స్పృశించిన స్పృశింపకున్నను నేను నిన్నుఁ బరిగ్రహించుట యేనాఁటికిని గల్లయని నీ వెఱుంగుదువు కాన సత్యము దాఁచినను నీకుఁ గలుగఁబోవు లాభ మిసుమంతయు లేదు.

తుల— ఆర్యపుత్రా! మీ పాదములసాక్షి—న న్నితఁ డంటలేదు.

ఇం—దానవసార్వభౌమా! నా మనవి నొకింత యాలింపుము. నేను మఱియొక యుద్దేశమున నిటకు వచ్చినవాఁడను.

చ. గదితతనమ్మునం గలువ ♦ కంటులలో ననసూయఁబోలు నీ
సరసిజనేత్రియంచు ముని ♦ చంద్రుఁడు నారదుఁడాడ నమ్మికి

ప్పరగాన సత్యముం దెలియ ♦ వాంఛను వచ్చితిఁగాని దానవేం
ద్ర! రమణి బల్మిఁబట్టుటకు ♦ రానిది నిక్కము విశ్వసింపుమా.

జలం— ఆ! ఏమిరా! నాభార్య పతివ్రతయగునో కాదో పరిశీలింప వచ్చితివా? ఏమిరా నీటక్కులు?

ఉ. ఓరి దురాత్మ! నాయువతి ♦ యుర్విఁ బతివ్రతయై యొసంగినన్
జారిణియై మెలంగిన వి ♦ చారణసేయఁగ నీ వెవండురా?
వారిజనేత్రి బల్మిఁగొన ♦ వచ్చి యిటుల్ వచియింతె? పండ్లకై
భూరుహమెక్కి పట్టువడి ♦ పుల్లలకంచను దొంగకైవడిన్.

గీ. ఖడ్గమూని చేతఁ ♦ గన్నముఁ ద్రవ్వుచుఁ
బట్టువడిన దొంగ ♦ వాఁడు, గోడ
యెంతగట్టిదో గ్ర ♦ హింపఁ ద్రవ్వితినన్న—
నేను విశ్వసింతు ♦ రోరి! తులువ!

అబద్ధమాడినంతమాత్రమున నీకు శిక్ష తప్పదు.

ఇం— దైత్యసార్వభౌమా! నే నబద్ధమాడుటలేదు—నిజమే వచించుచుంటి

ఉ. ఆడితిఁ బెక్కుభాషణము ♦ లాసలఁజూపితిఁ బాణియుగ్మమున్
మోడిచి వేఁడికొంటి, భయ ♦ మున్ గలిగించితి నెంతకేనియున్
జేడియ నిశ్చలత్వము ద్య ♦ జింపదు భూరిపతివ్రతాత్వమున్
వీడదు నీసతీమణికి ♦ వేరులతాంగులు సాటివత్తురే?

ఆ. అంటి నేదొమాట ♦ లంటి యెఱుఁగ దైత్య
చంద్ర! యిందులకును ♦ సాక్షి దైవ
మేస్పృశించియున్న ♦ నీవేల యీతల్లి
గరితతనమె నన్నుఁ ♦ గాల్పకున్నె?

జలం— ఓరీ! ఇంద్రా! నోరు మూసికొనుము. ఈకలువకంటినంట కున్నంతమాత్రమున నీవు నిరపరాధుఁడవుగావు. నీకు శిక్ష తప్పదు.

ఇం— మంచిది, శిక్షింపుము.

జలం— నీ యంగీకార మోదులఁకురా ? శిక్షించెదము— నీకువిధింపవల సినది మరణశిక్షయే—అయిన నూరక చంపుటగాదు.

సీ. ఇంతి నీక్షించి మో ♦ హించినందులకు నీ
గ్రుడ్లు బల్లెమ్మునఁ ♦ గ్రుమ్మి క్రుమ్మి
తెలివ చెంగటకు నే ♦ తెంచినందులకు నీ
పదములఁ బెనుగదఁ ♦ జదిపి చదిపి
కొమ్మఁ గవుఁగిలింపఁ ♦ గోరినందులకు నీ
చేతుల హేతినిఁ ♦ జించి చించి
అంగన దుర్భాష ♦ లాడినందులకు నీ
జిహ్వను నలుగునఁ ♦ జీల్చి చీల్చి
గీ. పరువిమాలి నభిలషించు ♦ పాపమునకుఁ
గండకండలుగాఁ గోసి ♦ కార మొడల
నలఁది హింసించి హింసించి ♦ యువల నీకు
మృత్యుకన్యకను ననుగ్రి ♦ హింతు నోరి.

మఱియు,

ఆ. ఏను లేనివేళ ♦ నీవు నాకామిని
భంగపెట్ట నిటకు ♦ వచ్చితోరి !
నిన్నుచూచి యేడ్వ ♦ నీకాంతకుం బరి
భవము సంఘటింతుఁ ♦ బంద ! కనర !

ఓరీ ! సేవకులారా !

[ప్రవేశము— సేవకులు]

జలం— వీని బంధించి జాలంధరమునకుఁ గొనిపొండు.

సేవ— (ఇంద్రుని బంధింతురు)

తుల— (స్వ) అయ్యో ! మహేంద్రునకిట్టి దురవస్థ సంభవించినది !

ఇంద్రు— (పరిక్రమించి) హా ! దైవమా ! ఎట్టిగతి పట్టినది !

శా. లోలత్వంబున లోలలోచనఁ గొనన్ ♦ లోనెంచి యేతెంచితిన్
బాలారత్నముఁ బొందఁజాలనయితిన్ ♦ పైపెచ్చు బామందితిన్
నీళుల్ గ్రోలనపేక్షచేసి దిగితిన్ ♦ నీరాన నోచన్ బయిన్
గూలంగాఁ బడితిన్ గటా ! విధిని ద ♦ త్కూపంబునన్ దైవమా!

ఉ. నారదుమాటలన్ విని మ ♦ నంబున నిక్కము సాధ్వియౌనొ ? కా
దో ? రమణీలలామయని ♦ తోరపు వేడ్కఁ బరీక్ష సేయఁగాఁ
జేరితి నిచ్చొటన్ మొదటఁ; ♦ జిక్కితిఁ బిమ్మట మారుబారికిన్
గోరి యొనర్చు దోస మొనఁ ♦ గూర్చక పోవునె యెట్టిశిక్షలన్.

చం. పరసతిఁ గౌఁగిలించుటకు ♦ భావమునం దలపోయుటస్ శచీ
వరుని కరాంబుజంబులకు ♦ బంధము గల్గెనటంచు నీపయిన్
నరు లసురుల్ సురల్ దెలిసి ♦ నారతముఁ బెఱచేడెఁ దల్లిగా
నరయుచు నిట్టిపై శసము ♦ నందకయుందురు గాత మెన్నఁడున్.

(సేవకులతో నిష్క్రమించును.)

జలం— మ. గురునాజ్ఞంబడి యింతకాల మురకే ♦ కూర్చుంటి నీనాటికిన్
దొరకెస్ సా, కిఁక శంకలేమిటికి మ ♦ ద్దోర్దండ కండూతివా
వ రణాస్త్రస్థలి నిల్చి పిల్చ మదవ ♦ త్ప్రత్యర్థిసైన్యాటవిన్
స్ఫురదస్త్రద్విశిఖోద్భవానలశిఖా ♦ స్తోమంబులం గాల్చెదన్

(పరవళ్ళుద్రొక్కుచు నిష్క్రమింపఁబోవ నారదుఁడెదురుగ
వచ్చిన నిలిచి) మునీంద్రా ! వందనము.

తుల— మహర్షిచంద్రా ! నమస్కారము.

నార— దానవేశ్వర ! విజయివి గమ్ము—అమ్మా ! సుమంగలీభవ !

జలం— మహాత్మా ! మీ రెప్పు డిక్కడకు వచ్చితిరి ?

నార— నీ వెనుకనే వచ్చితిని.

జలం— కాంచనగర్భసంభవా! నీమేలు మఱువఁ దగనిది. నీవలనఁగదా

మానభంగమందనున్న యీకాంతను గాపాడఁగలిగితిని. ఆదుర్మ దాంధుని బంధింపఁగలిగితిని—ఇందులకు నీకు నే నేమి ప్రత్యు పకారము చేయఁగలను—ఐనను,

గీ. ఆజి యాజి యని తపించు ♦ నట్టి నాకు
దేవ ! కలిగించి తది నీ ప్ర ♦ భావమునను
ఆజి యాజి యని తపించు ♦ నట్టినీకు
దేవ ! కలిగింతు నది మత్ప్ర ♦ భావమునను.

నార— జలంధరసార్వభౌమా ! కలహకౌతుకంబు పరమేశ్వరప్రభావ మున నెట్టును నాకు లభింపకపోదు. అందు నీవు చేయునదేమి? నాకుఁ బ్రత్యుపకారము సేయ నెంతువేని,

జలం— మహాత్మా ! అవశ్యము మీకోర్కె యేదో తెలుపుఁడు—తీర్తును—

నార— అయిన వినుము—పతిదేవతయగు నీకాంత నన్యాయముగఁ ద్యజించితివి—

జలం— మునిచంద్రా ! ఇదియేమి—దీనిఁ బరిగ్రహింపుమనియా నీవు కోరునది ? ఆహా ! చాలుఁజాలు—

ఆ. తగదటంచు మొదటఁ ♦ ద్యజియించి తిరిగి నే
నింతినిం బరిగ్ర ♦ హింతునయ్య !
పసికిరాదటంచుఁ ♦ బాఱవైచినకూడు
నెట్టిమూర్ఖుఁడే గ్ర ♦ హించునయ్య.

నార— మునీంద్రా ! దీనిఁగూర్చి పెక్కుపదులు వక్కాణించి నాయభి ప్రాయము నెఱింగియుంటివి—మరల నీ ప్రశంసయేల ? ఇంకేదియైనఁ గోరుము—

తుల— (స్వ) హా ! దురదృష్టమా !

నార— (స్వ) తులసి కాభాగ్యము లేదు—విధివ్రాఁత యిట్లున్న మా దృశు లేమిచేయఁగలరు ?

ఆ. వనజభవుఁడు వ్రాయు ♦ వ్రాలుదుడువ వాని
తండ్రి హరికినైనఁ ♦ దరముగాదు
వనజభవుఁడు వ్రాయు ♦ వ్రాలు దుడువ వాని
పుత్త్రికునకు నాకుఁ ♦ బోలునొక్కొ ?

కానిమ్ము— తులసీదేవి కింకొకమేలైనఁ గావింపవలయు. భర్తృపద సన్నిధానమున నుండినఁజాలునని గదా యీమె వాంఛ ! ఇట్లడిగి చూచెద.

జలం— మహానుభావా ! ఏమి యోజించుచుంటివి ?

నార— యోజింప కేమిచేయు మంటివి ?

జలం— ఏదో కోరెదవని యెదురుసూచుచుంటిని—

నార— అడిగినదిదక్క నన్నియు నిచ్చెదనను ని న్నేమి కోరినమాత్ర మేమిలాభము ?

జలం— మునీంద్రా ! అట్లుగాదు. ఈకాంత నేలుమనుటదక్క మఱి యొక వర మేదేని నభిలషింపుము.

నార— అయినఁ బోనిమ్ము—ఈ సుదతి నేల నక్కఱలేదు. నీసన్నిధి నుంట పదివేలని యీ కాంత యూసించుచున్నది. అందులకైన నంగీకరించి యీమెను నీయంతఃపురముఁ జేర్చుము.

జలం— నారదా ! దీనివిషయమువలదని నీకిప్పుడుగదా చెప్పితిని. పాము నోడిలోఁ బెట్టుకొన్నట్లు దీని నంతఃపురమునఁ బెట్టుకొననా !

నార— జలంధరా ! ఈసాధ్వి నీయంతిపురి నున్నంతమాత్రమున నీకుఁ గలుగఁబోవుమహాపదయేమియులేదు. ఈమెయిట్లొంటిగ నుండుటవలన నొకప్పు డింద్రునివంటి కాముకులవలన నీకాంతకు మానభంగము వాటిల్లవచ్చును. అది నీకీర్తికిని భంగకరము. కావున నాచెప్పినచొప్పునఁ జేయుము.

జలం— (స్వ) నిశ్చయమే—ఇది నా యంతఃపురమున నున్న నేమి ?

నేనేమో దివిజకోటులపై నేఁటజేపట దాడివెడలుట సత్యము గదా? ఒంటరిగ విడచిన నెట్టిచేటు వాటిల్లునో? ఇట్లు చేసిన నీకనికోర్కెయుఁ దీర్చినట్లుండును—(ప్ర) మునీంద్రా? ఇందులకు నే నంగీకరించితిని.

తుల__ధన్యురాలనైతిని—(స్వ) ఆహా! నారదుఁడెంతదయామయుఁడు!

జలం— ఓరీ! సేవకా!

[ప్రవేశము - సేవకుఁడు.]

జలం— రథము సిద్ధమొనర్చి తులసిని జాలంధరమునకుఁ గొనిపో మాయాజ్ఞయని సారధికిఁ దెలుపుము.

సేవ__ చిత్తము. (నిష్క్రమించును.)

జలం__తులసీ! నీవు ప్రయాణమునకు సిద్ధముగమ్ము. పొమ్ము—

తుల— చిత్తము.

(జలంధరునకు నారదునకు నమస్కరించి నిష్క్రమించును.)

నార__ జలంధరచక్రవర్తీ! నే నింకఁ బోయివచ్చెదను.

జలం— చిత్తము—

నార— (పరిక్రమించి) ఇఁకఁ గలహాశనమున కేమితక్కున! దేవా! దేవదేవా! ఇదియంతయు నీ ప్రభావము!

(గానమొనర్చుచు నిష్క్రమించును.)

జలం—

శా. పౌలోమీపతి బంధెఁబెట్టితి; నికన్ ♦ బాధించి సాధించెదన్
బాలస్వాదులఁ దక్క దిక్పతుల జ ♦ న్యక్షోణిరాడ్విద్ధతిన్
త్రైలోక్యంబును నేన యేలెద సురా ♦ రాతుల్ నుతింపన్ యశ
శ్శ్రీలః మెండుగ నిండఁజేసెద ధరి ♦ త్రీభద్రభస్మీమలన్.

(నిష్క్రమించును.)

ఇది తృతీయాంకము.

శ్రీ ర స్తు.

# తులసీదేవి.

## చతుర్థాంకము.

(:o:)

ప్రదేశము - జాలంధరము - పలాశునియిల్లు.

[ప్రవేశము - పలాశుఁడు.]

పలా— ఓసీ! చండీ! మేల్కొనియుండియే పలుకకుంటివేమి? ఇటురా.

[నేపథ్యమున]

నీవే యిటురా! నీకన్నఁ దక్కువదిన్నవా రెవ్వరు?

పలా— ఓసీ! నేను దిండిలేక నడువలేకుంటిని—నీవు దెగదిని లేవలేకుంటివా?

[నేపథ్యమున.]

ఓసీ! మాలతీ! నాసవతీ! పరిహాసముల కేమిలే—నీవే యిటురావే!

పలా— నేను మాలతినిగానే—నీ మగఁడనే.

చం— (ప్రవేశించి) ఓహో! మా పలాశుఁడా! అయ్యో! ఇట్లు చిక్కితివేమి?

పల— చెడదిని—

చం— ఏమి నన్నాక్షేపించుచుంటివా! నాకడుపుఁజూచి నీకనులు మండినవా? నన్నుఁ దినవలదన్న దెవ్వతె? "తిండిపోళకు దండినిద్ర" యన్నట్లు జలంధరుఁడు దండయాత్రకు వెడలుసమయమునకు

నింటలేక పదిహారకల బానిసతనమునకుఁ బరదేశములకుఁ బరు వెత్తికొనిపోయి, నేఁడువచ్చి కన్నీళ్లుగార్చిన నేమిలాభము ? నా మీఁదఁబడి యేడ్చిన నేమిలాభము ? కమ్మ, జితి మగఁడు కడుపునొప్పి నెఱుఁగడన్నట్లు పరదేశవాసినన్న రక్కసులు వచ్చువఱకుఁ గాని వారిని బిలువఁబోయిన మీరు వచ్చువఱ కుఁ గాని దాలిమిలేక మూన్నాళ్లలో ముప్పదిమూఁడుకోట్ల దేవతల జయించి తిరిగివచ్చిన జలంధరునిపైఁబడి యేడ్వుము.

పలా— ఓసీ ! నేను నీమీఁదఁబడి యేడ్చుటలేదు. ఆజలంధరునిపైఁబడి యేడ్వవలసిన యవసర మంతకన్న లేదు. కడచిపోయిన భోజ నపుఁ బట్టెనకై యేడ్చిన లాభమునులేదు.

చం— మఱియెందుల కీ యేడ్పు ?

పలా— ఏడ్పేమియును లేదు—ప్రియాణావ్రఁ బడలికవలన నీరసముగ నుంటిని—భుజించుట కేమైనఁ దెమ్ము—

చం— మనుష్యమాంసముఁ దెత్తునా ?

పలా— మనుష్యమాంస మెప్పుడు దినునదేగదా ? సురలమాంసము రుచిఁ జూడవలయునని పెక్కేండ్లనుండి మక్కువయున్నది.

చం— అయిన సురలమాంస మెక్కడిది ?

పలా— ఏమే ? దేవదానవయుద్ధమున లభించిన వేల్పుల మృతక ళేబర ములన్నియు నీవే భుజించితివా ? నాకొఱ కొకశవమైననుంచక పోయితివా ?

చం— కళేబరములేమి నీ మొగము ? అమరులకుఁ జావులేదుగదా ?

పలా— ఆ ! ఆ ! అదేమి ? ఆమాట నిశ్చయమే నా? లోకులందఱా మాయమునుండకొడుకులకు మృత్యువులేదని యనుకొనుచుండ గ్రుడ్డిలోకమని వారిమాటలు విశ్వసింపకుంటిని—మఱియొక మాట—వాండ్రికుఁ గాయమున నింతగాయమైనఁ గాదఁట. నిజమేనా ?

చం__ కాకేమి ? గాయమగును—కండతెగును—రక్తముగాఱును—గాని చిమ్మినచలమలవలె వారంతలో నెప్పటివలె నయ్యెదరు__అట్లగుట యమృత పానమువలననఁట—

పలా__ దేవరాజ్యము మనదైత్యుల వశమయ్యెఁగదా ? అమృతభాండముగూడ లభించెనా?

చం— అదియుఁ గల్పవృక్షములును, గామగవియుఁ, జింతామణియు మే మక్కడకుఁ బోవునప్పటికే మాయమైనవి. ఆ వేల్పుమ్రుచ్చుల నెంతబాధించినను జెప్పరైరి—ఇంద్రుఁడు బలిపురమున ముందే పట్టువడుటచే నింద్రాణి యీపనిఁ జేయించినదని యామెను శిక్షించుటకుఁ గాఁబోలు ! మహారాజు దానింగూడఁ జెఱఁగొని వచ్చినాఁడు.

[నేపథ్యమున]

జయా ! లోకత్రయీనాథ ! జయా ! దైతేయసార్వభౌమా! జయా ! దేవసైన్యవార్థిబడబానలా ! జయా !

పలా— ఓసీ ! జలంధరచక్రవర్తి కొలువున కేఁగుచున్నాఁడు. నియమితకార్యము నెరవేర్చితినని యీ మహారాజచంద్రునకు విన్నవింపవలయు. తిండి సిద్ధముచేయుము.

చం— లోనికిరా !

పలా— లేవలేకుంటిని.

చం— అయిన నెత్తికొనిపోయెదను. నీకుఁ గావలసిన భోజనపదార్థముల నిక్కడకు మోసికొని వచ్చుటకన్న నిన్ను మోసికొని యక్కడకుఁ బోవుట మిగుల సులభము.

(ఎత్తుకొని నిష్క్రమించును.)

## ద్వితీయరంగము.

### ప్రవేశము—జాలంధరము.

[ప్రవేశము:- జలంధరుడు, మంత్రి, పలాశుడు, మఱికొందఱుదైత్యులు.]

(అచ్చరలు నృత్యమొనర్తురు.)

జలం__ అచ్చరగలారా! మీయాటపాటల మాకత్యానందముగలిగించితిరి. కావున మీకు దక్కన వేల్పుపూఁబోండ్లకుంబలె సేవావృత్తినొసంగక స్వేచ్ఛ ననుగ్రహించితిమి మీరు ప్రత్యహమిటులే అరుదెంచి మీనృత్యగానముల మాకు వినోద మొదవించి తగిన పారితోషికము బడయుచుండుడు. ఇదిగో! నేఁడీరత్నహారము గొనిపొండు. (ఇచ్చును. అచ్చరలు నిష్క్రి.)

[ప్రవేశము - సేవకుఁడు]

సేవ— ప్రభుచంద్రమా! భార్గవులవారు దయచేయుచున్నారు.

జలం— అబ్బబ్బ! అప్పటినుండియుఁ దులసింగూర్చి చెప్పిన సోదియే చెప్పి నాప్రాణము విసిగించి విడువ నిష్పాడించుక వినోదింపనిటకు వచ్చితిని. తిరిగి వచ్చుచున్నాఁడేమి?

[ప్రవేశము - శుక్రాచార్యుఁడు.]

(అందఱు లేచుచున్నారు.)

జలం— గురువర్యా! వందనములు.

శుక్రా— కళ్యాణమస్తు?

జలం— ఈ పీఠ మలంకరింపుఁడు.

శుక్రా— మీరును గూర్చుండుఁడు.

(అట్లు చేయుదురు.)

శుక్రా— జలంధరా! తులసీదేవి__

జలం__ దేవా! తిరిగి నన్ను వేధింపవచ్చితిరా?

శుక్రా— దనుజసార్వభౌమా! నీ కీమార్గ్యము తగదు. ఆకాంత కేమి లోపమని నీవు పరిగ్రహింపవు? ఆమె యేమైన దోసమొనర్పఁ జూచితిమా?

జలం—(స్వగతము) నేఁజూచితిని. గ్రుడ్డిపందవు నీవెట్లు చూడఁగలవురా మూఢా? ఈ మూర్ఖుఁడు ప్రసవమాలికాపతన మెఱిఁగియు నన్నుఁ బృచ్ఛించుచున్నాఁడు. వీనితో వివాదమేల? ఇందనుకఁ జెప్పిన మాటలే చెప్పిపంపెద. (ప్రకాశముగా) దేవా! ఇంత కుమున్న మీరిట్లు ప్రశ్నింపఁ బ్రత్యుత్తరము నుడివియే యుం టిని, తిరిగి యడుగుచుంటిరి గాన దెలుపుచుంటిని.

మ. నిజమే దేవరయానతిచ్చినటు లా ♦ నీరేజపత్త్రాక్షి కం
బుజగర్భాండమునందు సాటియగు పూ ♦ బుంబోఁడియే లేదు నీ
రజబంధుప్రతిమాన తేజ! సువతీ ♦ రత్నంబసద్వర్తనం
బజుఁడేనిన్ భుజగేంద్రుఁడేని దగ రా ♦ వంతైన వర్ణింపఁగన్.

ఆ. లేదు లో టొకింత ♦ లేమకు రూపున,
లేదు వర్తనమున ♦ లేశమైన
ఐన నాలతాంగి ♦ ననుభవింపగఁ నాకుఁ
బ్రీతిలేదు దేవ! ♦ పలుకులేల?

చ. ప్రజలు హసించినన్ సరియె ♦ బంధుజనంబులు దూఱినన్ సరే
యజుఁడు సుమామనోహరుఁడు ♦ నంబుజనేత్రుఁడు డాసంగు సద్వ్ర
వ్రజములు వోయినన్ సరియె ♦ వారక మీరు శపించినన్ సరే
నిజము మహాత్మ! యెన్నటికి ♦ నీరజలోచన నొల్ల నమ్ముడా!

శుక్రా— జలంధరా! కానిమ్ము. ఇది విధివ్రాఁత.

జలం— (స్వ) అది యెఱింగియు నీమూర్ఖుఁ బట్టెందులకో?

శుక్ర— ఇంక మాయాశ్రమమునకుఁ బోయెదము. నీ వాసుదతి నేల కున్నను నీయుండనండి మఱియొక చోటికిఁ బంపవలదు. ఆ మెను

బ్రాణముగాఁ జూడవలయును. ఇందునను నేమైన లోపము గలిగించిన ననుభవింపఁగలవు.

జలం— దేవా! మీకు మఱియొక సంశయ మక్కఱలేదు. పలుట తప్ప నయింతి కోరిక యెట్టిదైన నవశ్యము దీర్తును. ఎట్టిలోపమును గలిగింపను. మీరు పోయిరండు.

శుక్రు— మంచిది. నీ వన్నమాట తప్పవలదు.

జలం— చిత్తము. (శుక్రుఁడు నిష్క్రమించును.)

జలం— (స్వ) ఈ పిశాచము తొందరగనే వదలినది. (ప్ర) ఓరీ సేవకా! కారాగారమునను న్న ఇంద్రుని, శచిని, జయంతుని దీసికొని రమ్ము.

సేవ— చిత్తము. (నిష్క్రమించును.)

జలం— నేఁడు వీరిని బాధించి అమృతకలశము గల్పవృక్షములు జింతామణియుఁ గామధేనువు నెందున్నవో తెలిసికొనవలయును. తెలిసికొనినపిమ్మట నింద్రాణి నింద్రుని మ్రోల భంగమొనర్తునను నాప్రతిజ్ఞ నెఱవేర్చుకొనవలయును.

[ప్రవేశము - ఇంద్రుఁడు, శచి, జయంతుఁడు బద్ధులై సేవకులతో.]

జలం— ఓరీ! ఇంద్రా! నీ భార్యాపుత్రుల, నమృతకలశాదుల నెందు దాఁచిరో యడిగి తెలిసికొంటివా?

ఇం— వా రెఱుఁగమనుచున్నారు.

జలం— ఓరీ! దొంగా! వా రెఱుఁగకున్న నవి యేమైనవిరా? ఓరీ! డింభకా! నీప్రాణములు దక్కవు— ఓసీ! పౌలోమీ! నీకుఁ బరిభవము సంభవింపఁగలదు. చెప్పుడు—

జయ— నే నెఱుఁగను.

శచి— నే నెఱుఁగను.

జలం___ ఏమి! యెఱుఁగరా? భటులారా! ఈ జయంతునిఁ జిత్రవధ గావింపుఁడు.

(భటులు వచ్చి జయంతుని బట్టుకొని క్రిందఁ బడనెట్టి చంపఁబోవుచున్నారు.)

జలం___ ఏమిరా ఇంద్రా! ఏమే శచీ! చెప్పెదరా? లేదా?

ఇం—— నే నెఱుఁగను.

శచి___ నే నెఱుఁగను.

జలం___ ఓరీ! కానిండు.

భటు—— (కత్తి నెత్తుచున్నాఁడు.)

ఇంద్రు, శచి—— (కన్నులుమూసికొని) హా! హా! భగవంతుఁడా!

జలం—— (భటులనాపి) ఏమి! ఇప్పటికైన మీ కుమారుని రక్షించుకొనఁడు మాటాడరేమి? ఓరీ! ఊ——

భటు—— (నఱుకును.)

జయం—— (కొట్టుకొనుచు) హా! తల్లీ! హా! తండ్రీ!

ఇంద్రు, శచి——హా! హా! నాయనా! నీయవస్థ జూడలేక ప్రాణముల విడలేమున్న మొండి యమర్త్యులమైతిమే? ఏమిచేయుదుము.

జలం—— ఓరీ ఇంద్రా! కనులుమూసికొనెద వేమిరా? ఇటుచూడు—— శచీ! నీ ముద్దులకుమారుఁడు రక్తపుముద్ద యయినాడు—— మీ రింకను జెప్పకున్న నింక నిటులే నఱకింతును——

(అనుబంధము. 9)

జయం—— హా! జననీ! జనకా!

శచి___ అయ్యో! తండ్రీ! నేనేమిచేయుదునురా? అమృతకలశాదుల బృహస్పతిముని చంద్రుఁడు దాఁచినట్లు వినియుంటినిగాని యవి యెందున్నవో యెఱుఁగనైతిని——నాయనా! నే నెఱిఁగియున్న నీయవస్థఁ జూచుచు నూరకుందునటరా?

ఇం—— (స్వ) అన్నన్నా! శచి దుఃఖావేశమున రహస్యము వెల్లడించి నది—— ఊ! కానీ! దివిజాచార్యుఁడు వీనికిఁ జిక్కునా ?

జలం—— ఏమి! దొంగముండకొడుకు బృహస్పతిపనియా యిది! మంత్రీ! చెఱసాలలోనున్న దేవమునులలో బృహస్పతి యున్నాఁడా ?

మంత్రి—— దేవా! ఆ దివ్యర్షి చిక్కలేదు.

జలం—— ఓరీ వాసవా! ఓరీ జయంతా! ఓసీ యింద్రాణీ! పోనిండు: ఆదొంగ జడదారి యెందున్నాఁడో చెప్పుడు.

శచి—— దానవేశ్వరా! అంతఃపురమునఁ బడియుండు నాడుదానను నే నేమెఱుఁగుదును ? ఆటలాడుకొను నీచిన్నిబుడుత కిట్టి సంగతు లెట్టు దెలియఁగలవు. ఇంక నా నాథుఁడన్ననో నీవు దివ్యపుర ముపై దాడివెడలునప్పటికే పట్టువడెఁగదా! ఆయనమాత్ర మేమెఱుఁగును ?

జలం—— ఎఱుఁగకపోవచ్చును——పోనీ——సేవకులారా! వీని నింక వద లుఁడు. (అట్లుచేయుదురు. జయంతుఁడు తల్లిని దండ్రిని గాఁగి లించుకొనును) మంత్రీ! ఆ మునిముచ్చును వెదకింపవలయును.

**మంత్రి**—— చిత్తము.

జలం—— సేవకులారా! నేఁ డింద్రాణిని బరిభవింతుము. ఎల్లరు చూడ రావలయునని యూరఁ జాటింపుఁడు. ఈ వేడుకఁ జూచుటకుఁ దులసి మొదలగు నంతఃపురస్త్రీల దోడ్కొనిరావలయునని దాసీలతోఁ జెప్పుఁడు.

సేవ—— చిత్తము. (నిష్క్రమింతురు.)

శచి—— దనుజసార్వభౌమా! ఇదియేల ? నన్నుఁ బరిభవించు టెందు లకు ? నే నేమిపాపము చేసితిని.

జలం—— ఇది నీభర్తచేసిన పాపము. నీ వతని యర్ధాంగివికదా! ఓరీ! ఇంద్రా!

ఆ. వె. ఏను లేనివేళ ♦ నీవు నాకాముని
బరిభవింప నిటకు ♦ వచ్చితోరి
నీవ చూచి యేడ్వ ♦ నీకాంతకుం బరి
భవము సంఘటింతుఁ ♦ బంద! కనర.

అని నేను నాఁడన్నమాటల మఱచితివా? ఆ నా ప్రతిజ్ఞ నేఁడు నెఱవేర్చుకొనెదను.

శచి___ దానవనాయకా! నా ప్రాణేశ్వరుఁడు చేసిన యపరాధమునకు నతని బంధించితివి. ఆయనరాజ్యము నపహరించితివి. ఆయన సతీసుతుల మమ్ము నిర్బంధమున నుంచితివి. ఇన్నిశిక్షలు చాలవా?

జలం___ ఇవియన్నియు వానికి శిక్షలుగావు. ఆనాఁడు వాఁడు నాకాంతను భంగమొనర్పఁ బ్రయత్నించినాఁడు గాన నేఁడు వాని యిల్లాలిని నేను భంగపెట్టెదను.

శచి___ దితిజాధీశ్వరా! నా వల్లభుఁడు నీ వల్లభనుబరిభవింపఁ బ్రయత్నించుటయేకాని పరిభవింపలేదుగదా! నీవు___

జలం— ఓకాంతా! వాఁడసమర్థుఁ డగుటవలన నాభార్యను భంగమొనర్పఁ జాలఁడయ్యె. ఇంక మేమో? సమర్థులము. మేము చెప్పకొనుటెందులకు? మా సామర్థ్యముఁ జూడఁగలవు!

శచి___ ఆహా! సమర్థత యున్నందులకుఁ జేయవలసిన దిట్టికార్యములా?

సీ. అధికార మున్నదం ♦ చనదల మద మొప్ప
బాధించు క్రూరుండు ♦ ప్రభుఁడటయ్య?
కరవాలు గలదంచుఁ ♦ గసుగందులంబట్టి
వెఱక నఱుకువాఁడు ♦ వీరుఁడయ్య?
విద్య గలదటంచు ♦ వీఁక దుర్వాదముల్
విరచించు కలుషుండు ♦ విబుధుఁడయ్య?

బుద్ధి గలదటంచుఁ ♦ బోఁడిమి మూఢులఁ
గష్టపెట్టు ఖలుండు ♦ ఘనుఁడఁటయ్య ?
గీ. కలము గలదంచుఁ జూచిన ♦ గ్రంథమెల్లఁ
గడఁక గీఁకెడు మూర్ఖుండు ♦ కవియఁటయ్య ?
స_క్తి గలదంచు వీఁకున ♦ సాధ్విఁ బరుని
మగువఁ జెఱచు నీచుండు స ♦ మర్థుఁడయ్య ?.

జలం___ ఓసీ ! నోరుమూసికొనుము. నీవు మాకు ధర్మములు చెప్ప నక్కఱలేదు. నీవు చెప్పినను వినువా రిక్కడ నెవ్వరును లేరు.

[ప్రవేశము - పెక్కుమంది దైత్యులు, దైత్యాంగనలు
ఒకప్రక్కఁ దులసీదేవి - చెలికత్తెలతో]

జలం___ సేవకులారా ! ఇటురండు—ఈ యిందాణి చీరె రవిక లాగి వేయుఁడు.

శచి___ జలంధరసార్వభౌమా ! నీ కిది నీతిగాదు. నీకు వినాశనము సంభవింపఁగలదు.

జలం___ చూచెదఁగాక ! ఓర్ !—చూచెద రేమిరా ?

సేవ— (శచినిఁ బట్టుకొనఁబోవుదురు.)

శచి___ హా ! హా ! పరమేశ్వరా ! (అటునిటు పరుగెత్తును.)

(దైత్యు లడ్డువత్తురు.)

తుల— ఆర్యపుత్త్రా ! నమస్కారము. నాథా ! ఇదియేమి ? ఈ పతివ్రతామణిని భంగపెట్ట నుద్యమించుచుంటిరా ? ఇంతకన్న నధర్మముగలదా ? అయ్యో ! ఈసాధ్వి శపించిన మనకుఁ గీడుగలుగదా ? నావేఁడికోలు మన్నించి యీమెను విడువుఁడు.

జలం— ఏమే ? ఈ మాత్రము చనువిచ్చినందులకు మాకు ధర్మోపదేశములు సేయుటకుఁ గడంగితివా ?

గీ. ముగ్గులాడినచోఁ గుక్క ♦ మూఁతినాకుఁ
పిల్లి చంక నెత్తికొనినఁ ♦ బీఁకి పెట్టుఁ
గాళ్ళ చెంతకుఁ బోయిన ♦ ఖరము తన్ను
నెంతఁ జేరంగనిచ్చిన ♦ నెత్తికెక్కు.

అను పెద్దలపలుకులు రిత్త వోవునా ? అడ్డము లెమ్ము.

తుల—— ప్రాణేశ్వరా ! నన్ను మన్నింపుడు. నేను మిమ్ము నిర్బంధించుటలేదు. వేఁడికొనుచుంటిని. నా యీకోర్కెయైనఁ దీర్పుఁడు.

జలం—— ఛీ ! పొమ్ము.

మంత్రి—— (అపవారించి) మహాప్రభూ ! ఏలుటదప్పఁ దులసీదేవి యెట్టి కోరికఁ గోరినఁ దీర్తుమని గురువులవారితోఁ నింతకుమున్నే చెప్పియుంటిరి.

జలం—— ఓహో ! ఐన నది యొకయడ్డే! ఇసీ! దీని నే నిక్కడకెందులకు రప్పించితిని ? ఓసీ! నీప్రార్థన మన్నించి దీని విడుచుచుంటిమి ? ఇంకముందు నీ విట్టికోర్కెలఁ గోరవలదు !

తుల—— ప్రాణేశ్వరా ! అనుగ్రహింపఁబడితిని.

జలం—— (శచితో) ఓసీ! తులసివలన నీపాటుదప్పినది. ఓరీ ! యింద్రా ! నీ వేకాంతను బరిభవింపనెంచి విఫలమనోరథుఁడవైతివో యా కాంతవలన నీభార్యకుఁ బరిభవము దప్పిపోయినది. చూచితివా ? సిగ్గుదెచ్చుకొనుము. సేవకులారా ! వీరిం గొనిపోయి యెప్పటివలెఁ గారాగారమున నుంచుఁడు. అమృతకలశాదులు లభించుదనక వీరిని వదలరాదు.

శచి—— తల్లీ ! సాధ్వీమతల్లీ ! నీవలనఁగదా రక్షింపఁబడితిని. నీ మేలు మఱువను. (నమస్కరించును.)

తుల—— అమ్మా ! నాకు నమస్కారమేల ?

ఇంద్రు—— అమ్మా ! సాధ్వీ ! నీకతమ్మున నా ప్రాణములేగాక ప్రాణ

ములకన్న నెక్కువగు నాయర్ధాంగి రక్షింపఁబడినది. నీకు నే నేమిప్రత్యుపకారము చేయఁగలను?

తుల___ అన్నా ! ఇందు నా యుపకారమేమి ? దయామయుఁ డగు నా నాధుని ప్రస్తుతింపుముగాని నన్ను నుతింపకుము.

(ఇంద్రాదుల సేవకులు గొనిపోవుదురు.)

(మఱికొందఱు దైత్యులు పలాశుఁడు జలంధరుఁడు మంత్రియుఁ దక్కఁ దక్కినవారు నిష్క్రమింతురు.)

జలం___ గీ. కులము రూపమ్ముఁ బ్రాయమ్ము ♦ గుణము గలుగు
నలినలోచన నొల్లమ ♦ నను నతమ్ము
పండుఁ డనుకొందురేమొకో ♦ జనులు ? లోకు
లనినఁ గాకు లనెడుమాట ♦ వినుటలేదె ?.

శా. అంగీకారమొనర్ప నమ్మగువతో ♦ నస్మన్మనఃకంజమే
భంగిన్ లొంగద___వేఱుకామినిని జే ♦ పట్టంగ యత్నింతునే
నిం గోపించు గురుబ్రవుండు దులసిన్ ♦ బ్రేమించువాఁడౌఁట—నా
జ్ఞంగైకొందున మొక్క—యావెడఁగుప ♦ జ్జన్ దైన్యమింతేటికిన్

అయిన నీదుష్కీర్తి పంకమునఁ గూలకుండ నుపాయమెద్ది? (యోజించి) సెబాస్ ! ఇది తగినమార్గము !

ఆ. వె. ఏఁ దలంచునెడల ♦ నింతులకేమి ? య
చ్చరలులేరె ? మాని ♦ నతులులేరె ?
పరులయాండ్రటంచు ♦ భయమేల ? బానిసెల్
గారె లోకులెల్ల ♦ వారుదొరుకు.

దినదినమూత్నసుదతీప్రియుండనై తేజరిల్లెదగాక. (ప్ర) మంత్రీ ! నేఁటికి గొలువు చాలింతము.

మంత్రి— చిత్తము. (నిష్క్రమింతురు.)

ఇది చతుర్థాంకము.

శ్రీరస్తు.

# తులసీదేవి.

——(:o:)——

## పంచమాంకము.

ప్రదేశము__ఉద్యానవనము.

[ప్రవేశము——నారదుఁడు గానమొనర్చుచు,]

నార—— జలంధరుని దుష్కృత్యములు నానాఁటి కధికములగుచున్నవి.

మ. సతులన్ బల్మినిబట్టుచున్ శిశువులన్ ♦ జక్కాడుచున్ విప్రులన్
వెతలన్ముంచుచునొంచుచున్ బశువులన్ ♦ భృత్యాళిమాయించుచున్
హితులన్ బాములఁద్రోయుచున్ మునితతిన్ ♦ వేధించుచున్ గుంభినీ
పతివర్తించెడుఁ బూర్వదానవుల త్రో ♦ వల్ జ్ఞప్తికిం దెచ్చుచున్.

చెట్టుచెడుకాలమునకుఁ గుక్కమూతిపిందెలుపుట్టె నన్నట్లు వీనిదుష్కాలమునకే యిట్టి దుర్గుణములు వొడముచున్నవి. ఇంక నుపేక్షింపరాదు

గీ. ఏఁ బ్రయత్నమ్మొనర్చితి ♦ నింతవఱకు
వీనిబాగునుగోరి, యీ ♦ పైని దనుజు
పాటునకుఁ బ్రయత్నింతు శ్రీ ♦ వరుఁడు నాకు
సాయపడుఁగాక తొల్లిఁటి ♦ చందమునను.

ఇందుల కుపాయ మిదివఱకే యోజించితిఁగదా? జలంధరుఁ డిప్పు డిక్కడకు వచ్చునని వినియుంటినిగదా! వచ్చువఱకిందుఁ గూర్చుండెద. (ప్రక్కకుఁజూచి) ఓహో! వాఁడుగో! జలంధరుఁడు___ఏమి వీని దుష్కార్యము!

ఆ. వె. హరులచేత మత్త ♦ కరులచేత వృషభ
తతులచేత వ్యాఘ్ర ♦ వితతిచేత
శకటు మీడిపించు ♦ జాణలున్నా రింత
కితఁడు మునులచేత ♦ నీడ్వఁజేయు.

గీ. జడలఁ బగ్గాలుగాఁబట్టి ♦ మెడలపైని
కాణివైచి "చాచో" యని ♦ కటికిబెత్త
మున నదల్చుచు శకటమ్ము ♦ మునులచేత
నీడిపించుచు వచ్చుచు ♦ న్నాఁడు వీఁడు.

[ప్రవేశము:— పైనిచెప్పినట్లు బండినెక్కి జలంధరుఁడు,
వెనుకనిల్చి పలాశుఁడు]

పలా— మహాప్రభూ! మునులు తొమ్మిదిమందియే యగుటవలన నటు నలుగురు నిటులయిదుగు రుండవలసివచ్చినది వాఁడుగో! మఱియొకజటి. ఆజ్ఞయైన వానిం గొనివచ్చి లోటులేకుండఁ జేసెదను.

జలం— ఛీ! మూర్ఖుఁడా! ఆఁతడు మనకుఁబూజ్యుడగు నారదమహర్షి
(పలాశునితో శకటము దిగి నమస్కరించును.)

నార— కళ్యాణమస్తు.

[ప్రవేశము— బంధింపఁబడిన కొంతమంది స్త్రీలతోఁ గొందఱు
భటులు.]

నార— జలంధరా! ఈ కాంతలెవరు? వీరి కీబంధనములేమి? ఈయాక్రందనము లేమి?

జలం— అది వారియపరాధమే. ఇందుఁ గొందఱు దివ్యాంగనలు— కొందఱు వేల్పుఁదొత్తులు—కొందఱు మానవకాంతలు.

నార— వీరి యపరాధమేమి?

జలం— సిరిరా మోఁకాలొడ్డుట!

నార— అనఁగ ?

జలం— నాతోడిపొత్తున కంగీకరింపకపోవుట. ఇది యెంతవెఱ్ఱితనమో యోజింపుఁడు.

నార— ఇది వారివెఱ్ఱితనము గాదు__నీపిచ్చి—నీ మౌఢ్యము.

జలం— ఏమి ?

నార— వినుము.

గీ. ముజ్జగములఁ బాలించు ప్రభుండ వీవు
నీకుఁ దగుదురె వీరలు ♦ నిర్జరారి !
ఎల్లమృగములఁ గడిమిమై ♦ నేలఁజాలు
సింహ మూఁదునక్కలను వాం ♦ ఛింపఁ దగునె ?.

జలం— ఇంతకు మీయుద్దేశ మేమి ? నాకు వీరుతగరు సరి. తులసి తగుననియా ?

నార__ అవును.

జలం— మీ రాసంగతిఁ జెప్పనక్కఱలేదు. నేను విననక్కఱలేదు.

నార— పోనీ. నీకుఁదగినది మఱియొకమగువ యున్నది.

జలం— అది యెవతె ?

నార— (స్వ) ఇదే వీని వలలోఁ బడవేసికొనవలసిన సమయము. వీనికి దివ్యదృష్టినిచ్చి పార్వతిం జూపింతును. (ప్ర) జలంధరా ! (ఒకప్రక్కకుఁ జూపి) అటు చూడుము.

జలం— (చూచి) ఆ ! ఆ ! ఎవతె యీ జగన్మోహిని ! (స్వగతము)

ఆ. వె. తులసి కీడువచ్చు ♦ చెలువున నదియును
గాక యేమియొక్కొ ♦ కారణంబు
నా మనమ్ములాగు ♦ నలినాక్షి, వాయువు
గాలిపడఁగలాగు ♦ కరణి గాఁగ.

ఓకామినీమణీ ! నిలువుము. (పోఁబోవును.)

నార___ జలంధరా! ఆకాంత యుండెగదా! ఇంత పీ రెందులకు?

జలం—— (సేవకులతో) విడిచిపెట్టుఁడు. ఓకాంతామణీ! నిలువుము.

(నిష్క్రమించును.)

(సేవకు లట్లుగావించి మునులతో శకటములో నిష్క్రమింతురు.

స్త్రీలు నారదునకు నమస్కరించి నిష్క్రమింతురు.)

నార—— జలంధరుని గైలాసమునకుఁ నాపార్వతిరూప మిటులే లాగి. కొనిపోవుఁగాక. అటఁ డక్కడ నిక్కపుఁ బార్వతిం బట్టఁబోయి శివునిచే దండింపఁబడుఁగాక.

గీ. ఎన్నియత్నముల్ సలిపి ♦ నితని కేను
మేలుఁగూర్పఁ, జెడుగుఁగూర్పఁ ♦ జాలె నొకఁడు
ఇల్లుగట్టంగ వాసము ♦ లెన్నివలయుఁ
గాల్చుటకు నిప్పుపుల్ల యొ ♦ క్కటియె చాలు.

గీ. ఇలనొకని బాగుసేయంగ ♦ నెంతయోని
పాటుబడవలయును భంగ ♦ పఱుచుటకు ర
వంత యత్నించినంజాలుఁ ♦ బటువుపాప్రియు
నెంతొ శ్రమగాని, చింప నొ ♦ క్కంత తగును.

[నేపథ్యమున]

ఆ! ఆ! యేమి? నాప్రాణేశ్వరుఁడు వెఱ్ఱివాఁడయ్యెనా! అయ్యో! అయ్యో! ఇదియేమి? అట్లుపరుగెత్తుచున్నాఁడేమి?

నార—— (స్వగతము) ఓహో! ఈ వార్తవిని తులసి పరుగెత్తుకొని వచ్చుచున్నది.

[ప్రవేశము—తులసీదేవి, పలాశుఁడు.]

పలా—అమ్మా! ఇంతకుఁగారణ మీ మాయజడదారి ముండకొడుకు ఏమో యటు చూడు మనినాఁడు. అటుచూచినతోడనే మహారాజుగారు పిచ్చివాఁడై "ఓకాంతా! నిలువు" మని పరుగిడి పోయినాఁడు.

తుల—(నారదుని పాదములఁబడి) మహాత్మా! బ్రహ్మర్షిచంద్రా! ఇదియేమి? నా నాథుఁ డట్లెందులకుఁ బరుగిడుచున్నాఁడు? ఎక్కడకుఁ బోవుచున్నాఁడు? ఆకాంత యెవతె? నా నాథుని కేమైన హాని సంభవించునా?

నార—(లేవనెత్తి) అమ్మా! భయపడకుము. ఆమె పార్వతి. ఆ జగజ్జననిం గామించి నీనాథుఁడు వెంటాడుచున్నాఁడు. హానిసంభవించిన సంభవింపవచ్చును. నే నేమిచేయుదును?

తుల—తండ్రీ! బ్రహ్మమానసపుత్త్రుఁడవు. నీకు జేయరాని దేది—నాకుఁ బతిభిక్ష పెట్టుము. (తిరిగి చరణములఁబడును.)

నార—(స్వ) అయ్యో! ఇదియేమిబాధ నాకు? తొలుతనే విఘ్నమా నాప్రయత్నమునకు—అందును నావలననేనా? ఎట్లును నీపతివ్రతామతల్లి నన్నువిడుచునట్లులేదు. కానిమ్ము—పిమ్మట యోజింతును. (ప్ర) అమ్మా! తులసీదేవి! నీపాతివ్రత్య ప్రభావముండ నీకుఁ బతిభిక్ష పెట్టుటకు నే నెవండను? అయిన నిప్పట్టున నీకుఁ గర్తవ్యముఁ జెప్పెద వినుము. నీ ప్రాణేశ్వరుఁడిప్పుడు శైలకన్యవెంటఁబడి కైలాసమునకుఁ యి శివునితోఁ గలహించునుఁ నీ వంతకుమున్నె యటకేఁగి యాపార్వతీపరమేశ్వరుల వరము వేఁడికొనుము.

తుల—తండ్రీ! అబలనగు నే నక్కడ కెట్లుపోగలను?

నార—కుమారీ! నీపాతివ్రత్యమహిమ నీ వెఱుఁగవు. అదియెంతకైనఁ జాలును. కన్నులు మూసికొని పరమేశ్వరునిఁ బ్రార్థింపుము.

తుల—(కనులుమూసికొని ధ్యానించుచు మాయ మగును.)

(నారదుఁడు గానమొనర్చుచు నిష్క్రమించుచున్నాఁడు.)

## ద్వితీయరంగము.

### ప్రవేశము—కైలాసము.

[ప్రవేశము—పార్వతీపరమేశ్వరులు, పరమేశ్వరుని పాదములఁబడి తులసీదేవి.]

తుల—

గీ. జయ గిరీశ! మహేశ! భు ♦ జంగభూష!
నిర్జరేంద్రప్రముఖ దివ్య ♦ నిచయవంద్య!
అచలకన్యామనోధవ! ♦ యభవ! యజర!
జయ నమస్తే! నమస్తే! ప్ర ♦ సన్నరూప!

పర— (లేవనెత్తి) కుమారీ! లెమ్ము! నీ వేమికోరియిటకువచ్చితివమ్మ ప్రార్థించుచుంటివి? నీ యభిమతమేమో కోరు మవశ్యమిత్తును.

తుల— తండ్రీ! నా మాంగల్యమును గాపాడుము. నా కిదియే కావలసినది.

పర— (ఆలోచించుట నభినయించి) అమ్మా! నీ పాతివ్రత్యమే నీకు సర్వశుభములు గూర్పఁగలదు. నీ వింకఁ జింతఁదక్కి పురి కేఁగుము.

తుల— ధన్యోస్మి. (పార్వతీపరమేశ్వరులకు నమస్కరించి పరిక్రమించి) జగజ్జనని యిందేయున్నదే! నా నాథుఁడు వెనుకఁ జిక్కినాఁడు గాఁబోలు. కాక యిది తగదని పొరబాటు గ్రహించి తిరిగి పోయెనో! ఆహా! అంతభాగ్యమా! (తెరవంకకుఁ జూచి) అయ్యో! ఆర్యపుత్త్రుఁ డందందు వెదకుచు నిటేవచ్చుచున్నాఁడు. నన్నుఁజూచిన గోపించునేమో! చాటున నిలిచి చూచెద.

(అట్లుచేయుచున్నది.)

[ప్రవేశము—జలంధరుఁడు.]

ఏది నాముద్దుగుమ్మ! నాబంగారుబొమ్మ! ఎటుపోయినది?

ఇంతలో నేటుమాయమైనది? అన్నన్నా! ఇంతదూరము దిప్పి తుదకు నానోటబెడ్డగొట్టి మాయమైనదే! ఈ కైలాసమునకువచ్చియే మాయమైనది. దాని విడువను. ఇంకను వెదకెదను. దొరకెనా? మంచిది. లేదా? ప్రమథుల బాధింతును. భూతముల వేధింతును. పిశాచములఁ బిలుకుమార్తును. కైలాసమంతయు సముద్రమునఁ దోఁతును తుదకు శివుని భార్యాపుత్త్రులతోఁ జెఱగొని యమృతకలశాదులకై పురందరుని బలెఁ బలుబాములఁ బెట్టెదను.

[పార్వతీపరమేశ్వరులఁ జూచి]

ఇదియేమి! ఇయ్యిందువదన ఇయ్యిందుశేఖరునిపజ్జఁ గూర్చుండియున్నదేమి! ఓహో! తెలిసె ఈ కామిని కామాంతకుని యిల్లాలుగాఁబోలు!—కావుననే యింతలావణ్యవతి యీపొలఁతి. ఆహా! ఈకాంత నాకెట్లు లభింపఁగలదు? ఇసీ! ఏటి సంశయ మిది?

ఆ. వె. ఆ సహస్రనేత్రు ♦ నాజిసేయక్షయ ని
ర్జించినట్టి వీర ♦ సింహమునకు
నీ త్రినేత్రుఁ డెంత? ♦ యీ కున్న హారుని ప్రా
ణములతోడఁ గొందు ♦ నలిననేత్ర.

అయినను శివుఁడు పట్టిచేల—భక్తసులభుఁడు—భక్తులు చేఁజాఁచిన "ఊ" యనుటయేగాని "ఉహూ" అనుట యెఱుంగనివాఁడు ఇతనితో యుద్ధమొనర్చి కాలయాపనమేల కావింపవలయు? మొదట నాయభీప్సిత మెఱింగింపక వరమువేఁడి పిమ్మట నెఱింగించెదగాక! ఒసంగనిచో మదవదరి ప్రాణవాతూలవ్యాళము మత్కరవాలమే యున్నది.

(పరిక్రమించి) దేవా! నమస్కారము!

పర.— మేలగుగాక!

జలం—(చేతులుజోడించి)

గీ. కరుణ నాలింపఁగదవయ్య ♦ కాలకంఠ !
దయ గనుంగొనఁగదవయ్య ♦ దక్షవైరి !
జాలి బఱపంగఁగదవయ్య ♦ ఫాలనేత్ర !
కృపనభీష్ట మీఁగదవయ్య ♦ కృత్తివాస !

పర—జలంధరా! త్రిలోకాధినాథుండవై యుంటివి. ఇంకను నీకుఁ గావలసిన దేమి ? అయిన నీమనోభీష్టము వేఁడికొనుము.

జలం— (స్వ)

ఉ. పంకజనేత్ర నిమ్మనిన ♦ భావజవైరి యనుగ్రహించునో
కింకనహించునో? యెడఁదఁ ♦ గీటడఁగింపఁ దలంచునో నను
శంకరుఁ డంతక్రూరుఁడా? ని ♦ శాకర శేఖరుఁడంత దుష్టుఁడే ?
సంకటపెట్ట భక్తుని నా ♦ సంగనేరక యొక్క కామినిన్.

పర—జలంధరా ! వరమర్థింప యోజించుచుంటివేమి ?

జలం—(స్వ) కానీ ! కోపించినమాత్ర మేమి ? ఈ జంగమయ్య నన్నేమి చేయఁగలఁడు ? (ప్ర) కామాంతకా ! ఈకామినిని నాకొసంగుము.

పార్వ—(స్వ) ఓరి ద్రోహి !

పర—(స్వ) ఔరా ! వీఁ డెంతద్రోహము దలపెట్టెను ! కానీ ! మోసమునకు మోసమే తగినది. (ప్ర) ఓరీ ! జలంధరా ! పార్వతిని నీ కొసంగుచుంటిని కాని—

జలం—ధన్యోస్మి !—కాని కానియేమి ?

పార్వ—(స్వ) ఇమ్మహాత్ముఁ డేమనునో ?

పర—

గీ. అంబుజాక్షిని దాసిగా ♦ నవధరింపు
మిచ్చవచ్చిన పనులు సే ♦ యించుకొమ్ము

గాని యాచాన నంటెతి ♦ వేని నీవు
పాడవడంగ దగ్గిని నంటి ♦ పురువుఁ బోలె.

జలం__ఆ! ఆ! దేవ దేః! మహానుభావ! ఎక్కడనేర్చుకొంటి వీనీతి—
ఎవరు చెప్పిరి ?

ఆ. వె. దయితనొసఁగి పుట్ట ♦ దగదంటి వీఁక నట్టి
తరుణి యేటి కింటఁ ♦ దాఁచుకొననె ?
పండునొసఁగి దాని ♦ భక్షింపవలదంట
యెందు నేర్చుకొంటి ♦ విందుమౌళి !

పర—ఓరీ! దుష్టా! ఈకాంత ననుభవించుటకా నీవుద్దేశించితివి? ఔరా!
ఎంత కండకావరము !

ఉ. పాఁకులు మోడ్చి యాదినము♦"వాంఛయొసంగవె"యంచు వేఁడి పై
రాణి నొసంగమందువఁట ♦ రా! యఘమెంచక, దాహమక్కటా
ప్రాణము నిల్వఁబోదనుచుఁ ♦ బాదములంబడి కోరి మీఁద, నీ
శోణితమిమ్మటన్న క్రియ ♦ శంఠ ! దురాత్మక! దానవాధమా!

జలం__నే నెట్లు వేఁడిననేమి? నీవు నిచ్చితినంటివిగదా ! ఇంక నీగోల
యెందులకు ?

పర—మంచిది. నేఁ జెప్పినట్లు జేయుము.

జలం—ఎట్లు? అంటకుండఁగాఁబోలు__చాలు.

శా. దేవా! యేటికి వేఁడికొంటి నిను నీ ♦ దేవేరి నిమ్మంచు నా
దేవింగాఁగొని నిత్య మిష్టరతులన్ ♦ దేలంగ యోజించికా
దే? వాంఛించితినయ్య యూరకయె నె♦త్తిందాల్చి యూరేఁగ; వా
గ్వాదంబిదియేల ? యిచ్చెదవ దే ♦ ఏన్ లేద? వాకువ్వమా?

గీ. పరిమళముఁ బీల్వఁదగనట్టి ♦ పూసవమేల ?
యారగింపఁగఁ దగనట్టి ♦ యశనమేల ?

తాఁపుటకుఁ దగనట్టి శ్రీ ♦ రమ్మదేల ?
అనుభవింపఁగఁ దగనట్టి ♦ యతివయేల ?

పత—ఓరీ ! దురాత్మా! త్రిజగజ్జననిగదా యీకాంత! ఏమని కామన చేసితివిరా ?

జలం—త్రిజగజ్జననియా? అయిన నీపెండ్లము వరించితివో ముందు వచింపుము. ఓహో ! మఱచితిని. నీవు త్రిజగజ్జనకుండవు గాఁబోలు. అతులితైనమాత్రము నేనును ముల్లోకములకుం బ్రభుఁడగానఁ బ్రిజగజ్జనకుండనే— ఇంకనేమి ? సరిపోయినది గాదా? ఓయిత్ర్యంబకా! ఈ నీకుయుక్తులు నాదండ సాఁగిరావు. సత్యము నిలుపుకొనునదియు లేనిదియు వచింపుము. సత్యము సర్వజగదాధారమనుమాట మఱవకుము.

పార్వ—(స్వ) ఆర్యపుత్రుఁ డసత్యభీతిచే నీదైత్యుని శిక్షింపఁజాల కున్నాఁడు. నే నిట్లని చూచెద—(ప్ర) దానవేంద్రా!

గీ. అలికనయనుని ఫాలనే ♦ త్రాగ్నివలనఁ
బొడముటంజేసి యాతని పు ♦ త్రుఁడవుకావె ?
అట్టి తండ్రికి నిల్లాలి ♦ నైన నన్నుఁ
దల్లిఁ గామనచేయుట ♦ ధర్మమయ్య ?

జలం—ఓజాణా! అలికనయనుని ఫాలనేత్రాగ్నివలన జన్మించితినే గాని యాతనికి నీకును బుట్టినవాఁడను మాత్రముగానుగాదా ? అదిగాక పశువులలో నసురులలో నీనీతి లేదు. నీవు నీతిబోధింప వలసిన దిప్పుడీదైతేయసార్వభౌమునకుఁ గాదు—ఆప్రమథ సార్వభౌమునకు. అతఁ డసత్యమాడుటకు సిద్ధముగానున్నాఁడు. తగదని ధర్మోపదేశము గావింపుము. తలవాంచి మిన్నకుంటి వేమి? నీ ప్రాణనాథుఁ డాత్మదత్తాపహరణ విద్యానిపుణుఁడై వెలుఁగ నున్నాఁడని నీకుఁ దలవంపులయ్యెనా? నిజము—పురు

షులకన్న నిక్కాలమున కాంతలే ధర్మమునకు వెలిచువారు. సరి—అయిన నింక నానితో నీకుఁగాని నాకుఁగాని మఱల్మెనంతయుఁ బనిలేదు. ఆతఁడు నాకు నిన్ను దానమిచ్చినవాఁడు. నీ వీదానవుదానవు. పోవుదము రమ్ము—(చీర చెఱఁగునంటఁబోయి పార్వతి దూరమున కరుగ) ఏమి? పార్వతీ! భర్త మాట నిలుపవలసిన భారము భార్యదిగాదా? అట్లుపోయెద వేమి? నిలువుము—నిలిచి మాటాడుము.

పార్వ—ఇట్టి నీచునితో మాటాడవలసిన యావశ్యకము నాకేమి?

జలం—ఇదివఱకు లేకున్న నింకపైనుండును గాదా?

పార్వ—ఏల?

జలం—భర్తతో భార్యకావశ్యకము లేకపోవునా?

పార్వ—ఛీ! దురాత్మా! మాతృద్రోహాసక్తా! జాగ్రత్త! శపించిన భస్మమయ్యెదవు.

జలం—ఆహా! శపించెదవా? మన్మథుని భస్మమొనర్చిన మహారసికాగ్రేసరునియిల్లాలవు. నీ వీనవమన్మథుని భస్మమొనర్చెదవు గాఁబోలు! భస్మము నేమిచేసెదవు? నీప్రాణనాధుని విధమున మేన నలందుకొందువా? అటులైనఁ గొంతవఱకుఁ గృతార్థుఁడనే యయ్యెదనుగాదా!? పార్వతీ! కోపమెందులకు? చూడు నేను నామోహము దీర్చుకొనుటకు మాత్రమే నిన్ను వరింపఁదలంపుఁగొనలేదు. నీ మేలుఁగూడఁ గోరితిని. ప్రసవకోమలవగు నీ వీకొండపీటిజంగమయ్యతో నిడుమలువడుచుండఁ జూడలేకుంటిని. ఎలజవ్వనమున నొప్పు నీ వీకామాంతకుని దండనున్న నొకింతయు ఫలములేదని యోజించితిని. నీకుమాత్రమీప్రారబ్ధమెందులకు? ఇతఁడు వదలిన నీకు శనివదలినట్లే. నేనిప్పుడు త్రిలోకాధిపతిని—నీయిచ్చవచ్చినసుఖము ననుభవింపవచ్చును.

(అనుబంధము 10)

సీ॥ పాటలాధర! వల్ల ♦ కాట నుండుటకన్న
వేల్పుఁబోఁడులున నుంట ♦ వేడ్కగాదె ?
చెలి! పిశాచములతో ♦ సేవ లందుటకన్న
సురలుకొల్వఁగనుంట ♦ పరువుగాదె ?
కంజాక్షి ! బిచ్చంపు ♦ గంజిఁద్రావుట కన్నఁ
బీయూషమానుట ♦ ప్రియముగాదె ?
కుసుమకోమల ! పాడు ♦ బసరమెక్కుటకన్న
నైరావతము నెక్కు ♦ టరుదుగాదె ?
గీ. కొండవీటి జంగమువానిఁ ♦ గూడి యిట్లు
చెప్పరాని యిక్కట్టులు ♦ నెందుకన్న
ఎల్లలోకమ్ములేలు న ♦ న్నిచ్ఛగించి
మగువ ! సుఖములఁదేలుట ♦ దగవుగాదె ?

పార్వ—ఓరీ! దుర్మదాంధా ! ఎగిరిపడకుము. నీ యైశ్వర్యమునకు మన్నాధుఁడే కారణమనుమాట స్మరింపుము.

జలం—నా యైశ్వర్యమునకే కాదు—నా సౌఖ్యమునకును గూడను. కావుననే నిన్నుఁగూడ నొసంగినాఁడు. శంకరా! భక్తవశంకరా! అవునుగాదా ?

పర—తుచ్ఛుఁడా ! నోరుమూసికొనుము.

జలం—మహాదేవా ! నేను నోరుమూసికొనుటకు నసత్యమాడితినా ? నీతో నాకెందులకు ? పార్వతీ! ఏమనెదవు ? నా హితోక్తుల నాలించి నను వరింపుము.

పార్వ—నీచుఁడా ! నీ కండకావర మంతకంత కధికమగుచున్నది.

జలం— నీ బిగిసికొనుటమాత్ర మంతకంత కధికమగుటలేదా ? కాని యీబిగిసికొనుట నీభర్తకడ నేమిచూచికొనియో నాకు మాత్రము బోధపడుటలేదు.

ఆ. వె. భూషణములులేవు ♦ భుజగమ్ములేగాని
భూతిలేదు పాడు ♦ బూడెగాని
కట్టుబట్టలేదు ♦ కరిచర్మమేగాని
వీడులేదు పెద్ద ♦ కాడుగాని.

ఆ. వె. తిండియైనలేదు ♦ తిరిపెంపుగంజియే
గాని యెట్టివేళ ♦ నైన నదియు
నడిగికొనుటకైన ♦ నరయఁ బుర్రెయెగాని
పాత్రమైన లేదు ♦ పద్మనయన !

గీ. రసికుఁడా యన్న మారుని ♦ మసిరొనర్చి
నట్టిచెనఁటె, రాజాయన్న ♦ నాదిభిక్షు
వైన మైఁదాల్చెనని యాత్మ ♦ నలరెదేమొ
నెత్తి నెక్కించుకొన్నాఁడు ♦ నీదుసవతి.

గీ. ముద్దు లిడుకొనఁబోయిన ♦ బుస్సుమంచు
పాము గఱువంగ రాదఁటే ♦ పద్మనేత్రి!
కౌఁగలించెద వేనియుఁ ♦ గలయ నొడల
బూదియంటెడు గాఁద టే ♦ పూవుఁబోడి !

ఇట్టి తగనిమగనితో, నిట్టి యకించనునితో, నిట్టి విరసునితో, నిట్టినిర్భాగ్యచక్రవర్తితో నన్నొల్లెడ్చెదవు? రా—రమ్ము, పోవుదము. (పార్వతి వెంటఁబడును—పార్వతియటు నిటుఁ బరుగిడును.)

పర—ఓరీ! దురాత్మా! ఇదిగోఁ జచ్చితివిరా! (శూలముతోఁ బొడుచును.)

జలం—(మూర్ఛిల్లును.)

తులసి—(పరుగెత్తికొనివచ్చి) చంద్రశేఖరా! రక్షింపుము. రక్షింపుము. నాకుఁ బతిభిక్ష యొసంగుము. (పాదములపైఁబడును.)

క. ఆలింపవె నా యార్తిని
బాలింపవె జాలి నాడు ♦ ప్రాణేశ్వరునిన్
జాలింపవె కోపం బెద
శైలసుతాహృదయనాథ ! ♦ చంద్రార్ధధరా!

పస—(లేవనెత్తి) అమ్మా ! భయములేదు. ఆతఁడు మూర్ఛిల్లినాఁడు. కొంతవడికి మూర్ఛఁదేఱును. బుద్ధిచెప్పి తోడ్కొని పొమ్ము. మే మింకఁ బోయెదము.

(నిష్క్రమించుచున్నారు.)

జలం—(లేచి) ఆ! ఆ! పరమేశ్వరా! నిలువుము. పార్వతీ ! పోకుము. (పోఁబోవును.)

తుల—ఆర్యపుత్రా! కొంచెము నిలువుము. నామనవి నించుక యాలింపుము.

జలం—(ఆశ్చర్యముతో) ఆ! ఆ! నీ వెందులకు వచ్చితి విచ్చటకు? ఎట్లు రాఁగలిగితివి ?. ఎప్పుడువచ్చితివి ? సరి, పిమ్మటమాటాడుదము. పార్వతి పరుగెత్తికొనిపోయినది కాఁబోలు. ఇంకఁదడయఁగిట్టదు. నీ విందే యుండుము,,

తుల— నాథా! జగజ్జననిం గాఁచింతురా! తగదు. మీపాదములపైఁ బడివేడుకొందును—తగదు—మనపురంబునకుఁ బోదమురండు.

జలం—ఏమే నీకు సవతివచ్చునని భయపడుచుంటివా?

తుల—హృదయేశ్వరా! నాకు సవతివచ్చునని భయపడుటలేదు. మీ కాపదవచ్చునని భీతిల్లుచుంటిని. ప్రాణనాథా! మీరు పరిగ్రహింపవలయునన్న నెందఱు సుందరులు లేరు?

కం॥ లేరే యప్సరసలు కల
రైరె మనుజసతులు దాన ♦ వాంగనలు మరు

న్నారీమణులున్ లేరే?

భూరమణా! యంబఁ గోరఁ ♦ బోలున చెప్పుమా?

జలం—లేకేమి? నీవంటి పెద్దమ్మలు వేవేలున్నారు.

గీ. సరసురా లోకర్తు ♦ చాలు, దేబెపడంతు

లెంద ఱున్ననైన ♦ నేమిఫలము?

చంపకమ్మొకండు ♦ చాలు, నుమ్మెత్తపూ

లెన్నియున్న లాభ ♦ మేమి? మగువ!

తుల— ప్రాణనాథా! ఆ శైలేంద్రజమ్రోలఁ దక్క నచెలువలందఱుఁ జంపకముచెంత నుమ్మెత్తపూలే యగుదురు. ఐన నాథా! సంపెంగపూవు నళీంద్రము గాక్షింపవచ్చునా? దానఁగలుగఁ బోవు చేటు విచారింపవలదా? నా ప్రార్థన మాలింపుము. ఈదుర్బుద్ధి విడువుము.

జలం—(స్వ) ఈదయ్య మెక్కడనుండి దాపరించెనాకు? ఇంక నెక్కడి పార్వతి! అది యేగుహాలోనో దాగియుండును. ఇప్పుడుదానికై ప్రయత్నించిన లాభములేదు. ఈ పిశాచి వెంటనుండఁ బ్రయత్నించుటమాత్ర మెట్లు? అన్నన్న! ఇది నా ప్రయత్నములకెట్లడ్డము వచ్చుచున్నది? దీనివలన నాకేదో నష్టమున్నదని వివాహకాలమున నేఁ దలంచినది సత్యమే యయ్యెను. మొదటనీభూతమును వదలించుకొనవలయును.

శా. ఏచందమ్మున వీడిపోవునొకో నా ♦ కీపీడ? గాఢవ్యథా

ప్రాచుర్యం బిది యెట్టడంగుతొకొ? ధా ♦ రాస్ఫారఖడ్గాహతిన్

బీఁచం బూడ్చి తెరల్తునో కులట! న ♦ భ్ధం దోసి మాయింతునో

యోచింపం బనియేమి యడ్డమెవఁడో ♦ కొక్క యెట్లుగావించినన్?

ఆ గురుబ్రువుఁడు నాకు లక్ష్యుఁడా? వాఁడేమిచేయఁగలఁడు? శపించును ఊఁ, శపింపనీ. ఈపీడ వదలినఁగాని నన్నీచింత వదలదు. కాని ప్రధన

నిర్జితదిక్పాలకుండు, త్రిలోకాధిపతి, జలంధరదానవసార్వభౌముఁ డొక కాంతను జేతులారఁ జంపుట తుచ్ఛపుఁబని. ఐన దీని సాగనంపుట యెట్లు? (యోజించి) మంచియుపాయ మిది. జాలంధరమున కేఁగి యట్లొనర్చెదను. (తులసితో) ఓసీ! నీ కోర్కయే తీరినది, ఇంకఁ బోవుదము రా.

తుల— అనుగ్రహింపఁబడితిని.

(ఇరువురు నిష్క్రమింతురు.)

తృతీయరంగము.

[ప్రదేశము—నదీతీరము.]

ప్రవేశము.—బంధింపఁబడిన తులసినెత్తుకొని

చండి, ముందు పలాశుఁడు.

పలా— ఓసీ! చండీ! నదీతీరమునకు వచ్చితిమి.

చండి— పాడునది! నదిమాట యెందులకు? నా యాలోచన మాట నేమిచేసితివి?

పలా— ఏమది?

చండి— సరిగా వినుము. తులసి చచ్చుటయేగదా జలంధరునకుఁ గావలసినది. నదిలోఁ బడవైచుటకు బదులు దీని మన కడుపులోఁ బడవైచిన నేమి? మనకు బహుమానము తరువాత ముట్టునో, లేదో! ఇట్లు చేసిన ముట్టకున్నను జింతయుండదు.

పలా— ఛీ! ఛీ! నిర్భాగ్యురాలా! మహారాజుమాట నతిక్రమింప వచ్చునా? ఊ— తెల్లవాఱవచ్చుచున్నది. ఎవరైనఁ జూచిన మహారాజుగారి కపకీర్తిగల్గును. నదీగర్భమునఁ బడునట్లు తులసిని విసరివేయుము.

చండి— నీయిష్టము. (తులసిని విసరివేయును.)

పలా___ ఊఁ—ఇంక నడువుము.

చండి___ అయ్యో! ఏ జలచరమున కీపదార్థము ప్రాప్తియున్నదో! నా నోటిలో శనియున్నది. ఏమిచేయుదును ? (నొసలుగొట్టుకొనుచున్నది.)

(నిష్క్రమింతురు.)

[ప్రవేశము—తులసితో విష్ణుదేవుఁడు]

విష్ణు—

ఉ. అన్నులమిన్న! యెవ్వంతవో? ♦ యాత్మవిభుం డెవఁడో కొ-నీకు? నిన్
గన్నజనిత్రి యెవ్వారయొ ? ♦ గాదిలితండ్రి యెవండో ? యేటికిన్
జెన్నఁటు లెవ్వ రివ్విధిని ♦ జిత్తమునం దయలేక త్రోచిరో
యున్నదిలోన నిన్ను వచి ♦ యింపవె దాపక నీచరిత్రముస్.

తుల— ఓప్రాణదాతా !

ఉ. లాలితకీర్తియా నల జ ♦ లంధరదానవచక్రవర్తి కి
ల్లాలను, బావనాసుంకు ♦ లాంబుధిచంద్రుఁడు కాలనేమికిన్
బాలమృగాక్షి మాధవికిఁ ♦ బట్టి, నెడంద నెఱుంగ నెవ్వ రి
వ్వేళ ననుఁ నదింబడఁగ ♦ పేఁకునఁ ద్రోసిరో ? లేరు శాత్రవుల్.

నేను రాత్రి నిద్రించుటమాత్ర మెఱుంగుదును. ఎవ్వ రీపనిఁజేసిరో యెఱుఁగ.

గీ. నీటఁద్రోయంగఁబడి మర ♦ ణింపనున్న
నన్నుఁ బ్రేముడిఁ బ్రోచిన ♦ కన్నతండ్రి
యీ వెవఁడవయ్య ! మకరి వ ♦ ధించి కరిని
రక్షణముసేయు నిందిరా ♦ ప్రాణపతివో ?

విష్ణు— సుందరీ ! నే నిందిరానాథుండనే, నీకెవ్వరుశాత్రవులు లేరనుచుంటివి. నీవు పొరపడుచుంటివి.

ఉ. అంచితభక్తి నెవ్వనిజ ♦ యమ్ముగను గోరి యెడంద మమ్ముఁ బ్రా
ర్థించుచు నుందువో? యెవని ♦ దేవ్వఁడటంచు భజించుచుందువో
చంచలనేత్రి! యమ్మగఁడె ♦ స్వాంతమునన్ గృపవీడి నిన్నుఁద్రో
యించెనదిన్ నిజమ్మెఱుఁగు ♦ మింతయునుం బగ నీకు నాథుఁడే.

తుల — హరిహరీ! నామనోనయితుఁడు నిర్దయుఁడుగాఁడు. మీయూహ సత్యముకాదు.

విష్ణు — కాంతా! నీవు నిజం బెఱుఁగకుందువుగాక — నారాయణుండు గూడ నెఱుఁగనేరఁడా?

తుల — (స్వ) నిజమే కాఁబోలు. కాకున్న సత్యస్వరూపుఁ డిమ్మహాత్ముఁ డేల యబద్ధమాడును? హా! ప్రాణనాథా! నేను నీకంత భారమైతినా? నిన్నననేల? ఇది నా దురదృష్టము. కట్టా! ఈ లక్ష్మీమనోరమణుఁడు నాకేమో మేలుసేసినవాఁడనుకొంటి ఇది కీడేయయినది. ఎందులకు నక్కఱకురాని యీపాడుజన్మ యింతటితో నంతరించుటయే శ్రేయస్కరముగాదా? నే బ్రతుకుట యెందులకు? నానాథునకు భారమనగుటకేగాదా? ఇప్పుడేమిసేయుదు? ఆత్మహత్యమహాపాపమునకు హేతువు. అందుల కొడంబడుదునన్నను ఇమ్మహానీయుఁడు నన్నుఁ జావనీయఁడు తిరుగ నా ప్రాణేశ్వరునకుఁ జింత కలిగింపవలసివచ్చినది.

ఆ. పడఁతి నదిని ద్రోయఁ ♦ బడియెఁ బీడదొలంగె
నంచు మిత్రుల నంత ♦ సించు నాథు
డెదుటకేను దిరుగ ♦ నేఁగి కంటంబడఁ
గటకటఁ బడి యెంత ♦ కనలు నొక్కొ?

విష్ణు — పొలఁతీ! నీ విచారము నే నెఱిఁగితి. నీ వాక్రూరుని చెంతకుఁ (తులసి చెవులు మూసికొనును) బోనక్కఱలేదు. నిన్ను

వైకుంఠనగరి నుంచెద. అందు నిర్విచారముగఁ గాలముఁ గడుపుకొనవచ్చును రమ్ము.

తుల— హా! ఏమి నాభాగ్యము. ఓదయానిధీ!

ఉ. కాయలుఁ గందఁగుం దినుచుఁ ♦ గాననభూములయందు నారతం
బాయతభక్తిఁ దావక ప ♦ దాంబుజముల్ భజియించు నాజగ
ద్గేయులకున్ జటీంద్రులకు ♦ దేవ! యొసంగెదు నవ్వైకుంఠమున్
మాయురె! మిన్న కేఁదలఁచి ♦ నాఁడవు మామకభాగ్యమేమనన్.

కాని తండ్రీ! నీ వెఱుంగని ధర్మమేమున్నది? నన్ను మన్నింపుము.

ఆ. వె. సతికి భర్తృపాద ♦ సన్నిధికన్న ఘ
నమ్ముగాదు చూవె ♦ నాకమైన
బ్రహ్మలోకమైన ♦ భవుని కైలాసమ్ము
నైన నవ్వైకుంఠ ♦ మైన దేవ!

దయయుంచి నా ప్రాణేశ్వరుని చెంతకు నన్నుఁ బంపుఁడు.

విష్ణు— (స్వ) ఔరా! ఏమి యీకామిని పతిభక్తి! (ప్ర) అతివా! నీరమణుఁడు నిన్నుఁ జంపఁదలఁచికదా యిట్లు గావించె. తిరుగ నేగిన నీబ్రతుకు కబద్ధము.

తుల— ఆర్యా! పెఱచోటుల బ్రదుకుకన్న సతికిఁ బతిచెంగటఁజావు మేలుగాఁదా?

విష్ణు— సాధ్వీ! ఏమైన నిన్నా క్రూరునిచెంత విడువఁజాలం. ఆతఁడు నిన్ను వధియించును. జాలంధరమునకుఁ బంపెద.

తుల— దేవా! నా మనోరమణుఁడు జాలంధరమున లేఁడా?

విష్ణు— ససైన్యముగఁ గైలాసమున కేఁగినాఁడు.

తుల— అయ్యో! నా నాథుని కా దుర్బుద్ధి యి-కను బోదయ్యెనా? ఆ ఫాలాక్షునివలన నెట్టి చేట్ట గలుగనున్నదో! లక్ష్మీమనోనాయకా! నా ప్రాణేశ్వరుని రక్షింపుము.

విష్ణు— నీ పాతివ్రత్యమే రక్షింపఁగలదు. (పైకి జూచి వినునట్లభిన యించి) ఓహోహో ! వాణీధవుండును మాధవుండు నెందులకో నన్ను ధ్యానించుచున్నారు. ఇంక నిందుఁ దడయరాదు—అలి వేణీ ! జాలంధరమునకుఁ బంపెద—కనులు మూసికొనుము.

తుల— (కనులు మూసికొనును.) (యవనిక జారును.)

చతుర్థరంగము.

ప్రదేశము—కైలాసము.

[ప్రవేశము—త్రిమూర్తులు, ప్రమథులు.]

బ్రహ్మ— దేవా ! లక్ష్మీమాధవా !

మ. కరుణాలేశములేక పాపభయముల్ ♦ గానంతయున్ బూనకే
సురమర్త్యోరగవిష్టపత్రయము సం ♦ క్షోభింపఁగాఁ జేయుచున్
గరమున్ గర్వమెలర్పఁగల్ దిరుగు లో ♦ కద్రోహిఁ గ్రూరుల్ జలం
ధరు మాయింపఁదలంప వింత కిదె నీ ♦ ధర్మమ్మొ? మాకర్మమో ?

పర— లోకరక్షణపరాయణా! నారాయణా! అది యటుండ మఱియొక యాపదగలిగినది, అది యెవరికోగాదు, నాకు.

ఉ. 'దారనుగోరి యాతులువ ♦ దైత్యులతోడను గూడి వాడిమిన్
బోరికి నేఁగుదెంచె, ననిఁ ♦ బోఁడిమివీఁడఁడ యింత కింతకున్
నారి పతివ్రతాత్వము న ♦ ణంచినదాఁక గతింపఁ డాతఁ, డే
దారియొ వాని గీటడఁప ♦ దానవమర్దన ! యానతీయవే !

బ్రహ్మ— (స్వ) ఉమానాథుఁడు రమానాథునితో నాభారము నీది యని చెప్పనేరక మఱుగుపఱచుచున్నాఁడు. చల్లకువచ్చి ముంత దాఁచుకొను టెందులకు ? ఆమాట నే నుడివెదగాక.

విష్ణు — చంద్రశేఖరా ! మనవు మొదట యోజింపవలసినది. తపోవ సానమున వానికి మన మొసంగిన శంఖము మాట.

బ్రహ్మ— మహాత్మా ! ఆలింపుము.

గీ. మంత్రిమో తంత్రిమో, యేదొ ♦ మాయచేసి
వాని శంఖము హరించు ♦ వంతునాది
వనిత భంగపెట్టెదు నట్టి ♦ వంతు నీది
యసుర యసురుగొనెను వంతు ♦ హరునిదయ్య !

విష్ణు—గీ. యత్న మొనరింతు, నొనరింతు ♦ ననఁగనేల
ఆ జలంధరు వేషమ్ము ♦ నట్టె తాల్చి
చెలువగరితతనమ్మును ♦ జెఱచువాఁడ
మీఁదు యత్నమ్ములను మీరు ♦ మెలఁగుఁ డింక.

అంద— ధన్యులమైతిమి.

విష్ణు— (నవ్వుచు) నారదా ! లోకమునకు హితమగు కార్యమిది—
నీవు దయచేసి యడ్డురావలదుసుమా !

నార— మహాత్మా ! చెప్పవలనా మీరు నాకు ?

విష్ణు— ఇంక నే నేగెద. (నిష్క్రమించును.)

పర— అంబుజాసనా ! మనకుఁ దులసి యడ్డు తొలఁగినట్లేగదా ?

బ్రహ్మ— ఇంకను సంశయ మెందులకు ? నాప్రయత్నము వినుఁడు.

గీ. పార్వతింబోలు దానినిఁ ♦ బడఁతి నొకతె
సృష్టిఁజేసి పంపింతు నా ♦ చెనఁటికడకు
స్మరునిబారిని ద్రోసి యా ♦ సతియె శంఖ
మపహరించి తెచ్చుఁ జం ♦ దాడ్రమకుట !

నార— ఉపాయము బాగుగానున్నది.

బ్రహ్మ— నారదా ! నీ విందును అడ్డురావలదు సుమా !

నార— తండ్రీ ! నీవును దాతగారివలె ననుచుంటివా ? నే నెఱుఁగనా?

పర— మన మింకఁ బోదము. (నిష్క్రమించును.)

పంచమ రంగము.

కైలాసమున యుద్ధభూమి.

[ప్రమధులు దైత్యులు పోరుచుండ నొకప్రక్కనుండి జలంధరుఁడు
ప్రవేశించును - ప్రమధులు పారిపోవుదురు -
దానవులు వెంబడింతురు.]

జలం— ఓహో! వీరభద్ర బలీభద్ర భద్రకాళప్రముఖ వీరప్రమధు
లారా! ఏలపాఱెదరు? నిలువుఁడు భయములేదు.

సీ. ఓవిశాలాక్షు! యో ♦ రీ వీరభద్ర! యో
రీ బలీభద్ర! యో ♦ రీ విరూప!
ఓరి విశమ్మన! ♦ యో తామ్రలోచన!
యోరి కుంభోదర! ♦ యోరి వికట!
ఓ రణశ్లాఘి! యో ♦ రోరి బలోన్మత్త!
యోరి కుటీచర! ♦ యోరి వికృత!
ఓరి మహాకాల! ♦ యోరిదుర్జయ! యోరి
క్రౌంచభేదీ! యోరి ♦ కపిలనేత్ర!

గీ. పఱవఁబోకుఁడు మిముఁబోటి ♦ పిఱికిబంట్ల
పాడునెత్తురుఁ గన్నులఁ ♦ జూడ నేను
చూడనెంచిన వస్తువుఁ ♦ జూపుఁడోరి!
అఖిలసద్గుణగణధన్య ♦ నచలకన్య.

[ప్రవేశము—మాయాపార్వతి.]

మాయా— (స్వ) ఇదిగో! అచలకన్య గాదు. నీపాలిటి మృత్యుకన్య;
(ప్ర) దానవేంద్రా! జయము! జయము!

జలం— (చూచి యచ్చెరువుతో) ఓహో! ఈ కల్యాణి యెవ్వతె?
ఇదియె టక్కులాఁడి పార్వతి!

సీ. ఇదియకా ? వేలుపు ♦ టింతుల రూపునఁ
దలమెత్తఁగా నీని ♦ కులుకులాఁడి
ఇదియకా ? స్మరహరు ♦ నింతటివానిని
వలపున ముంచిన ♦ వన్నెలాఁడి
ఇదియకా ? దను సృజి ♦ యించిన విధిఁగూడ
మోహింపఁజేసిన ♦ ముద్దులాఁడి
ఇదియకా ? యేఖుంతి ♦ నేని మెచ్చని నాదు
నెద దొంగిలించిన ♦ యొమ్మెలాఁడి

గీ. కలికి యిదియకా నాపాలి ♦ కల్పతరువు
కాంత యిదియకా నాపాలి ♦ కామగవియు
రమణి యిదియకా నాపాలి ♦ యమృతకుంభ
మతివ యిదియకా నాపాలి ♦ యమరమణియు.

గీ. నాతి ! నేఁటికిఁ బండెనే ♦ నాతపంబు ?
కలికి ! నేఁటికి గల్గెనే ♦ కరుణ నీకు ?
అతివ ! నేఁటికి నణఁగెనే ♦ యభవుగర్వ ?
యింతి ! నేఁటికి ధన్యుఁడ ♦ య్యానె మరుండు ?

(చేయిఁ బట్టుకొనఁ బోవును.)

మాయా— (తొలఁగి) ఆ! ఆ! జలంధర ! అప్పుడే పాణిగ్రహణమా ? ఒకమనవి నాలింపవలయును.

జలం— అంతకన్న మహాభాగ్య మేమి ?

మాయా— నీ పట్టమహిషి తులసి లావణ్యరాశియని వినియుంటిని. ఆమె ముందు—

జలం— ఇదియా నీ సందేహము ? అపీడ వదలినది.

మాయా— అదినే యబద్దములా ?

జలం— అబద్దముకాదు. దానిఁ గడలిం ద్రోయించితిని.

మాయా— నీవు తోడ్పించితివి కాని విష్ణుదేవుఁ డామెను గాపాడి బలిపురముఁ జేర్చెను.

జలం— ఏమి! వాని కండకావరము! కానిమ్ము. నీకు భయములేదు. నీ యింట నడుగుపెట్టుటయే తడవుగ దాని కాలునింటఁ బ్రవేశపెట్టెదను. సవతిపోరు నీ కుండదు.

మాయా— ఈ మాయమాటలు నేను విశ్వసింపను.

జలం— అయిన నన్నెట్లు విశ్వసింతువు ?

మాయా— నీవు నన్నుఁ బ్రాణముగా మన్నింతువా ?

జలం— అంతకన్న నెక్కుడుగ.

మాయా— అయిన నేఁ గోరినఁ బ్రాణములనైన నిత్తువుగాఁబోలు !

జలం— నిస్సంశయముగ.

మాయా— చూతము. ప్రాణపదముగదా నీ శిరమునున్న శంఖము ? దాని నొసఁగిన ప్రాణమొసఁగినట్లే ! ఏది— దానిని నా కిమ్ము.

జలం— సందేహింతు నను గొంటివా !

గీ. తలిరుఁబోఁడిరో నీవె కా ♦ వలయునన్న
శంఖమేమి ప్రాణమ్ము నో ♦ సంగనఁటనె ?
వలపుఁబ్రియురాలు కోరిన ♦ వస్తు వట్టి
యొసఁగ నేరని వాఁ డొక్క ♦ రసికుఁడొక్క ?

ఇదిగోఁ గైకొనుము! (ఇచ్చి) ఇప్పుడు విశ్వసించితివిఁగదా ? కాని— ఓ చేలా ! ఇది నీ కెందులకు ? హారమా ! మణియా ! నగయా !

మాయా— అదిగో ! ఇంతలోనే దీనింగొనను ద్వేషించుచుంటివా ! నీవిట్టి చంచలచిత్తుఁడ వగుదువనియేసుమా నీయెడఁ బట్టరాని తమకముఁ గలిగియు శివుని వదలకుంటిని. నే ననుకొన్నంత గాదు కదా తుదకు !

జలం— ఓముద్దరాలా! బెదరకుము. దాని నెపమున నీవే ధరింపుము.
శంఖ మిచ్చితింగదా? ఏది ఒక్కముద్దు!

మాయా—ఇక్కడనేనా? ఆ నికుంజముచాటునకుఁ బోదము రమ్ము.
(నడచును)

జలం— ఆహా! ఇక్కడ నీ నికుంజమెక్కడిది? దీని నేనిదివరకుఁ జూడ.
లేదు సుమా! ఇదియొక భాగ్యమే!

మాయా— (స్వ) ధాత్రిపుత్రి దలంచుకొనిన నేమికాదు? (పరిక్రమించి నికుంజము చాటునకుఁ బోవును.)

జలం— పార్వతీ! అంతతొందరగఁ బోయెదవేమి? నాకు దొందర
గనే యున్నది. వచ్చుచుంటిని, నిలువుము. (పరిక్రమించును.)

(నికుంజము మాయమగును.)

జలం— ఆ! ఆ! ఇది యేమిమాయ! పార్వతి యేది? ఆ నికుంజమేది?
ఆహా! ఇదియంతయు నా దొంగశంకరునిమాయ! మఱి స్వ
యంకృతాపరాధము! ఓరీ దురాత్మా! ఇందులకుఁ దగినశిక్ష
ననుభవింతువు. ఎచ్చట డాఁగిన నీ ప్రాణములు దక్కవు.

ఉ. ఓరి! దురాత్మ! సిగ్గువడి ♦ యుండక నారలతాంగినట్లు నీ
వారిజనేత్ర నాకడకుఁ ♦ బంపి హరించితి శంఖ మింత నా
పౌరుష మేమి తగ్గెనొకొ? ♦ పాఱకు శూరత నిల్వరా సమి
ద్ధారుణి నిన్ను మన్నిగొని ♦ దారను శంఖముఁ గొందు వేళ్ళిమ్మడిశా.

(పరవళ్ళు దొక్కుచు నిష్క్రమించును.)

## షష్ఠరంగము.

### ప్రదేశము - జాలంధరము, అంతఃపురము.

[ప్రవేశము—తులసీదేవి.]

(అనుబంధము 11.)

తుల—

గీ. ప్రాణవల్లభు దయకుఁ బా ♦ త్రమ్ముగాని
రమణిజీవిత మటులు, దా ♦ రక విభుండు
లేని రేయిచెలువమట్లు ♦ లీలఁదోఁచెఁగ
వరుఁడు లేమి జాలంధర ♦ పురవరంబు.

మ. మదవద్దైత్య తమిస్రభాస్కరునకున్ ♦ మందాకినీమౌళికిన్
మది భీతిల్లక మానినీమణిఁగొనన్ ♦ మత్ప్రాణకాంతుండు వో
యె దయన్స్వామి యుమావరుండు విభు మా ♦ యింపందలంపూనునో?
సదయుండై క్షమియించునో? యకట! య♦స్మద్భాగ్యమెట్లున్నదో?

గీ. ఏమి గానున్నదో! యింక ♦ నెట్టిచెట్ట
గలుగనున్నదో! కట్టిఁడి ♦ కమలగర్భుఁ
డెట్టిగతి నానుదుట లిఖ ♦ యించినాఁడో!
దానవస్వామి నెటుసేయఁ ♦ దలఁచినాఁడో!

హా! మనోరమణా! జలంధర సార్వభౌమ!

శా. ఏ నిర్భాగ్యను గాన నన్నుఁ గయికో ♦ నిష్టమ్ము లేకుండినన్
బోనీ దానవసార్వభౌమ! కఱవా ♦ పూఁబోండ్లు? చేపట్ట నిం
తేనిన్ వందలు వేలు లక్షలును లే ♦ రే? యింత చింతింపకే
ప్రాణాపాయముఁదెచ్చు శైలతనయన్ ♦ వాంఛించి తింకేమనన్.

నాథా! నీతిజ్ఞుండవు. ఇంతకుఁ దెగింతువే? అయ్యో! నిన్ననేల? ఇది నాదురదృష్టము.

(అనుబంధము 12.)

సీ. ప్రాణేశ ! నిన్ను దూ ♦ రం బనియున్న దే ?
యిది విధివ్రాఁత నా ♦ నుదుటిగీఁత
కాకున్నఁ గలనన్నఁ ♦ గాంత యొక్కటిదక్కఁ
గలిగెనే యెపుడిట్టి ♦ కాంత నీకు ?
కలుగుఁగా కప్సరః ♦ కన్యలు, దానవ
కన్యలు, మానవ ♦ కన్యలుండ
వారిని గోరక ♦ యీరేడు జగముల
తల్లి, సచ్చరితామ ♦ తల్లి, సభవు
వనిత, నింతకుఁ దావక ♦ వాంఛితములఁ
గరుణ సమకూర్చు శ్రితజన ♦ కల్పవల్లి
క్రూరదానవశత్రు వ్రజ కు ♦ ఠారిక హిమ
శైలపుత్రి వాంఛించెదే ♦ వేలనగుచు ?

ఆచార్య ! భార్గవా ! నిఖిల నీతికోవిదుండవు. అఖిలాగమ పారంగతుం డవు. నీవైన నీ ప్రియశిష్యుని వారింపకపోయితివే ?

[నేపథ్యమున]—అమ్మా ! వారింప కేమి ? నేను మాత్ర మూర కొంటినా ?

[ప్రవేశ—శుక్రుఁడు పటముతో]

తుల— తండ్రీ ! నమస్కారము.

శుక్ర— సుమంగలీభవ! అమ్మా! నేనడ్డగింప లేదనుకొంటివా? అయిన నామాట నాతఁ డేది వినినాఁడు తల్లీ !

తుల— తండ్రీ ! అయిన మీశిష్యుని రక్షించుకొనుటకు మార్గము లేదా ?

శుక్ర— బిడ్డా! వేఱుమార్గమేల? నీసౌశీల్యమును గాపాడుకొనుటయే నీ మనోహరుని రక్షించుకొనుట.

తుల— ఆ హారియు హారుండు నిటులే చెప్పిరి.

శుకా్రి— కుమారీ! వారట్లు చెప్పిరని నీ వేమఱియుండవలదు. దివ్యులు మాయోపాయవిశారదులు. (స్వ) శంఖాపహరణమునుగూర్చి నుడివిన నీమె మఱింత గుండెవగులును.

తుల— జనకా ! నా కా ధైర్యమున్నది.

శుకా్రి— తల్లీ ! ఏమి ధైర్యము ?

తుల— నా పాతివ్రిత్యము నేను రక్షించుకొనఁగలనని.

శుకా్రి— నాకును నట్టి నమ్మక మున్నది. అయిన మెలకువతో మెలఁగవలయును. అమ్మా ! దీనిం గైకొనుము.

తుల— ఏమి ?

శుకా్రి— నీ కాంతుని రూపపటము.

తుల — (తీసికొని కన్నుల కద్దుకొనుచున్నది.)

శుకా్రి— తల్లీ ! విధివశమున నీ పా్రిణవల్లభుని స్పృశించుటకుఁగాని పూజించుటకుఁగాని నీవు నోఁచనైతివి. ఈపటమును నిరంతరముఁ బూజించుచు నానందింపుము.

తుల— మహాభాగ్యము !

శుకు్రి—నే నింకఁ గైలాసమున యుద్ధమెటులు జరుగుచున్నదో చూడఁ బోయెదను.

తుల— చిత్తము. కాని తండ్రీ్రి ! నిరంతరము యుద్ధవార్తలు నాకు సేవకులచేఁ గబురంపుచుండవలయును. మఱియు,

గీ. దైవఘటనావశమున మ ♦ త్స్వామి కొక్క
వేళ ఘోరమృత్యువు సంభ ♦ వించునేని
పా్రిణవిభుశిరమైన న ♦ వయవమైన
సేవకులచేతఁ బంపుఁ డేఁ ♦ జితిని జొత్తు.

శుక్రి— శివశివ! అమంగళము గలుగకపోవుఁగాక! తల్లీ! యిదే మహాత్మా! యిట్లు పలుకుచుంటివి?

తుల— తండ్రీ! ఏమంటిని? ఇది యమంగళమా? దేవరయనుగ్రహమున మేలగుఁగాక!

శుక్రి— నే నిఁకఁ బోయివచ్చెద.

తుల— చిత్తము.

(శుక్రుఁడు నిష్క్రమించును.)

(పటముఁజూచుచు) హా! మనోరమణ! భువనైకమోహన! ఏమిః నీ రూపము కనుల మిఱుమిట్లు గొలుపుచున్నదే!

ఉ. ఎంత మనోహరుండవు హృ ♦ దీశ్వర! యాపటమందు నీదు రూ
పెంతయుఁ గ్రాలెడున్, హృదయ ♦ మెంతయు లాగెడుఁ, గట్ట! యిట్టి నీ
కింతినయ్యు నీయెదుట ♦ నించుక నిల్చి త్వదీయరూపమున్
స్వాంతము వొంగ నొక్కటటి ♦ నైనఁ గనుంగొన నోఁచనైతినే!

ఉ. ఎంతని చెప్ప నీకురుల ♦ యింపునుసొంపు నయారె! యయ్యో! యీ
కుంతలబంధమున్ విడిచి ♦ కోరిక లీరికెలెత్త నల్ల నీ
చెంతవసించి తావులను ♦ జిందెడునూని నలందనైతి జి
క్కంతయుఁ దీయనైతి ముడి ♦ నేయెడ వేయఁగఁ బోలనైతినే.

గీ. సుప్రసన్న భాసుర మహము ♦ సొంపుమీఱు
నీదు నిటలతటమ్ము వ ♦ ర్ణింపఁదరమె
యిట్టినుదుట నక్కట! యెన్నఁ ♦ డేని దనివి
దీఱఁ గస్తురిబొట్టును ♦ దిద్దనైతి.

ఉ. ఎంతవిశాలముల్ బళిర! ♦ యీకను లిందుఁ గృపారసమ్ము దా
మెంతయుఁ జిల్కుచున్నక్రియ ♦ నింపుఁదలిర్చెదు, నైన నక్కటా!
స్వాంతమునందు నిన్ను భగ ♦ వంతునిగాఁ దలపోయు కాంతపై
నింతయినన్ దయారసము ♦ నేయెడ నేనియుఁ జిల్కవయ్యెనే.

గీ. ఏమి యీ చెక్కిళుల చంద ♦ మేమియంద
మద్దములవోలె నలరెడు ♦ నహహా! వీనిఁ
దమకమున ముద్దులాడంగఁ ♦ దగఁగనైతిఁ
గడకు స్పృశియించు భాగ్యమేఁ ♦ గాంచనైతి.

గీ. తేనెసోనలొలయుఁ ♦ దీయయి చెల్వారు
తావకాధరమ్ము ♦ దరమె పొగడఁ
గట్ట! నోఁచనైతిఁ ♦ గా, యిట్టినీదు కె
మ్మోవి నాను భాగ్య ♦ మునకు నేను.

గీ. ధరణి నీయశఃకీర్తుల ♦ కరణి నీదు
బాహువులుగూడ దీర్ఘముల్ ♦ ప్రాణనాథ!
అకట! యిట్టి నీబాహుమ ♦ ధ్యమ్మునందు
నొక్కతఱినైనఁ దమిదీఱ ♦ నొప్పనైతి.

గీ. రమణ! నీదు లోకత్రయీ ♦ రాజ్యమటులె
నీ యురస్సీమయు విశాల ♦ మై యెసంగు;
ఇట్టి నీయురస్థలి నయో! ♦ యెన్నఁడైన
హాయిగా నొడలింజేర్ప ♦ నైతి నేను.

ఉ. పల్లవసన్నిభంబగు భ ♦ వన్మృదుపాదయుగమ్ము మున్మనో
వల్లభ! మామకాంకమున ♦ వారక చేరిచి మెల్ల భక్తిసం
ధిల్లఁగఁ బట్టనోచనయి ♦ తీఱ గనుదమ్ముల నద్దనైతి ను
త్ఫుల్లసుమవ్రజంబులను ♦ బూజ లొనర్పఁగఁ జాలనైతినే!

మనసా! ఎందుల కీదురాశ! అట్టియానందము ననుభవించు భాగ్యము నీ కీ జన్మమున లేదు. ఈపటమును బూజించు భాగ్యమైన నేఁటికిఁ గలిగినది. గుర్వాజ్ఞ నిర్వర్తింపఁ బూజాద్రవ్యములఁ గొనివచ్చెద.

(నిష్క్రమించును.)

## ఏడవ రంగము.

[ప్రవేశము—జలంధరుని రూపుతో విష్ణువు.]

విష్ణు—

ఉ. దానవకోటిఁ గీటడఁపఁ ♦ దాల్చితి నింతకుఁ బెక్కురూపులన్
గాని పలాశిరూపము నొ ♦ కండయినన్ ధరియింప నెన్నఁడున్
హీనత నెంచ కద్దియు వ ♦ హించితి నేఁటికి, నట్టివేషమే
నీ నటకుండు దాల్పవల ♦ దే? మదిఁ గొంకిన లాభమున్న దే?

సీ. ధరణీశు వేసము ♦ దనవం తనునుగాని
మఱొక వేషము ♦ వేయఁడొకఁడు
మీసముల్ గొఱిగించి ♦ మెలత వేసముఁ దాల్ప
నీచతయంచును ♦ నీల్గునొకఁడు
కావిపుట్టమ్ములు ♦ గట్టి సన్యాసికా
నేమంతగతియని ♦ యెంచునొకఁడు
వింజామరమ్ములు ♦ వీచు సేవకపాత్రి
నెవఁడు దాల్చునటంచు ♦ నేచ్చునొకఁడు

గీ. బొమిడికముఁ దాల్చినంతన ♦ భూపుఁ డగునొ?
చీరఁ గట్టిన మాత్రన ♦ చెలువయగునొ?
దండము ధరించినంతఁ ద్రి ♦ దండియగునొ?
బెత్తముం బట్టినంతన ♦ భృత్యుఁ డగునొ?

సీ. శిష్టుల రక్షింప ♦ దుష్టుల శిక్షింప
నాడురూపైన నే ♦ యనదరూపు
నైనను, ధరియించి ♦ యవనికి శ్రీయమ్ము
సతతమ్ము గూర్చునా ♦ సరణిగాఁగ
నీతిఁ బోషింప దు ♦ ర్నీతిఁ బరిహసింప
నటకుండు దాల్చు నా ♦ నావిధముల

రూపుల, నటుగాన ♦ రోయుంగఁ బనిలేదు
హేయతగా నెంచి ♦ యెవ్వరేని

గీ. ఇంత యోజింప కజ్ఞుల్ హ ♦ సింతు రేని
గుందఁ బనిలేదుసూ నట ♦ కుందు మదిని
గస్తిదిరుగు రాజభటుని ♦ గాంచి దొంగ
యంచు శునకముల్ మొఱిగిన ♦ యంత నేమి ?

గీ. ఎంత బాగుగ నటియించు ♦ నేని, నటకు
లోపముల నెన్ను చుందురు ♦ లోకు, లటులె
ఎంత ధర్మబద్ధంబైన ♦ నేను నేఁడు
సేయు కార్యంబు నెటులు భా ♦ వింత్రొజనులు.

గీ. ఎట్టి వేసమ్ము దాల్చిన నట్టి తిట్లు
పడిన నటకుఁ డెప్పటి రూపు ♦ గడకుఁ దాల్చు
ఎట్టి వేసమ్ము దాల్చిన ♦ నెట్టిశాప
ములఁ గనిన నే నటులె దాల్తు ♦ మొదటిరూపు.

(పరిక్రమించి) ఔరా !

గీ. పూర్వగీర్వాణులకు సుప ♦ ర్వులకు నెత్తఁ
దరముగాని మంధరమెత్తఁ ♦ దరలునపుడు
తెడఁబడని మత్పదమ్ములు ♦ వడఁకఁ దొడఁగెఁ !
బడఁతి భంగపుచ్చు టిఁకెంత భార మవునో ?

ఆహా ! పాతివ్రత్య మహాత్మ్య మవాఙ్మానసగోచరముగదా!

శా. చేతో జాత విరోధి యువ్విధి సుర ♦ శ్రేణుల్ దనుం గొల్వఁగా
భూతవ్రాతముఁ బుట్టఁజేయ మనువర్ ♦ బోకార్పఁగా దక్షుఁడై
స్ఫీతప్రక్రియఁ బొల్చు శ్రీధవు మదిన్ ♦ భీతిల్లఁగాఁ జేయు స
త్పాతివ్రత్యమహాప్రభావ మెడఁదన్ ♦ భావింపఁగా శక్యమే!

ఏమో యోజించుచుఁ బ్రొద్దుపుచ్చుచుంటిని. ఇంకఁ గర్త

వ్యమునకుఁ గడఁగెద. ఇదియేకదా తులసి యువరోధము ! ఆ దేవి కానరాదేమి ? ఓసీ ! దాసీ !

[దాసి—ప్రవేశము.]

దాసి— (స్వ) ప్రభులవువా రిప్పుడే దయచేసినారు కాఁబోలు. (ప్ర) దేవా ! ఏమియాజ్ఞ !

విష్ణు— దేవి యెచ్చటనున్నది ?

దాసి— (స్వ) ఏమబ్బా ! ఎన్నఁడులేనిది దేవిని బరామర్శించుచున్నాఁడు. ఏయూరిలో వాన గురిసినదో ! (ప్ర) దేవా ! ఆ మందిరమున నున్నారు.

విష్ణు— మంచిది. ముందు నడువుము.

దాసి— దేవా ! ఇటు ఇటు.

(నిష్క్రమింతురు.)

ఎనిమిదవ రంగము.

[ప్రవేశము:—పటమును బూజించుచుఁ దులసీదేవి]

(అనుబంధము. 13)

దాసి—(ప్రవేశించి) అమ్మా ! పటమును బూజింపనేల ? ప్రాణేశ్వరునే పూజింతువుగాని లే—మహారాజుగారు దయచేయుచున్నారు.

తుల—ఆ ! ఏమే ! నిజమా ? నా ప్రాణేశ్వరుఁ డేతెంచెనా ? ఎక్కడ నున్నాఁడు ?

దాసి— ఒకచోట నిలుచు నట్లున్నదా ? దేవియెక్కడ దేవియెక్కడ యని పరుగెత్తుకొని వచ్చుచున్నారు. అమ్మా! నేఁడు నీ భాగ్యము పండినది. నా యదృష్టముగూడ పండినట్లే !

తుల— ఇదిగో ! ఈ హారము గొనుము. కాని నా నాథుఁడు వచ్చిన మాట నిక్కమేనా ?

దాసి— వచ్చినమాటయేమి ! మిమ్ము ననుగ్రహించు మాటగూడ నిక్కమే. వారుగో !

[ప్రవేశము-విష్ణువు జలంధర వేషముతో]

తుల—(స్వ) హా ! ఏమి నాభాగ్యము ! (ప్ర) ప్రాణేశ్వరా ! నమస్కారము !

(సాష్టాంగపడి నమస్కరించును.)

విష్ణు— దేవీ ! లెమ్ము. (లేవనెత్తుచున్నాఁడు.)

తుల— హా ! నేఁడుగదా నాశరీరము పావనమైనది !

(మూర్ఛిల్లి విష్ణువుచేతులమీఁద నాఁపి కూర్చొని తొడపైఁ బరుండఁ బెట్టుకొనును.)

విష్ణు— (స్వ) ఈకాంత యానందపారవశ్యమున మూర్ఛిల్లినది. ఔరా! ఏమి దీని ప్రేమ ! (విసరును.)

తుల— (లేచి సిగ్గుతోఁ దలవంచుకొనుచున్నది.)

విష్ణు— (చుబుకమును స్పృశించుచు) ప్రాణేశ్వరీ ! ఏమి నీ పతిభక్తి ఏమి నీ సౌశీల్యము !

చ. పరిణయవేళనుండి నిను ♦ భావమునందును నొల్లఁ బోక, నిన్
దరికిని జేరనీక, సత ♦ తమ్ము సుఖింపఁగలేక, ధూర్తుఁడై
హరహర ! సేవకావళుల ♦ నంపి నినుఁ గనదిఁ ద్రోచినట్టి దు
శ్చరితుని పై ని నీకిపుడు ♦ సైతము ప్రేముడియున్న దే ప్రియా !

తుల— హృదయేశ్వరా ! ఆమాటల నెత్తకుము అది నావిధిపరిపాకము. కాకున్న నింత కరుణాకోమలుఁడవు నీకుఁ గారిన్య మెచ్చటిది ! హా ! యెంత సుదినమిది !

విష్ణు— (స్వ) పాపము ! ఈకాంత యిది సుదిన మనుకొనుచున్నది. నిశ్చయముగ నిది దుర్దినము ! ఈగరితకేగాదు—నాకును—

గీ. ఎన్నినాళ్ళనుండియొ యభి ♦ వృద్ధిగాంచు
నంగన పతివ్రతాత్వ మ ♦ డంగు నేఁడు
ప్రాజ్ఞతతిఁ గాక నజ్ఞుల ♦ వలన నైన
మామకయశమ్మునకుఁ గల్గు ♦ మచ్చ నేఁడు.

దేవీ! నీపతిభక్తి నెంతని సంస్తుతింతు? నేఁడు నేను దానవద్దానవ ద్విపహార్యక్షుండగు ఫాలాక్షుని బారినుండి బ్రతికి వచ్చుటకుఁ గారణ మేమనుకొనుచుంటివి?

గీ. హరిహరబ్రహ్మ లొసఁగిన ♦ వరపరంప
రలవలనఁ గాదు శంఖము ♦ వలనఁ గాదు
తావకీన పతివ్రతా ♦ త్వప్రభావ
మున నె బ్రతికినవాఁడ నం ♦ భోజనేత్ర!

తుల— ఆర్యపుత్రా! నిన్ను వేఁడుకొనెదను. నన్నుఁ గూర్చిన ప్రశంస మానుఁడు. (గడ్డముంటి బ్రిదిమిలాడును.)

విష్ణు— ప్రియా! ఏమి నీ సౌశీల్యము!

(ముద్దుఁ బెట్టుకొనును.)

యవనిక జాఱును.

తొమ్మిదవ రంగము - యుద్ధభూమి.

[విల్లునమ్ములు, ఖడ్గము దాల్చి జలంధరుఁడు ప్రవేశించును.]

ఓరీ! కంఠేకాల! నీచాత్మ!

గీ. పాఱిపోయితి వేమిరా ♦ ఫాలనేత్ర!
దేబవైతి విదేమిరా ♦ త్రిపురదమన!
ఆలిఁ జూచి రాఁబోయితి ♦ వా దురాత్మ!
కదలిరార! రక్తముఁ జూతుఁ ♦ గన్నులార.

చీ ! పిఱికిపందా ! ఎదుఁ బోయితివి ? నీవు డాఁగిన నీ మృత్యువు డాఁగుననుకొంటివా ?

మ. శతపత్రేక్షణుఁ బంపి నాకడకు న ♦ స్మచ్ఛంఖముంగొంటి, దు
ర్గతి యింకేలర యోరి ! పర్వతగుహా ♦ పాళిందంబులఁ డాఁగ, మ
చ్ఛతకోటి ప్రతిమాన ఘోరశరముల్ ♦ శైలమ్ముతో నిన్ను నీ
పతి నీభృత్యులనొంచు, డాఁగిన నినున్ ♦ సాధింపకే పోమనే !

పర— (ప్రవేశించి) దురాత్మా ! జలంధరా ! ఇఁకఁ గాచికో !

చ. అతివ పతివ్రతాత్వ మది ♦ యడ్డగుటన్ నినుఁ జంపకుంటి దు
ర్మతి ! మితిమీరిపోయితివి ♦ మానిని భంగము వొందెనింక, నీ
గతిగనుఁగోర ! నీవు పద ♦ కంజములన్ బడివేడినన్ రమా
పతియు, నజుండు నడ్డుపడ ♦ వచ్చినఁ దప్పదు చావు నీకిటన్.

జలం— ఏమిఁరా ! మానిని భంగమువొందుట యేమిరా ! నీచాత్మ ! నీ సతివలె నాసతి దుశ్చరితకాదు. అయిన దానిపాతివ్రత్యము నన్నుఁ గాచుటయేమి ? వృథావాగ్వాదమేల ? కాఁచికో !

(ఖడ్గము విసరును.)

పర— (తప్పించుకొని శూలముతోఁ బొడుచుచు నెట్టుకొనిపోవును.)

(తెరలోఁ గలకలము.)

హా ! ప్రియశిష్య ! దనుజవంశోద్ధారక ! జలంధరా !

[ప్రవేశము—జలంధరునిశిరముతో శుక్రుఁడు దుఃఖించుచు]

హా ! ఈదివ్యు లెంతమాయచేసిరి ! ఔరా ! ధర్మరక్షణ పరాయణుఁడు నారాయణుఁ డిట్లుచేయునే ! కానీ ! నారా యణుఁ డిందులకుఁ బ్రతిఫలము నందుఁగాక !

ఈశిరముం గొనిపోయి యామాయలాడి భర్తగా విశ్వ సించి విహరించుచున్న తులసీదేవికిఁజూపి యావద్వృత్తాంతము నివేదింతుగాక ! హా తల్లీ ! తులసీ ! నీ వన్నంతయే యయ్యె.

తుదకు నీవిభుని శిరమే గొనివచ్చుచుంటిని. (ధ్వనియగును.)
ఓహో! యెవ్వరో వచ్చుచున్నారు. దివ్యులేరైన నీశిర
ముఁ జూచిన నపాయము రాఁగలదు. ఇంక నిందుండరాదు!

(నిష్క్రమించుచున్నాఁడు.)

### పదియవ రంగము—శయ్యాగృహము.

[ప్రవేశము—జలంధరరూపముతో విష్ణువు-తులసీదేవి]

తుల— మనోరమణా! నా కర్కశబాహుమధ్యమున మిగుల నలసితిరి. ఇంతక్షీరము గొనివత్తు, త్రావి నిదురింతురుగాని!

విష్ణు— ప్రేయసీ! నీ యధరామృతముండ క్షీరమేల? అక్కఱలేదు. మఱియు,

గీ. నిరుపమకవీంద్రవిరచిత ♦ సరసకావ్య
మాత్మకరపద్మమునయందు ♦ నలరువేళ
వలపుఁ బ్రియురాలు దనదండ ♦ వఱలువేళ
నాకలియు నిద్దురయు నేటి ♦ కలసగమున!

తుల— పోనిందు. కొంచెము విసరెదను.

(పైటచెఱఁగున విసరుచుండును.)

విష్ణు— (కనులు మూసికొని యోజించుచు.)

ఆ. ఏను దెఱవఁ జెఱచు ♦ టెఱిఁగి జలంధరు
శిరము నఱికినాడు ♦ హరుఁడు కలన
తచ్ఛిరమ్ముఁ గేలఁ ♦ దాల్చి దైత్యగురుండు
నచ్చె మిగిలియున్న ♦ పనిని దీర్ప.

[జలంధరుని శిరముతో శుక్రుఁడు ప్రవేశము.]

శుక్రు— (చూచి) హా! తల్లీ! నాకన్నులు చూడలేకున్నవి. ఆ మాయలాడి చెంతనుండి లెమ్ము.

తుల— (లేచి) ఆ! ఆ! ఇదియేమి!

శుక్రు—ఇది నీభర్త శిరమమ్మా! ఆతఁడుమాయలమారి విష్ణుదేవుఁడు.

తుల— ఆ! ఆ! (శయ్యవంకఁ జూచును.)

విష్ణు— (తనరూపము దాల్చును.)

తుల— హా! (మూర్ఛిల్లును.)

విష్ణు— భార్గవా! నీ వచ్చిన పనిసైనది కాదా?

శుక్రు— మహానుభావా! నీ వచ్చిన పనిమాత్రము గాలేదా?

విష్ణు— ఏది? ఇంకఁ బాషాణము గావలదా?

శుక్రు— (ఇంచుక యూరకుండి) ఇదియంతయు నిట్లుగావలసియున్నది. దేవా! అపరాధిని. నన్ను మన్నింపుము.

విష్ణు— దనుజాచార్య! ఇదియంతయు నిట్లు గావలసియున్నదని నీవే యంటివి కాదా? ఇం దెవరి తప్పును లేదు.

శుక్రు— అనుగ్రహింపఁబడితిని.

(శిరము దులసిచెంత నిడి నిష్క్రమించును.)

తుల—(మూర్ఛదేఱి) హా! భువనైకవీరా! మనోహర! దానవసార్వభౌమా! ఎంత యన్యాయము జరిగినది!

(మూర్ఛిల్లును.)

తుల— (లేచి)

మ. హృదయేశుండు సమిత్స్థితిన్ దొఱఁగి దానే తెంచె వం చెంచితిన్
సదయుండై నను జేరఁదీసె ననుచున్ స్వాంతంబునన్ బొంగితిన్
సుదినంబంచుఁ దలంచితిన్ గటకటా! శోకమ్ము వోనాడితిన్
దుది నిట్టాట యొఱుంగ మాధవుఁ డిటుల్ ద్రోహమ్ముగావించెనే!

సీ. విభుఁడు సమిత్స్థితి విడిచి వచ్చెనటంచు
సకిచెప్పఁ బొందిన సంతసమ్ము

అక్షిపర్వమ్ముగ ♦ నాత్మేశు రూపమ్ము
గనుఁగొన్న తటిఁగన్న ♦ కడిఁదిమురిపె
మభివందనము సేయు ♦ హస్తపల్లవముల
తో నెత్తఁగన్న సం ♦ తోషకలన
తొడలపై నిడుకొని ♦ తోరంపు నుడువుల
నాడుచోఁ గాంచిన ♦ యట్టిముదము

గీ. మోవి మోవినిఁ జేర్చుచు ♦ ముద్దులాడి
యొడలి నొడలిని గలుపుచో ♦ నొందినట్టి
పారవశ్యము, నిట్టిదే ♦ పాపి దైవ
మా! యెఱుంగక చెడితి నీ ♦ మాయఁబడితి.

విష్ణు— అలివేణీ! శోకింపకుము.

తుల— దేవ! మహానుభావ! శోకింపకు మనుచుంటివా? నీవు చేసిన మే లింతకన్న నేమి?

సీ. పెండ్లినాటంగోలెఁ ♦ బ్రియుని దైవమటంచు
నాత్మ బూజించిన ♦ యందులకును
నన్నువిభుం డొల్ల ♦ కున్న మాంగల్యమ్ము
నరసి జీవించిన ♦ యందులకును
కలనైన విభునకు ♦ గలుగునో సిలుగంచు
యడలుచు నొప్పిన ♦ యందులకును
పతిఁగావరే రమా ♦ వర! హర! యని మిమ్ము
డెందమ్మున భజించి ♦ నందులకును

ఆ. కడకు నిదియుకాదె ♦ కమలాప్రియా! నాకు
నీవొసంగు ఫలము ♦ నీవొసంగు
కడిఁదివరము; నన్ను ♦ కబళమ్ము నర్పింప
విషమొసం గూర్చిరి ♦ విధిని నకట!

ఓపరాత్పరా ! ఎంతయన్యాయ మొనర్చితివి ! ఎంతద్రోహము దలంచితివి ! అమలినంబగు నా పాతివ్రత్యమును, నిరుపమానమగు నాశీల్యమును మంటఁగలిపితివే ! పరమపతివ్రతను, నిరంతర భర్తృపదారవిందధ్యానరతను, నన్నొకక్షణమున స్వార్థపరుండవై కులటం గావించితివే ! నిన్నేమని నిందింతు ! నా దుష్ప్రాప్తికి, నాదుర్గతికి నెంతనివగతు !

ఉ. ఎంతటి దుష్కృతింజలిపి ♦ తేమున, నిన్ను రమామనోహరా !
యింతటి దౌష్ట్యమే, యకట ♦ యింతటికౌర్యమె! యేటికయ్య దు
ర్దాంత పతివ్రతాత్వ మది? ♦ ధర్మపదం బదియేల? యేల నే
దాంతములన్ దురంతము? లటంచు వచింపఁగరాదు యాపయిన్?

విష్ణు— కాంతామణీ ! నాపలుకుల నించుక యాలింపుము.

తులసి— (వినిపించుకొనక) దేవా ! పరమేశ్వరుండవే ! సకలవిబుధనికరవంద్యుండవే ! జగత్కారుణుండవే! దుష్టశిక్షణ శిష్టరక్షణదీక్షాబద్ధకంకణుండవే ! నీవా యిట్టిపనికి గడంగుట ? నీవా యిట్టి నీచకామమునకుఁ జిక్కుట ?

చ. పరమపతివ్రతామణులఁ ♦ బట్టి దురాత్ములు భంగపెట్టుచోఁ
బరువిడి వచ్చిప్రోచెదు కృపాపరతంత్రుఁడ వీవ ! దేవ ! యి
ప్పరుసున ధర్మ మగ్గి నిడి ♦ భంగమొనర్చితి సత్పతివ్రతన్
హరిహరీ ! యింక దిక్కు గలదా సుచరిత్రల కీ జగత్త్రయిన్?

అక్కటా ! కన్నతండ్రియే కసిగందు మెడఁ బిసికి చంపినట్లు, ఆలకాపరియే గోవు కత్తుకఁ గొఱకొఱఁ గోసినట్లు, జగద్రక్షకుఁడవు నీవే యీ దీనురాలిని, ఈ యమాయకురాలిని, ఈ దిక్కులేని యకించనురాలిని భంగపెట్టుదువే! అయ్యయ్యో ! నీ వినిర్మలకీర్తికి, నీ యార్తరక్షణాంకమునకు, నీ ధర్మసంస్థాపన పరాయణత్వమునకు, నీ సృష్టికే భంగము గలుగుననినైన యోజింపకపోయితివే.

సీ. భగవంతుఁడవు నీవ ♦ పాపంబనక దేవ !
యింతద్రోహము సల్పి ♦ తింకపైని
అఘమున నేమి ? పుణ్యాంబన నేమి? దు
ష్పథమన నేమి ? సత్పథమనంగ
నేమి? యేమిటి కింక ♦ నీమమ్ము వోనాడి
సంచరింపఁగరాదు ♦ సర్వజనులు ?
నీచరిత్రము విన్న ♦ నీచులు సాధ్వీమ
ణుల భంగమొనరింపఁ ♦ దఁలఁతువారో ?

గీ. తలఁక కటు భంగపెట్టిన ♦ తగుదునంచు
నేమొగంబున శిక్షింతు ♦ వీవు వారిఁ?
దెలిసి సృష్టికే భంగము ♦ దెచ్చిపెట్టి
కొంటివయ్య ! మోహమ్మెంత ♦ గూర్చెనయ్య !

విష్ణు — కాంతామణీ ! నిన్నుఁ జెఱచుటకుఁ గారణము మోహము గాదు సుమా !

తు.ల — ఏమి ! దేవదేవా ! మోహము గాదనుచుంటివా ? అగు. నీ మాట నిక్కమేయైయుండును. ఇదియు నాతలవ్రాతయే.

ఉ. నీవు పరాత్పరుండవు, వి♦నిర్మల ధర్మరతుండ వాపయిన్
దావక పుత్త్రుఁడెల్లర కె♦దన్ దమకమ్మును గూర్చు మారుఁడున్
నీవనజాతనేత్ర రమ♦ణీమణియా రమ, యిట్టి నీకహో
దేవ ! యిఁకేమి మోహము, మ♦ఱేగ గన నియ్యది నాదుప్రాప్తియే.

కాని పరమేశ్వరా ! ఇట్టి ఫల మనుభవింపఁజేయుటకుఁ గారణముండ వలయుఁగాదా ? దయచేసి చెప్పుము.

విష్ణు — అలివేణీ ! ఆలింపుము. నేను దుష్టశిక్షణ శిష్టరక్షణ దీక్షాబద్ధ కంకణుండనని నీవ చెప్పితివికదా ! అగుదు. కావుననే దుష్టుఁడును లోకద్రోహియు నగు నీ ప్రాణేశ్వరుని జంపి, శిష్టులగు

సురలఁ, దక్కినలోకుల రక్షించుకొనుటకు నీ పాతివ్రత్య మొక
త్రోయరాని యవరోధమగుటచే నిట్లు చేసితి. మఱియు—

తుః— లక్ష్మీనాథా! నాప్రాణేశ్వరుఁడు దుష్టుఁడా? సురలు శిష్టులా?
ఏల? వారిరాజ్య మాక్రమించుకొనుటచేతనా? భుజాబలంబున
నరులఁ గెల్చి వారిరాజ్యము గైకొనుట శూరధర్మముగాదా?
అక్కటా! దేవదేవ! నీ వెంత సురపక్షపాతివి!

గీ. సురల శిష్టులు? తక్కిన ♦ నరు లసురులు
దుష్టులని నీకుఁ దోఁచినఁ ♦ దోయజాక్ష!
వారితోఁ గుల్కరాదె? యి ♦ ర్వారి సృష్టి
సేయ నేల? ధర్మువు పేసి ♦ చెండ నేల?

విష్ణు— కాంతామణీ! నీవు నిక్కమెఱింగియుఁ బత్యభిమానంబున నిట్లు
పలుకుచుంటివి. భుజాబలంబున రాజ్య మార్జించుట ధర్మమే
అంతట నూరకుండెనా నీనాథుఁడు? సాధుజనుల నెందఱ
బాధింపలేదు? సాధ్వీమణుల నెందఱఁ జెఱపట్టలేదు?

తుల— ఆర్యా! నా ప్రాణేశ్వరుఁడు సాధ్వీమణులఁ జెరపట్టినందులకు
దుష్టుడయ్యెనా? చెరపట్టెనేగాని, భంగపెట్టలేదే? ఇట్టి మా
యవేషములు దాల్చి యే కాంతనైన నన్యాయ మొనర్పలేదే?
అట్టి నీచపుఁగార్యము లొనర్చిన మొదటివాఁడు నీయింద్రుఁడు.
ఆతఁడు గౌతమాంగనఁజేసిన తెఱంగు నీవెఱుంగుదువు. రెండవ
మహానుభావుఁడవు నీవు! ఇట్టి వంచకులు—మీరు సురలలోని
వారు గావున శిష్టులు, చాలు ఓసురపక్షపాతీ! ఓయధర్మకార్య
పరాయణా! నీవు నిశ్చయముగ ద్రోహివి. ఇట్టి నిన్ను నమ్మి
లోకులు మోసపోవుచున్నారు. అది యటుండ నీవు నన్ను భంగ
పెట్టుటకుఁ జూపిన కారణ మెంత బాగుగనున్నది? నా నాథుఁ
డొకవేళ దుష్టుఁడే కానిమ్ము నీకంటెకి—అయిన నా నాథుని

శిక్షింపవలయుఁగాని యీ నీచకార్య మేమి? ఈ దొంగవేస మేమి? తల్లియావు తప్పుఁజేసెనని లేఁగను శిక్షింపవలసినదా? లోకులమేలుకొఱకు చేసితి నందువు కాఁబోలు? అదియైన నేమి సమంజసముగ నున్నది?

గీ. లోకులకు మేలుసేయుఁగ ♦ లోఁ దలంచి
చెఱతువే దేవ! పావన ♦ శీల నన్ను
లోకులకు మాంసము నొసంగ ♦ లోఁ దలంచి
సాధుమృగమును జంపుట ♦ చనునఁటయ్య!

అయినఁ గటికివాఁడు గూడ నినుఁబోలు లోకోపకారియే.

విష్ణు— అతివా! నాచెప్పువాక్యముల సాంగముగ నాలింపక నీవు నన్ను దూషించుచుంటివి. నీ కిట్టి దుస్థితి గలుగుటకు నీనాధునిమాట యటుండ ముఖ్యముగ మఱియొక కారణమున్నది. ఆలకింపుము. పూర్వజన్మంబున నీవు తులసియను దేవకన్యవు. లక్ష్మీదేవికిఁ జెలికత్తెవు. నన్నుఁ బొందఁగోరి పెక్కువత్సరములు తపం బొనర్చితివి. అయిన నాజన్మంబున నీ కట్టిప్రాప్తి లేదనియుఁ బిమ్మటి జన్మంబున నట్టి భాగ్యము నీ కబ్బుననియు నీకు వర మొసంగి నీతపము నాపించితి. కాని యప్పుడు నీకు నాయెడఁ గల మోహామూఁపరాక యుండెను. దానంజేసి నీవు నన్ను మోస ముననైనఁ దలియఁగోరి, యొకనాఁడు నేను శయ్యాగృహ మున నుండఁ బద్మాలయ లేకుండఁజూచి యకాంతరూపున నచ్చుటకు వచ్చితివి. మోసము గ్రహించియు నేను నిద్రితుని వలె సెజ్జపైఁ బరుండి మాటాడకయుంటిని. నీవు నన్ను లేపఁ బ్రయత్నించుచుంటివి. ఇంతలోఁ గమల యచ్చటకు వచ్చెను. నిన్నుఁజూచి. మోస మొనర్చి నన్నుఁ గూడితివని తలంచి లక్ష్మీ దేవి కోపంబున "ఓసీ! పాపాత్మురాలా! నాకుఁ జెలివై యుండి

యెంత చేసితివి! ఇందులకుఫల మనుభవింపుము. నీవుదానవునకుఁ బుట్టి, ఇష్టములేని నిన్ను బలవంతమున భంగపెట్టప్రయత్నించి నాచే మున్ను దానవుఁడై పుట్ట శపింపఁబడిన సుదామున కిల్లాలి వయ్యెదవుగాక! మఱియు నీభర్తరూపమునఁ బరుఁడొకఁడు నినుఁగూడి నీ పాతివ్రత్యముఁ జెఱచుగాక! ఆపై భూలోకమున నొక వృక్ష మయ్యెదవుగాక" మని కూ్రరముగ శపించె. తరువాత నీవు తప్పు నొప్పుకొని శోకించుచు మన్నింపుడని నన్నును బద్మాలయను పాదములఁబడి వేఁడికొంటివి. కమలయుఁ బ్రసన్నురాలై నిన్ను శపించినందులకుఁ బశ్చాత్తాపమందె. నేనును గరుణాంతరంగుండనై, శాప మనుభవించి తీరవలయు. అయిన సుదాముండు నీకు భర్తయయ్యెఁ గొండొకకారణమున నిన్నొల్లకయుండుననియు, నీకన్యాత్వము చెడకుండుననియు, గొన్నాళ్ళకుఁ పిమ్మట నేనేనీపతిరూపఁబున వచ్చి నిన్ను భంగమొనర్చెదననియు, నంతట నీవు చితిఁజొచ్చి, లోకంబున వృక్షమై పొడమి సర్వజనులచేఁ బూజింపఁబడెదవనియు, నానతిచ్చితి. దాననే నీ కిట్టి భంగపాటాదవె. పూర్వజన్మంబున సుదాముండగు జలంధరుఁడు నీభర్త నిన్నొల్లకయుండుటకుఁ గారణము నిదియే. ఇదియంతయు సత్యము.

(నేపథ్యమున నానావిధ కంఠస్వరములతో)

సత్యము ! సత్యము !

విష్ణు— వింటివా ! సర్వభూతములు నామాటలు సత్యమని వాకొనుచున్నవి. ఇప్పటికైన నామాటలు నిక్కములని విశ్వసించితివా !

తుల— పరాత్పరా! విశ్వసించితిని. సత్యస్వరూపుఁడవు నీ వబద్ధమాఁడెదవా ! మఱియు న్యాయాన్యాయవిచక్షణదక్షుఁడవు నీవు

నిష్కారణముగ నెట్టిప్రాణికైన శిక్షింతువా ! ఇది మత్పూర్వ జన్మకృత దోషఫలము. నా దురదృష్టము.

(జలంధరుని శిరము జూచి శోకముతో) హా ! ప్రాణ నాథా ! దానవసార్వభౌమా ! నీ కెట్టిగతి పట్టినది.

(అనుబంధము 14.)

ఆ. వె. వలదు వలదు శివుని ♦ పట్టపుదేవిని
వలచు టది యఘంబ ♦ పాయకరము
వలదు వలదు కలను ♦ వలదన్న వినవైతి
తుదకు నిట్టులైతి ♦ హృదయనాథ !

సీ. నాపాలిదైవమ్ము ♦ నాపెన్నిధానమ్ము
నామనోరమణుండు ♦ నాప్రియుండు
నాప్రభుం డింతకు ♦ న నొల్లకుండిన
నెన్నటికే నొల్ల ♦ డే యటంచు
నడియాసఁ గొన్నాళ్ళు ♦ గడపితి, నయ్యాస
యడుగంట హృదయేశు ♦ నండనుండు
నట్టిభాగ్యంబున్న ♦ నదె చాలు ననుకొని
గడపితిఁ గొన్నాళ్ళు ♦ గడకు విడువ

గీ. అఖుత మాంగల్య ముండిన ♦ నదియు చాలు
ననుచుఁ గడపితిఁ గొన్నినా ♦ ళ్ళకట ! నాథ !
ఏమియాసఁ గడపుదాన ♦ నింక నుసురు
నేమి చూచికొనుచు భరి ♦ యించుదాన ?

హా ! ప్రాణేశ్వరా! ఈరమానాథుఁడు సాధ్వినగు నన్నుభంగపెట్టి నిరప రాధుని నిన్ను మానాథునిచేఁ జంపించునే ! (కోపావేశమున నొడలె ఱుంగక) ఓలక్ష్మీమకళత్రా! దానవవైరీ! సురపక్షపాతీ! పాషాణహృద యుండవై మా కొనర్చిన యన్యాయమునకు ఫల మనుభవింపుము.

నీవు పాషాణహృదయుండవై నన్ను భంగమొనర్చితివి. కాన నందు
లకుఁ దగినఫల మనుభవింపుము.

సీ. అమలపతివ్రతా ♦ త్వమున నొప్పెడుకాంత
భంగపెట్టుట మహా ♦ పాపమేని
పరులకోసంబైనఁ ♦ బాపకార్యంబును
గావించుటయు నొక ♦ కలుషమేని
పాపకృత్యము సేయు ♦ భగవంతుఁడైన శి
క్షార్హుండగుట నిక్క ♦ మగునయేని
ధర్మంబునందును ♦ దనరెడు దైవమ్ము
ననుమాట నిశ్చయం ♦ బౌనయేని
గీ. పతియటంచు భ్రమను బొంది ♦ పరునిఁ బొందు
పడఁతి నరకకూపమ్మున ♦ బడదయేని
తత్పతివ్రతాత్వం బెల్లఁ ♦ దగ్గదేని
అంబుజేక్షణ! పాషాణ ♦ మగుదుగాక!

(విష్ణువు పాషాణమగును.)

తుల— హా! ఇదియేమి! నే నేమిచేసితిని? కోపావేశంబున నొడలెఱుంగక యీమహామహుని శపించితినా? శపించెదఁగాక! ఆశాపము నెఱవేఱుటయెట్లు? నా పాతివ్రత్య మడుగంటుటంబట్టియే కదా నా నాథుఁడు గతించె. తిరిగి నాకింతమహిమ మెట్లుగలిగె? హా తెలిసె. ఇందులకుఁగారణ మీ జగత్కారణుని ధర్మరక్షణాసక్తియేగాని నాశక్తిగాదు. ఓ కమలాప్రియా! పరమకరుణానిధీ!

గీ. పొరఁబడియెఁగాని నిక్కంబ ♦ పూతచరిత
తులసి సాధ్వి యనెను మాట ♦ నిలుపుకొఱకు
అంబుజేక్షణ! పాషాణ ♦ మైతివయ్య
నీవు ధర్మబద్ధుఁడవంట ♦ నిక్కవంబు.

అక్కటా! ఇట్టిధర్మబద్ధుని ని న్నన్యాయముగ శపించి యెంతటిపాపమున కొడిగట్టితి! దేవా! నన్ను క్షమింపుము.

[ప్రవేశము: దివ్యులు, లక్ష్మీదేవి.]

లక్ష్మి—అమ్మా! క్షమింపవలసినదానవు నీవు. నాకుఁ బతిశిక్ష పెట్టవలసినదానవు నీవు. (పాదములఁ బడఁబోవును.)

తుల— (ఆపి) అమ్మా! పద్మాలయా! నే నెంత! నా ప్రభావ మెంత ఇదియు నామహాత్ముని ప్రభావమే.

లక్ష్మి— తల్లీ! అటులే కానిమ్ము! తన్ను శపించుటకుఁ దగిన ప్రభావ మొసంగి మాకరుణానిధి శాపము గ్రహించుటకు మాత్రి మొసంగఁడా! కానఁ గరుణింపుము.

తుల—జగజ్జననీ! నేను నన్ను భంగపెట్టుటలో శ్రీహరితప్ప లేదనితన్ముఖంబున విని విశ్వసించియుఁ, గ్రోధావేశంబున నోడలెఱుంగక శపించితి. ఇట్టి నే నామహనీయుని మో మెట్లుచూతు? అయిన నేనిప్పుడు చితింజొచ్చెద. ఆవల నమ్మహాత్ముఁడు తులసి సాధ్వి యను మాట నిలుపుటకుఁ బాషాణమైనట్లు, ఆమాట మఱియు నిర్ధారించుటకుఁ దనరూపముఁ దాల్చుఁగాక!

దివ్యులు— అనుగ్రహింపఁబడితిమి.

తుల— దాసీ! నాకుఁ జితిం బేర్పుము.

[నేపథ్యమున—చిత్తము.]

తుల— (జలంధరుని శిరమునఁజూచి శోకముతో)

గీ. ప్రాణనాయక! ని న్నింత ♦ వటుకు నంటి
యెఱుఁగ నపవిత్రనై స్పృశి ♦ యించుచుంటి,
ఇట్టి నాయఘంబును క్షమి ♦ యింపు మిప్పు
డేని యంటక యెట్టు త ♦ రింతు నేను?

(శిరముఁ జేతదాల్చును.)

[నేపథ్యమున]

అమ్మా ! చితి సిద్ధమైనది.

తుల— ఇదిగో ! నేనును సిద్ధముగనే యుంటిని.

గీ. ప్రాణనాయక! నీతోడఁ ♦ బాన్పునందు
ఏను శయనించి యెఱుఁగ నే ♦ యెడనునైన
భగ్గుభగ్గున మండు నీ ♦ యగ్గిలోనఁ
గలుపుచుంటి నీతోడ నా ♦ కట్టె నిదిగో!

తండ్రీ! సర్వభక్షకా! వీతిహోత్రా!

ఆ. పతికిఁ బనికిరాక ♦ పతితమై, పరునిచే
మఱియుఁ బతితమైన ♦ మచ్ఛరీర
మదిగో! వేల్చుచుంటి ♦ ముదమున నపవిత్ర
మనక కృపభరింపు ♦ మయ్య ! తండ్రి !

(నిష్క్రమించుచున్నది.)

దివ్యులు— హా! హా! తులసీదేవి భస్మమైపోయినది. తల్లీ ! సాధ్వీమ తల్లీ ! ధన్యవు.

విష్ణు— (స్వరూపముఁదాల్చి) తులసీదేవి చితింజొచ్చి ధన్యురాలైనది. ఈవరారోహచరిత్రము ప్రస్తుతిపాత్రము. ఈసాధ్వీసమాధిపై నొకమొక్క మొలచి యీతులసిపేరఁ బరఁగుఁగాక! ఆతులసీ వృక్షము భక్తజనులపాలి కల్పవృక్ష మగుఁగాక ! మఱియు,

గీ. మహితసుమమాల్యమునకన్న ♦ మంచిముత్తె
ములసరమ్మున కన్నను ♦ భూరిరత్న
హారమునకన్న మాకుఁ బ్రి ♦ యంబుగూర్చి
వెలయుఁ గావుత మీపైని ♦ తులసిమాల !

మఱియు,

సీ. అడవులు, మృగములు, ♦ నవనీరుహంబులు
వల్లెలు, గ్రామముల్ ♦ పట్టణములు
ఘనదేశములు, నవ ♦ ఖండముల్, జనములు
పసులు, సూర్యాచంద్ర ♦ మసులుఁ, జుక్క-
లాశలు; గగనంబు, ♦ నండజమ్ములు, నదీ
నదము, లంబుధులు, ర ♦ త్నములు, జలచ
రమ్ములు, శైలముల్, ♦ రక్కసుల్, బ్రహ్మాది
సర్వసుపర్వాణ ♦ సంచయమ్ము—

గీ. ఇన్నిటింబెట్టి దూచిన ♦ యేని లేవ
బోని కమలాహ్వాదీశుఁ ♦ డీప్సైని మ్రొగ్గు
సత్యము తులసినైనఁ ద ♦ చ్ఛాఖనైనఁ
దద్దళమునైన నిడినంత ♦ దక్షణంబ.

గీ. గుడులు గట్టుకంటె ♦ మడువులఁ ద్రవ్వించు
కంటె, వనము వేయు ♦ కంటెఁ, గృతుల
నందుకంటె నరయ ♦ నధికపుణ్యప్రదం
బగును దులసినాటు ♦ టవనియందు.

సీ. తులసీతిరువు నింటఁ ♦ గలుగువారిగృహంబు
పద్మాలయకును ని ♦ వాసమగుత!
తులసినిబూజించు ♦ చెలికి సువాసినీ
త్వమ్మును సౌఖ్యంబు ♦ దనరుఁగాత!
తులసీవనము వేయు ♦ నలఘుపుణ్యాత్ముల
కాయువు సిరులును ♦ నలరుఁగాత!
తులసిని నన్నగాఁ ♦ దలఁచి భక్తుండు సే
వించి యంచితముక్తి ♦ గాంచుఁగాత!

గీ. మరణసమయమందు ♦ గరిమెడు తులసితీ
ర్థమ్ము పోయఁబడిన ♦ ప్రతిజనుండు
క్షాళితాఖిలాత్మ ♦ కల్మషుండై నాదు
పాదసన్నిధికిని ♦ వచ్చుఁ గాత!

బృందారకులారా! ఇంక మీకుఁ గావలసిన దేమి ?

బ్రహ్మ — మహాత్మా! నీ యనుగ్రహంబున లోకద్రోహి జలంధరుం డడంగె. లోకులకు మేలు చేకూరె. ఇంద్రాదులు కారనుండి యీవలకువచ్చిరి. ఇంకఁ గావలసిన దేమి? అయిన నిట్లగుగాక

చ. చలమున నీ జలంధరుని ♦ చందమునన్ బ్రజఁ బాపమెంచకే
సిలుగులు పెట్టు భూమిపతి ♦ శీఘ్రమ నాశన మందుఁగావుతన్ !
దులసియుఁ బోలెదైవమని ♦ తోరపుభక్తిని భర్తఁగొల్చుచున్
బాలిచెడు పూవుఁబోడికిని ♦ బొందకయుండుత మెట్టి బాములున్.

విష్ణు — తథాస్తు !

సంపూర్ణము.



# అనుబంధములు.

[సోమరాజు రామానుజరావుగారిచే రచియింపఁబడినవి]

## 1. బ్యాగ్—ఆది.

జలం—ఓహో యికనే । నిలువక చనియెదగా । రయముగా॥ఓ॥

ఇలగలిగిన ధరాధీశ్వరులు విస్మయానుమతులై మతులధరఁ । ఖలులై యమరేశ్వరు దూర్జితదర్పము చేతను మైమరచెనుగా నేడో హో॥

నిరంతరణంబు నొనర్చెదన్ । నిజార్యులకు సంతస మిడెదఁ జలంధరుం । దను యుశమున్ । దిశలెల్లను నిం । పెదగనుడీ॥నేడో హో॥

---

## 2. జయంత శ్రీ - ఆది.

జలం— జనకా । వలదికా॥జన॥

ఈజలరుహాలోచన । సతిగాగాంచుటల్ । తొలు దొలుతనె పరిణయమున । విలసితసుమహారము నిల । బడనేసిన పరమదుష్ట భావనమది గోరనగునె ॥జనకా॥

---

## 3. బ్యాగ్—త్రిశ్రిగతి.

జలం__ఓసీ యవిధేయురాల । యోసీ యహంకారచిత్త । వీసము నిను దయదలచుట । మోసమహా । దోసమహా ॥ఓసీ॥

ఖలమతి నాతోనాడా । చలము వహించితిగాదా । అరయ నీపాణిగ్రహణము సేయుట పాపమయ్యె ॥ఓ॥

సురవిజేత । నయి యతీత । భరము దాల్చియుంటిగా । నిరుప
మాస్వయము గళంక । మగునటుసలిపితి । మాగువరో ॥ఓసీ॥

---

4. భాగేశ్వరి—త్రిశ్రగతి.

తులసి— అఅఅఅఅఅహృదయేశ్వర నను దయగనుమా ॥అ॥

మీచరణము లంటి వేడుదాననో దయాకరా మోచనసలుపకవి
రోషమెనరుపదగునా ॥అ॥

కరుణదలపుమా । నామనవి వినుమా । ధరణియు నభములు
సాక్షిగ దలచి మిముభర్తగా ॥అఅఅ॥

---

5. తోడి - ఆది.

తుల—సుగుణాన్వయభరణా । భాసురవరచరణా ।సు॥

పగమీరక । ననుఁగనుట । భావ్యంబా । శుభచరితా।

జలం—శిలాత్మురాలవు । దురాత్మురాలవు । పిశాచినీ నిను క్షమింతు
నా । కులంబు నిట్లాకులంబు జేయక । దలచితివిగా । ఖల
మతివిగా । నిజము వేగా । శిరమును దునిమెద॥

తుల—నాయందున ప్రేమను గనుమా । న్యాయమైన మార్గము
వినుమా । అబలామణి నిటు లార్తినిడక మనుమా । జన దూ
షితమయిన పనులు విడుమా ॥సుగు॥

జలం—ఊరకయుండిన కారులు ప్రేలెదవా । దురితాత్మక కావరమా ।
కాలుని పాలునికి నంపెద జూతుము । నీరుధిరము । నదముగ
నిదెజనగా ॥

తు—సుగుణాన్వయభరణా॥

### 6. బ్యాగ్—ఆదితాళం.

జలం—ఎంతటిపనిగావించె శచీపతి ।
సుంతయైన నే దెలియను నారద ॥యెంత॥
పంతమునను నారదానికన్ జెర ।
బట్టగ నెట్టుల సెంచెదలంచెను ॥యెంత॥
వానికంతమును మనాదున్కలుగ । ఖండించెద దండించెదగా ।
యక్షుల సిద్ధుల సాధ్యుల నెల్లరశిక్షించెద పరిమార్చెద తీర్చెద ॥ఎంత

---

### 7. కాంభోజి—ఆదితాళం.

తులసి—వినుమాసురనాథా । వినయమునను నినువేడెద మనమున ॥వి॥
ఆసురమగుపనియిదిగాదా । నీ సము లిటుసలుపుటమేలా । వా
సవ నీయశమదిపోదా ॥విను॥

---

### 8. బ్యాగ్—ఆదితాళం.

జలం—ఓరెదురాత్మా। ధీరుడవైనా। యువిదను తులసిని జేరితివా ॥ఓరి॥
కారులుపేల్చెలకురా నినురయమున । ఖండించెదరా । యూరా
రా॥ఓరి॥

క్రూరముగా ధరణికి భారముగా। రాక్షసవైరముగా । ఘనరిపు
హారముగా । సారపరాక్రమవిక్రమసంయుత । జాలంధరు మరిమర
చితివా ॥ఓరి॥

---

## 9. బ్యాస్—ఆదితాళం.

జలం__ఓరీశైలవిదారీ మిమ్మువధించెదరా । బంధించెదరా ॥ఓరీ॥

కార్యము గాదిది సురాకలశమును గడురయమున నర్పించుట హితమగు ॥నోరీ॥

అన్యతలాపము లాడుట తగదిక । నదను గతించెను మించెనురా। నరయుంబుగ్గనే । నడిగెదనిపుడే । సమర్పింపదగునో చెడుగా ॥ఓ॥

---

## 10. బ్యాస్ - ఆదితాళం.

జలం—వెనువెంటన్ బడి । నినుబలవంతము । గనుగొనిపోవక మానను వినవే ॥వెను॥

ననురాత్రించర । ఘనవిభునవహేళన మొనరింతువె యుఘచారీ ॥వెను॥

త్రిశ్రగతి.

పార్వ—తగునటరా సురవిరోధి । తరుణులనిటులీడ్చుట । జగతిని పర మపత్రిత । శాపము ఘనతరమురా ॥తగు॥

ఆదితాళం.

జలం__ఓతరుణీమణి యిదివినవే । నీతులు నావెదసరిపడవే । పాతక మదియని । పలుకగ వలదిక ॥ భామినదీర్చుటసాఫల్యముగా ।

పార్వ—చెడెదవు సుమ్మా । దురితమతీ ।

జలం—వదరకుమా । యిక పరుషగతీ ।

(తిశ్రగతి)

పార్వ—అదరు బెదరు లేకనిటుల । నాడుట హితమగునటరా ।
జలం—అదరులేల బెదరులేల చెదరులేల । సుదతి నిన్ను గలియగా ॥
వెను వెంటన్॥

---

11. జంగ్లా—ఝరుజంపె తాళం.

తులసి—ఈశ్వరా ఈశోక మెటు సహించెదను ॥పరమే॥
శాశ్వతైశ్వర్యములు । సంతతవిలాసములు । కాల్పనా పతిప్రే
మ । గల్గనియభాగ్యకో ॥యీ॥
పతిపాదములు గొలువ । పతిపదమునని నిలువ । గతిలేని
భాగ్యహీనత గల్గజేసితివె ॥ఈశ్వ॥

---

12. ఆదితాళం.

తుల—నాప్రాణనాథుని గనుటే । నాటకో హాతవిధీ ॥హానా॥
నాప్రాపని యా నవమోహనాంగు । పదములు గొలువగ ।
గోలితిగా ॥హానా॥

ప్రాణేశ్వరు గనుభాగ్యముగలదో । ప్రాణవిముక్తికి మార్గముగ
లదో । దీనసైతిగా । యేగతి గానక । ప్రాణము తల్లడపాటునందెగా
హా నా॥

---

## 13. హంసధ్వని—జంపెతాళం.

తుళసి—సకలేంద్రియము లార । సమయమిప్పుడుగాదు సద్దుసేయక
యుండరే ఎఎఎఎఎఎఎ ॥సక॥

ప్రకటముగ పతిరూపపటమును బ్రతిష్టించి పతిపూజ సేయు
వేళా ॥సక॥

బంగారుపూలతో । పరితోషముగ హృదయ పద్మమున నిలు
పువేళా । శృంగార వేదిపై నంగజు నిభాంగు । గొల్వంగదగినట్టి వేళా॥
మీారు ॥సక॥

---

## 14. ముఖారి—ఆదితాళం.

తుల—హా నాహృదయేశ్వరా ॥హానా॥

నాపయి ప్రేమవీడి ।నను శాశ్వతముగ । నీభ కావీక । దీపిత
ముగు । దితివంశమువీడి । పోయితివా । మృతికన్యకగూడి ॥హా నా॥

యెన్నడో । నాకునీ । మన్నన । గలదని । యెన్నితి నామది
నున్న యయ్యొనా ॥హానా॥

శ్రీ దామోదర ముద్రాక్షరశాల, చీరాల.